సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 338

బుధవారం 28-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



ప్రపంచ పర్యావరణానికి కొత్త గీతం

-11లో



ఆటో, ఐటీ షేర్ల జోరు... నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు

-11లో



డేటింగ్ విత్ డిప్రెషన్!

ఆన్‌లైన్ ప్రపంచంలో ప్రేమలను వెతుక్కోవడం అంటే సముద్రంలో పారబోసుకున్న మంచినీళ్లను దోసిళ్లతో పట్టుకోవాలనుకోవడం లాంటిది. డిజిటల్ యుగంలో ప్రపంచం చిన్నదైనప్పటికీ మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాలు ఒంటరితనం వైపుగా పయనిస్తున్నాయి. ఫలితంగా ఒంటరి మనసులు భావోద్వేగాల జడిని కనపడని వ్యక్తులతో పంచుకుంటున్నారు.

డేటింగ్ యాప్‌లలో మహిళలు భాగస్వాముల కోసం వెతుకుతూ, వారితో మానసిక అనుబంధాలను పెంచుకొని, కొంతకాలానికి డిప్రెషన్‌కు గురవుతున్నారని, వారి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది అంటున్నారు మానసిక నిపుణులు.

పెరుగుతున్న సమస్య... 35 ఏళ్ల దాటిన వసు (పేరుమార్చడమైనది) లక్షల వ్యాపారాన్ని సులువుగా నిర్వహించే స్టార్టప్‌ను రన్ చేస్తుంది. కానీ, మానసిక సంబంధాన్ని సరిగా నిర్వహించలేక డిప్రెషన్ బారిన పడింది. వసు తల్లి ఈ విషయాన్ని చెబుతూ 'నా కూతురు సొంతంగా నిలదొక్కుకోవాలనే ఆలోచనతో పెళ్లి విషయంలో ఆలస్యం చేసింది. సెటిల్ అయ్యాక ఇక పెళ్లి చేసుకోవాలనే ఆలోచనతో డేటింగ్ యాప్‌లో ఒక అబ్బాయిని ఇష్టపడింది. అతను కూడా నా కూతురితో రోజూ ఆన్‌లైన్‌లో మాట్లాడుతుండేవాడు. ప్రేమిస్తున్నట్టు చెప్పాడు. కొన్నాళ్లు ఇద్దరూ చాటింగ్, వీడియో కాల్స్ చేసుకునేవారు. కానీ, కలవడానికి దూరంగా ఉండేవాడు. నా కూతురు అతనితో ఎమోషనల్‌గా అటాచ్ అయ్యింది. కానీ, ఆ అబ్బాయి సరైనవాడు అని నాకు అనిపించడం లేదు. ఎందుకంటే, కలుద్దామంటే అతను చూడటానికి రావడం లేదు. నా కూతురిని అతని నుంచి దూరంగా ఉంచాలంటే ఏం చేయాలో తెలియట్లేదు' అనేది ఆమె ఆవేదన.

'వర్చువల్ ప్రపంచంలో ప్రేమలు వెతికేవారి సంఖ్య ఇటీవల బాగా పెరుగుతున్న ఈ సమయంలో కూతుళ్ల పట్ల తల్లుల ఆందోళన కూడా పెరుగుతోంది' అంటున్నారు రిలేషన్‌షిప్ కౌన్సెలర్ డాక్టర్ మాధవీ సేథ్. ఈ విషయంలో కొన్ని సూచనలు చేస్తున్నారు.

తెలివిగా వ్యవహరించాలి... ఈ రోజుల్లో తల్లులు చాలా తెలివిగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే కూతుళ్లు బాగా చదువుకుంటూ, బిజినెస్ ఉమెన్‌గా నిలదొక్కుకుంటున్న వారున్నారు. వారికి తమ మంచి చెడులు బాగా తెలుసు. అందుకని, వాళ్లు చాటింగ్ చేయడాన్ని లేదా అబ్బాయితో మాట్లాడడాన్ని నిషేధిస్తే మీ మాట వినరు. నిఘా పెడితే మీ పై నమ్మకం కోల్పోతారు. నమ్మకాన్ని గెలుచుకోవడం ద్వారా మాత్రమే మీరు మీ కూతురిని అర్థం చేసుకోగలరు.

సమయం ఇవ్వండి.. స్త్రీ ఎంతటి సమర్థత, విజయం సాధించినా ప్రేమ విషయంలో చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. కాబట్టి ఆమె అవతలి వ్యక్తి లోపాలను చూడలేదు. కానీ, తెలివిగా ఆమెకు నిజం చెప్పాలి. దీని కోసం మీరు మీ కుమార్తెతో సమయం గడపడం అవసరం. మొదట ఆమె ఆ వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుందో లేదో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అవును అయితే ఆ విషయం గురించి ప్రేమగానే మాట్లాడాలి. అబ్బాయిని ఇంటికి పిలవమని, అతని తల్లిదండ్రులను కలవడానికి ప్లాన్ చేయమని చెప్పాలి. తర్వాత నెమ్మదిగా సాక్ష్యాధారాలతో ఆ అబ్బాయి గురించి నిజాలను కూతురికి చెప్పాలి. నిజానికి ఈ విషయాలు చెప్పాలంటే కష్టం అనిపిస్తుంది. ఎందుకంటే 'ఆమె' ఒంటరితనం ఫీలవుతుంది. ఆమెకు మీ ప్రేమపూర్వక మద్దతు అవసరం. ప్రతి పరిస్థితిలో మీరు ఆమెతో ఉన్నారని మీ కుమార్తెకు భరోసా ఇవ్వండి. వీలైతే మీ కూతురిని కొంతకాలం దూరంగా ఎక్కడికైనా తీసుకువెళ్లండి. దీనివల్ల ఆమె మానసిక స్థితిలో సానుకూలమైన మార్పులు చోటు చేసుకోవచ్చు.

వర్చువల్ ప్రపంచం నుండి బయటకు రండి... ఆన్‌లైన్ ప్రేమ కోసం వెతుకుతున్న యువత వర్చువల్ ప్రపంచం నుండి బయట పడి జనంతో కలిసిపోవాలి. ఒకటి లేదా రెండు రోజులు ఆన్‌లైన్ చాటింగ్ అవతలి వ్యక్తి గురించి ఎక్కువ సమాచారాన్ని అందివ్వవు. డేటింగ్‌యాప్‌లలో మోసం జరిగే అవకాశాలు ఎక్కువ కాబట్టి వాస్తవ ప్రపంచంలో నిజమైన ప్రేమలను వెతుక్కోవాలి. ఒకరికొకరు పరస్పరం కలిసి మాట్లాడుకోవడంలో సాంత్వన పొందుతారు. ఇటువంటి వాటిలో మోసం, భయం ఉండవు. ప్రేమ సంబంధాలలో నమ్మకం ముఖ్యం.

వర్చువల్... నిజాలు... లండన్ లోని ఇంపీరియల్ కాలేజ్ పరిశోధన ప్రకారం దాదాపు 70 శాతం మంది డేటింగ్ యాప్‌లలో భాగస్వాముల కోసం వెతుకుతున్న వ్యక్తులు డిప్రెషన్‌కు గురవుతున్నారనీ, అది వారి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతోందని తేలింది. ఈ రోజుల్లో వ్యక్తులు తరచుగా సంబంధాలను వదులుకోవడానికి చాలా త్వరపడుతుంటారు. ఎందుకంటే, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటూ ఆ దిశగా అన్వేషణ చేయడం కూడా ఇందుకు కారణం అవుతుంటుంది. కోవిడ్ లాక్‌డౌన్ మార్పులు కూడా ఈ స్థితికి బాగా కారణమైంది. ఇంటి నుండి పని మొదలు డేటింగ్ యాప్‌లో రొమాన్స్ చేయడానికి ఓ కొత్తమార్గాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పించింది.

మరికొన్ని సూచనలు..
- ఒంటరిగా ఉండటం వల్ల కలిగే ప్రతికూలతలపై దృష్టి సారించే బదులు మీరు ఆనందించే అంశాలు, అది తెచ్చే స్వేచ్ఛపై దృష్టి పెట్టాలి
- జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యం, అభిరుచులవైపు మనసును మళ్లించాలి. కుటుంబం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

సామాజికంగా కలవాలి...

- ఆన్‌లైన్ డేటింగ్‌లో మరొక వ్యక్తి జీవితాన్ని, సంబంధాలను, వివరాలను ఎప్పటికీ తెలుసుకోలేరు. సోషల్ మీడియా పోస్ట్‌లో సంతృప్తికరమైన సంబంధంలా కనిపించేది నిజ జీవితంలో చాలా భిన్నంగా కనిపించవచ్చు
- ఒంటరిగా ఉన్నప్పుడు వర్చువల్ మీట్–అప్‌లను కూడా స్నేహితులతో ప్లాన్ చేయడం మంచిది
- వారానికి కొన్నిసార్లు మీ ప్రియమైన వారితో ఫోన్‌లో చాట్ చేసినా, ఆన్‌లైన్‌లో ఇంటరాక్ట్ అవుతున్నా మీ ఒంటరితనం అనే భావన దూరం అవుతుంటుంది
- స్వచ్ఛంద సేవ, స్థానిక స్పోర్ట్స్ క్లబ్‌లలో పాల్గొనడం, రీడర్స్ క్లబ్.. వంటివి ఏర్పాటు చేయడం వల్ల ఒంటరితనం దూరం అవడమే కాదు, మనసులో ఉన్న వ్యక్తులను కలుసుకునే అవకాశం కూడా దొరకవచ్చు
- జీవితం ఒక రేస్ కాదు. ఒక నిర్దిష్ట వేగంతో జీవితంలోని మైలురాళ్లను చేరుకోవాల్సిన అవసరం లేదు. అన్నింటి కన్నా ముందు మీకు మీరే ప్రియమైనవారని గుర్తుచేసుకోండి. డేటింగ్ యాప్‌లలోనే కాదు మీ ఆసక్తులు, లక్ష్యాలు, విలువలు పంచుకునే ఒంటరి వ్యక్తులు మీ చుట్టూ పుష్కలంగా ఉన్నారనే విషయం గ్రహించాలి.



– డాక్టర్ మాధవీ సేథ్, రిలేషన్‌షిప్ కౌన్సెలర్

ప్రపంచ పర్యావరణానికి కొత్త గీతం

ఆడవాళ్లకు ఇంటి పని, వంటపని, మహా అయితే చిన్నదో పెద్దదో ఉద్యోగం చేయడం తప్ప పెద్ద పెద్ద ఆర్థిక వ్యవహారాలేం తెలుస్తాయి... అని చప్పరించేసే వారికి చెంపపెట్టు గీతాబాత్రా. భారతదేశానికి చెందిన ఆర్థికవేత్తల పేర్లు కొన్ని చెప్పమంటే మొదటి పది అంకెల్లోనే ఉండే పేరు ఆమెది. ఆర్థికవేత్తగా ఎంతో క్రమశిక్షణతో... అంతకుమించిన నిబద్ధతతో ఆమె తీసుకునే విధానపరమైన కీలక నిర్ణయాలే ప్రపంచ బ్యాంకు తాజా సమావేశంలో ఆమెను గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ ఫెసిలిటీ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేశాయి. అంతే కాదు, ఆ పదవిలో నియామకం అయిన తొలి మహిళా డైరెక్టర్‌గా కూడా యాభై ఏడు సంవత్సరాల గీతాబాత్రా పేరు ఒక్కసారిగా జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో పతాక శీర్షికలకు ఎక్కింది.



● గీతా బాత్రా

నిజానికి ఈ నియామకం ఇప్పటికిప్పుడు తీసుకున్న నిర్ణయం ఏమీ కాదు. సుమారు మూడు వారాల క్రితం వాషింగ్టన్‌లో జరిగిన జీఈఎఫ్ 66వ కౌన్సిల్ మీటింగ్‌లోనే ఆమె పేరు పరిశీలనకు వచ్చింది. ఆ తర్వాత గీతాబాత్రా అయితేనే ఈ పదవికి తగిన న్యాయం చేయగలదని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే ఆమెను ఈ స్థానంలో నియమించారు. అయితే జీఈఎఫ్ డైరెక్టర్‌గా నియమితురాలు కావడం ఆమెకు ఏదో గొప్ప పదవిని కట్టబెట్టినట్టు కాదు... ఎన్నో సవాళ్లతో కూడిన ఎంతో బాధ్యతాయుతమైన స్థానం అది.

1998లో వరల్డ్ బ్యాంక్‌లో చేరడానికన్నా ముందు ఆమె అమెరికాలోని కొన్ని ప్రైవేట్ బ్యాంక్‌లలో పై స్థాయిలో పని చేసింది. అసలు ఆమె నేపథ్యం ఏమిటో చూద్దాం.

గీతాబాత్రాది కొత్తదిల్లీ. ముంబాయిలోని విల్లా థెరిసా స్కూల్‌లో చదువు పూర్తయ్యాక చెన్నైలోని స్టెల్లా మేరిస్ కాలేజీలో అర్థశాస్త్రంలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత ఎంబీఏ ఫైనాన్స్ చేసింది. ఇక ఉద్యోగం చూసుకుందాం అనుకుంటుండగా ఆమె ప్రొఫెసర్లలో ఒకరి ప్రోద్బలంతో అమెరికా వెళ్లి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసింది.



● భర్త ప్రకాష్, కుమార్తె రోషిణీలతో...

అక్కడే అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా కొన్ని సంవత్సరాలపాటు పని చేసింది. వరల్డ్ బ్యాంక్‌కు అనుబంధ సంస్థలలో ఆమె 2005 వరకు పని చేసింది. అప్పుడే ఆమె ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అడ్వైజరీ సర్వీసెస్‌లో పని చేసింది. ఆ తర్వాత ఆమె భారతదేశం నుంచి వరల్డ్ బ్యాంక్ ఐఈజీలో చీఫ్ ఎవల్యూటర్ అండ్ మేనేజర్‌గా కార్పొరేట్ థీమాటిక్ ఎవల్యూషన్ బాధ్యతలు చేపట్టింది. ఆ తర్వాత 2015 లో జీఈఎఫ్ ఐఈవోగా చేరి, నాటినుంచి టీమ్‌తో పని చేయిస్తోంది. నాటినుంచి ఆమె ఎన్నో విపత్కర పరిస్థితులను అధిగమించడంలో ఎంతో సమర్థనీయమైన పాత్రను పోషించింది. ఎన్నో పుస్తకాలు రాసింది. మరెన్నింటికో సంపాదకత్వ బాధ్యతలు వహించింది.

ప్రస్తుతం నార్దర్న్ వర్జీనియాలో భర్త ప్రకాష్, కుమార్తె రోషిణితో కలిసి జీవిస్తోంది.

జీఈఎఫ్ 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ ఫెసిలిటీ) పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ బ్యాంకు చేపట్టే అన్ని బాధ్యతలను ఆమె పర్యవేక్షించడమే కాదు.. అందుకు కావలసిన. కీలక నిర్ణయాలు కూడా తీసుకోనున్నారు.

దివ్యమైన ఫుడ్‌చైన్

కందిపొడితో కలిసిన తాజా నేతి వాసన. కొబ్బరి పచ్చడిలో తాజా కరివేపాకు, మినపప్పుతో వేసిన పోపు వాసన వీధి చివరకు వస్తోంది. ముక్కు చెప్పినట్లు నడుచుకుంటూ వెళ్తే అక్కడ ఓ రెస్టారెంట్. లోపలకి వెళ్లేవాళ్లు, సంతృప్తిగా బయటకు వచ్చే వాళ్లు, క్యూలో ఉన్న వాళ్లను చూస్తే లోపల టేబుల్ దొరకడం కష్టమే, రష్ బాగానే ఉందనిపిస్తోంది. తలెత్తి చూస్తే విశాలమైన బోర్డు కుడివైపు 'ద రామేశ్వరం కేఫ్' అని ఇంగ్లిష్‌లో ఉంది. తమిళ రుచి అనుకునే లోపే ఎడమవైపు అదే పేరు కన్నడ భాషలో ఉంది. మధ్యలో చక్కటి ముగ్గుతో మూర్తీభవించిన దక్షిణాది సంప్రదాయం కనువిందు చేస్తోంది. బెంగళూరులో ఉన్న ఈ రెస్టారెంట్ తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు వేడి వేడిగా వడ్డిస్తూనే ఉంటుంది. ఈ రెస్టారెంట్‌ల యజమాని పాతికేళ్లు కూడా నిండని దివ్య. తాత, తండ్రుల వ్యాపార సామ్రాజ్యాన్ని ఈ అమ్మాయి వారసత్వంగా అందుకున్నదేమో అనుకుంటాం. కానీ ఇది పూర్తిగా ఆమె ఆలోచనే.

మెక్‌డీ... కేఎఫ్‌సీలేనా!

ఫుడ్ చైన్‌ను మించిన వ్యాపారం మరొకటి ఉండదని నమ్మింది దివ్య. సీఏ చేసిన తర్వాత ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో ఎంబీఏలో చేరినప్పటి నుంచి ఫుడ్ చైన్ బిజినెస్‌లో నెగ్గుకురావడం గురించిన మెళకువలు నేర్చుకోవడంలో మునిగిపోయింది. పాశ్చాత్య దేశాల్లో పుట్టిన మెక్ డీ, కేఎఫ్‌సీలను మనం ఆదరిస్తున్నాం. అలాగే దక్షిణాది రుచులను దేశమంతటా విస్తరించడం ఎందుకు సాధ్యం కాదు... అనుకుంది. మార్కెటింగ్ వ్యూహాలను తెలుసుకుంది. కోర్సు పూర్తి అయిన వెంటనే తన ఆలోచనను ఇంట్లో వాళ్ల ముందు బయటపెట్టింది. భర్త రాఘవరావు ఆహార పరిశ్రమల రంగానికి చెందిన వ్యక్తి కావడంతో అతడు మాత్రమే ఆమెకు మద్దతుగా నిలిచాడు. ఇక మిగిలిన వారంతా– 'సీఏ, ఐఐఎమ్‌లో పీజీ చేసిన అర్హతలకు పెద్ద కంపెనీలో భారీ వేతనంతో ఉద్యోగం దొరుకుతుంది, హాయిగా ఉద్యోగం చేసుకోక ఇంత చదువూ చదివి ఇడ్లీలు, దోశలు, ఊతప్పాలా' అన్నారు. ఎవరెన్ని చెప్పినా ఆమె తన అభీష్టాన్ని నెరవేర్చుకుని తీరాలని నిర్ణయించుకుంది. ఇపుడామె కారం పొడి చల్లిన నెయ్యి దోశలు, స్పాంజిలాగ మెత్తని ఇడ్లీలు, ఊతప్పం, గుంత పొంగనాలు, మూడు రకాల చట్నీలు, సాంబారు... ఈ ఘుమఘుమలు బెంగళూరు నుంచి మన హైదరాబాద్‌ను తాకి, దేశం దాటి దుబాయ్‌కి కూడా చేరాయి. ఇకపై సింగపూర్‌కి విస్తరించాలనేది దివ్య లక్ష్యం. తన ఫుడ్ చైన్‌కి 'ద రామేశ్వరం కేఫ్' అని పెట్టడానికి కారణం తాను అత్యంత ఎక్కువగా గౌరవించే మన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ సొంతూరు రామేశ్వరం (తమిళనాడు రాష్ట్రం) కావడమే అంటోంది. పెద్ద కలలు కనమని చెప్పిన కలామ్‌కి తన విజయాన్ని అంకితం చేసింది దివ్య.



● దివ్య



● 'ద రామేశ్వరం కేఫ్' రెస్టారెంట్



● భర్త రాఘవరావుతో దివ్య

యూత్ పల్స్



'వ్యాపారం మొదలుపెట్టాలనుకుంటున్నాను. డబ్బు లేదు' అనే వాళ్లలో చాలామందికి ఐడియా ఉండదు. అంటే... ఏ వ్యాపారాన్ని ప్రారంభించాలి, ఎక్కడ ప్రారంభించాలి, ఎప్పుడు ప్రారంభించాలి... మొదలైన విషయాలపై అవగాహన ఉండదు. 'అద్భుతమైన ఐడియా' మన దగ్గర ఉంటే వ్యాపారం ప్రారంభించడానికి పెట్టుబడి అనేది పెద్ద సమస్య కాదని యువతరంలో ఎంతోమంది నిరూపించారు. 'షార్క్ ట్యాంక్ ఇండియా' నుంచి 'ఇండియన్ స్టార్టప్ స్టోరీస్' లాంటి ఎన్నో టీవీ షోల ద్వారా స్ఫూర్తి పొంది ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కంటున్న యువతరం ఆ కల దగ్గరే ఆగిపోవడం లేదు. దానిని సాకారం చేసుకోవడానికి ఎంతో ఇష్టంగా కష్టపడుతున్నారు...

'షార్క్ ట్యాంక్ అమెరికా కార్యక్రమాన్ని ఇష్టంగా చూసేదాన్ని. డల్లాస్ మావరిక్స్ ఓనర్ మార్క్ క్యూబన్, బ్రాక్ సిస్టమ్స్ ఫౌండర్ రాబర్ట్ హర్జెవెక్, ఫర్ యువర్ ఈజీ వోన్లీ ఫౌండర్, ప్రెసిడెంట్ లారీ గ్రైనర్‌లు ఎంతోమంది ఎంటర్‌ప్రెన్యూర్‌లు కావడానికి సహాయం అందించారు. షార్క్‌ట్యాంక్ ఇండియన్ వెర్షన్ విషయంలో మొదట్లో ఆసక్తి ఉండేది కాదు. ఆ తరువాత మాత్రం ఆసక్తి పెరిగింది' అంటుంది ముంబైకి చెందిన సైకాలజీ స్టూడెంట్ అహానా గుప్తా.

'ఒక స్టార్టప్ విజయవంతం కావడానికి ఏ అంశాలు తోడ్పడతాయి, మార్కెట్‌కు సంబంధించిన సాధ్యాసాధ్యాలు ఏమిటి, వెంచర్ క్యాపిటలిస్ట్‌ను ఒప్పించడానికి ఎలాంటి ప్రణాళికను అనుసరించాలి... మొదలైనవి షార్క్ ట్యాంక్ లాంటి టీవీ కార్యక్రమాల ద్వారా నేర్చుకున్నాను' అంటుంది కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ స్టూడెంట్ సుతీర్థ సుహా.

'డిస్కవరీ ప్లస్‌లో ఇండియన్ స్టార్టప్ స్టోరీస్ చూశాను. చూస్తున్న క్రమంలో నాకు తెలియకుండానే బిజినెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విషయాలపై ఆసక్తి పెరిగింది' అంటుంది చెన్నైకి చెందిన ఎంబీఏ స్టూడెంట్' శ్రేయా ఘోష్.

'స్టార్టప్‌లకు సంబంధించిన పరిజ్ఞానానికి పెద్ద నగరాలలో చదవాల్సిన పనిలేదని, ఐఐటీలు, ఐఐఎంలు మాత్రమే స్టార్టప్‌లను విజయవంతంగా సృష్టించగలవనే మూస ధోరణిని స్టారప్‌లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన టీవీ కార్యక్రమాలు బ్రేక్ చేస్తున్నాయి' అంటుంది దిల్లీకి చెందిన స్టాటిస్టిక్స్ స్టూడెంట్ సప్తర్షి.

'ఒక కంపెనీ ఈక్విటీ, వాల్యుయేషన్‌ను అర్థం చేసుకోవడానికి ఏ అంశాలు దోహదపడతాయి, మార్కెట్ నుంచి తెలుసుకోవాల్సిన విషయాలు ఏమిటీ... వంటివి షార్క్ ట్యాంక్ ద్వారా తెలుసుకున్నాను' అంటుంది వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ స్టూడెంట్ సహేలి సాహు.

అహానా, సుతీర్థ, శ్రేయ, సప్తర్షి, సహేలి మాత్రమే కాదు...

ఇంజినీరింగ్, కామర్స్, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్... తాము చదువుతున్నది ఏదైనా సరే దేశవ్యాప్తంగా ఎంతోమంది స్టూడెంట్స్ స్టార్టప్‌లకు సంబంధించి టీవీలో వచ్చే రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రాక్టికల్–లైఫ్ బిజినెస్ నాలెడ్జ్‌ను సొంతం చేసుకుంటున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్స్, బిజినెస్ స్ట్రాటజీల గురించి వివరంగా తెలుసుకోవడమే కాదు వ్యాపార రంగంలోకి కూడా అడుగుపెడుతున్నారు.

షార్క్ ట్యాంక్ మాత్రమే కాదు బిలియన్ డాలర్ బయర్(వూట్ టీవీ నెట్‌వర్క్), సిలికాన్ వ్యాలీ (డిస్నీ ప్లస్ హాట్ స్టార్), ఇండియన్ స్టార్టప్ స్టోరీస్ (డిస్కవరీ ప్లస్), స్టార్టప్ (అమెజాన్ ప్రైమ్ వీడియో), అప్‌స్టార్స్ (నెట్‌ఫ్లిక్స్), ప్లానెట్ ఆఫ్ ది యాప్స్(యాపిల్ టీవీ), గర్ల్‌బాస్–టీవీ సిరీస్ (నెట్‌ఫ్లిక్స్)... మొదలైన షోలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి.

ది క్వర్కీ నారీ

మదురైకి చెందిన మాళవిక సక్సేనాకు మనసుకు నచ్చిన ఫుట్‌వేర్ కనిపించేది కాదు. ఏది చూసినా 'ఇది నాకు కరెక్ట్ కాదు' అనిపించేది. కొత్తదనం లోపించిన ఫుట్‌వేర్‌లను చూసీ చూసీ చివరికి హ్యాండ్–పెయింటెడ్ షూ బ్రాండ్ 'ది క్వర్కీ నారీ'ని లాంచ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని క్రియేట్ చేసింది. ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సహాయం తీసుకుంది. 'షార్క్ ఇండియా'లో 'ది క్వర్కీ నారీ' 35 లక్షల ఫండింగ్‌ను గెలుచుకుంది. 'ఎపిసోడ్ ప్రసారం కాగానే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు పదివేల మంది కొత్త ఫాలోవర్‌లు యాడ్ అయ్యారు. కేవలం నలభై ఎనిమిది గంటల్లో అమ్మకాలు బాగా పెరిగాయి' అంటుంది మాళవిక సక్సేనా.



హార్ట్ అప్ మై స్లీవ్స్

సైకాలజీలో గ్రాడ్యుయేట్ అయిన రియాకు 'ఫ్యాషన్' అంటే ఇష్టం. ఫ్యాషన్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా పేరు తెచ్చుకోవాలనేది తన కల. 18–33 ఏళ్ల వయసు ఉన్న మహిళలను దృష్టిలో పెట్టుకొని పదివేల రూపాయల పెట్టుబడితో 'హార్ట్ అప్ మై స్లీవ్స్' కంపెనీ మొదలుపెట్టింది. 'షార్క్ ట్యాంక్ ఇండియా' కార్యక్రమంలో తన ఐడియాను వినిపించిన తరువాత ఇన్వెస్టర్‌లు వినీతా సింగ్, అనుపమ్ మిట్టల్ నుంచి రూ. 25 లక్షల ఫండ్ అందుకుంది. 'ఎన్నో డ్రెస్‌లు ఉన్నా ఏది వేసుకోవాలో అనే దాని గురించి ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను... అనే మాట చాలా మంది మహిళల నోటి నుంచి విన్నాను. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్లీవ్స్ ద్వారా ప్రతి డ్రెస్‌కు గ్లామరస్ లుక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. వ్యాపారంలో వినీతా సింగ్, అనుపమ్ మిట్టల్‌లకు ఉన్న అనుభవం, సలహాలు మా వ్యాపారాన్ని విస్తరించడానికి సహాయపడతాయి అని నమ్ముతున్నాను' అంటుంది రియా.



కవచ్

'షార్క్ ట్యాంక్ ఇండియా'లో ఫండ్స్ అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది 13 సంవత్సరాల అనౌష్కా జాలీ. ఆరవ తరగతిలో యాంటీ–బుల్లీయింగ్ స్క్వాడ్(ఎబీఎస్) అనే వెబ్‌సైట్‌కు రూపకల్పన చేసింది. మూడు సంవత్సరాల పాటు యాంటీ–బుల్లీయింగ్ సెషన్స్ నిర్వహించిన అనౌష్క ఆ తరువాత బుల్లీయింగ్‌పై ఫైట్ చేయడానికి 'కవచ్' అనే యాప్‌ను రూపొందించింది. 'షార్క్ ట్యాంక్'లో 'కవచ్' 50 లక్షల ఫండింగ్‌ను గెలుచుకుంది.



హెల్త్ టిప్స్



- నిమ్మ చెక్క మీద ఉప్పు, మిరియాల పొడి చల్లి స్టౌ మీద ఉంచి, కొద్దిగా వేడి చేసి, ఆ రసాన్ని పిండుకొని తాగితే మైగ్రేన్ నుంచి ఉపశమనం దొరుకుతుంది
- నిమ్మ రసం, తేనె, గ్లిజరిన్‌లను సమపాళ్ళలో కలపాలి. రోజుకు మూడుసార్లు ఒక టీస్పూను చొప్పున తీసుకుంటే దగ్గు త్వరగా తగ్గుతుంది
- ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి, తల తిరిగినట్లు ఉంటుంది. చిన్న అల్లం ముక్క నూరి నిమ్మరసంలో కలిపి తాగితే ఈ బాధల నుంచి ఉపశమనం కలుగుతుంది.


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 338

బుధవారం 28-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దేశాభివృద్ధిలో భాగస్వామ్యం..

దేశీ కార్పొరేట్లపై ఆర్థిక మంత్రి సీతారామన్ విశ్వాసం - 11లో



బెంగళూరు ధనాధన్...


గుజరాత్‌పై 12.3 ఓవర్లలోనే విజయం. రాణించిన స్మృతి, రేణుక, మేఘన. - 10లో



కేజ్రీవాల్‌కు మళ్లీ నోటీసులు

లిక్కర్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ మరోసారి సమన్లు పంపింది.

- వివరాలు 6లో



బందీలను వదిలితేనే..

రంజాన్ మాసారంభంలోగా యుద్ధ విరామానికి ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పారు.

- వివరాలు 6లో



జోరుగా క్రాస్ ఓటింగ్..

రాజ్యసభ ఎన్నికల్లో జోరుగా క్రాస్ ఓటింగు సాగింది. సంఖ్యాబలం ప్రకారం 8 స్థానాలు నెగ్గాల్సిన బీజేపీ మరో 2 చోట్ల గెలుపొందింది.

- వివరాలు 6లో



హక్కుల నేతకు 30 నెలల జైలు

ఉక్రెయిన్‌పై దాడిని తప్పుబట్టిన రష్యా మానవ హక్కుల కార్యకర్త ఒలెగ్ ఓర్లోవ్‌కు మాస్కో కోర్టు 30 నెలల జైలుశిక్ష విధించింది.

- వివరాలు 6లో

200 యూనిట్ల ఫ్రీ విద్యుత్, రూ.500కు సిలిండర్ షురూ..

పథకాలు ఆగవు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకాలు అమలు చేసి తీరుతాం: సీఎం రేవంత్



గృహజ్యోతి లబ్ధిదారులతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి, కొండా సురేఖ, స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎస్ శాంతికుమారి తదితరులు

- 6 గ్యారంటీల వల్లే కాంగ్రెస్ గెలుపు.. సవాళ్లెదురైనా హామీలు నెరవేరుస్తాం
- అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత విద్యుత్: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా ఎన్నికల సమయంలో అభయహస్తం కింద ఇచ్చిన హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో తమ చిత్తశుద్ధిని శంకించవద్దని అన్నారు. ఆర్థిక నియంత్రణ పాటిస్తూ, దుబారా ఖర్చులు తగ్గించుకుని సంక్షేమ పథకాలను ఆర్థిక వెసులుబాటు మేరకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సచివాలయంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తదితరులతో కలిసి సీఎం ప్రారంభించిన అనంతరం రేవంత్ మాట్లాడారు.

సంక్షేమ పథకాలు ఆపం

'డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ఇప్పుడు మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నాం. తెలంగాణ ఇచ్చిన విధంగానే, 2023 సెప్టెంబర్ 17న మిగతా 2వ పేజీలో ▶

ఇక ఇందిరమ్మ కమిటీలు..

- గ్రామాల్లో ఏ పథకమైనా వాటి ద్వారానే లబ్ధిదారుల ఎంపిక.. అమలు
- చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ 'జన జాతర' సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- గ్రామాల్లో ఐదుగురితో ఏర్పాటు
- మేం ఉద్యోగాలిస్తుంటే ఓర్వలేక శాపనార్థాలు
- కేటీఆర్.. దమ్ముంటే ఒక్క ఎంపీ సీటైనా గెలిపించి చూపించు
- ఇది ఇనాం కుర్చీనో.. వారసత్వంగా వచ్చిందో కాదన్న సీఎం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నామని.. ప్రభుత్వం ప్రకటించిన ఏ పథకానికైనా ఇకపై ఆ కమిటీల ద్వారానే అర్హులు/లబ్ధిదారులను ఎంపిక చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వివిధ సామాజికవర్గాలకు చెందిన ఐదుగురు సభ్యులతో ఈ కమిటీలను ఏర్పాటు చేస్తామని, వాటిద్వారానే పథకాలను అందజేయనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో మిగతా 2వ పేజీలో ▶



'గగన్‌యాన్' వ్యోమగాములు.. ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, సుభాన్షు శుక్లాను జాతికి పరిచయం చేస్తున్న ప్రధాని మోదీ

భారత 'సూపర్ ఫోర్'

గగన్‌యాన్ వ్యోమగాములను జాతికి పరిచయం చేసిన మోదీ

ప్రతిష్టాత్మక ఆస్ట్రోనాట్ వింగ్స్ ప్రదానం

- మన అంతరిక్ష సంస్థ ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. మిషన్‌లో పాల్గొని రోదసిలోకి వెళ్లనున్న నలుగురు భారత వ్యోమగాములను ప్రధాని మోదీ మంగళవారం జాతికి పరిచయం చేస్తూ వారి పేర్లను స్వయంగా ప్రకటించారు. అనంతరం మానవ సహిత యాత్రకు ముందు గగన్‌యాన్‌లో భాగంగా రోదసిలోకి వెళ్లనున్న హ్యూమనాయిడ్ రోబో వ్యోమమిత్రతో సరదాగా సంభాషించారు. మానవసహిత గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా 2025లో ముగ్గురు వ్యోమగాములను రోదసిలో 400 కి.మీ.ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలోకి పంపి 3 రోజుల తర్వాత సురక్షితంగా వెనక్కి తీసుకురావాలన్నది ఇస్రో లక్ష్యం. ఇది విజయవంతమైతే అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఈ మిషన్ కోసం రూ.10 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. - 6లో

"4 దశాబ్దాలుగా దేశం కంటున్న కలను ఈ నలుగురు వ్యోమగాములు 140 కోట్ల మంది భారతీయుల కలలకు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవనున్న నాలుగు ప్రబల శక్తులు. గగన్‌యాన్ మిషన్ పూర్తిగా దేశీయంగా రూపుదిద్దుకుని మేకిన్ ఇండియాకు తార్కాణంగా నిలిచింది. - ప్రధాని మోదీ

గ'ఘన'యానులు

బీజేపీలోకి బీఆర్‌ఎస్ ఎంపీలు?



- ఇప్పటికే నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు చేరికకు లైన్‌క్లియర్.. రేపు పార్టీలో చేరే అవకాశం !
- అదే దారిలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఓ ఎంపీ... మొదట్లో ఆసక్తి కనబరిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ
- సిట్టింగ్ ఎంపీల చేరికను బట్టి ఎంపీ అభ్యర్థుల ఖరారుపై ఓ స్పష్టత
- 29న 8 నుంచి 10 లోక్‌సభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన...?

సాక్షి, హైదరాబాద్: ఒకరిద్దరు సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరేందుకు లైన్‌క్లియర్ అయింది. గురువారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ సమావేశం జరిగే పక్షంలో ఆరోజుగానీ మరుసటి రోజుగానీ ఈ చేరికలు ఉండొచ్చని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒక ఎంపీ మాత్రం గురువారం మంచిరోజు ఉందని, ఆ రోజే పార్టీలో చేరుతానని చెప్పినట్టు తెలిసింది. ఇటీవల అచ్చంపేటలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు గైర్హాజరయ్యారు. ఆయనతోపాటు కుమారుడు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, బీజేపీ అధిష్టానం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ఆ పార్టీవర్గాల విశ్వసనీయ సమాచారం. అయితే ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఒక సిట్టింగ్ ఎంపీ, ఉమ్మడి ఖమ్మం నుంచి మరో సిట్టింగ్ ఎంపీ కూడా తమ పార్టీలో చేరే అవకాశాలున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సదరు ఎంపీ గతంలో ఉత్సాహం చూపినా, ఆ తర్వాత కొంత ఆచితూచే ధోరణితో ఉండడంతో చేరికపై పూర్తి స్పష్టత రాలేదని తెలుస్తోంది.

టికెట్‌పై భరోసా ఇస్తే...?

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాము సిట్టింగ్‌లుగా ఉన్న చోట నుంచే అవకాశం ఇవ్వాలంటూ ఉమ్మడి మెదక్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు ఎంపీలు బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి భరోసా కోరినట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న అంచనాల నేపథ్యంలో పలువురు సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆ పార్టీనేతలు చెబుతున్నారు. బీజేపీలోకి ఇతర పార్టీల నుంచి సిట్టింగ్ ఎంపీల చేరికను బట్టి 17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై ఓ స్పష్టత వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నెల 29న లేదా మరో తేదీన జరిగే పార్టీ పార్లమెంటరీ బోర్డు భేటీలో రాష్ట్రానికి సంబంధించిన 8 నుంచి 10 ఎంపీ మిగతా 3వ పేజీలో ▶



తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

బీఆర్‌ఎస్ 'చలో మేడిగడ్డ'

- మార్చి 1న కేటీఆర్ నేతృత్వంలో పార్టీ కీలక నేతల పర్యటన
- కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను ప్రజల్లోనే ఎండగడతాం: కేటీఆర్
- మాతో వస్తే కాంగ్రెస్ మంత్రులనూ వెంట తీసుకెళ్తాం
- మేడిగడ్డలో 3 పిల్లర్లకు పగుళ్లు ఉంటే కాళేశ్వరాన్ని కూల్చేసే కుట్ర
- పాడైన బ్యారేజీల మరమ్మతుకు ఇంజనీరింగ్ పరిష్కారాలు

సాక్షి, హైదరాబాద్: 'మేడిగడ్డ బ్యారేజీలో రెండు మూడు పిల్లర్లకు పగుళ్లు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర చేస్తోంది. మేడిగడ్డపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎండగట్టడంతోపాటు కాళేశ్వరం ద్వారా అందుతున్న ఫలాలను ప్రజలకు వివరిస్తాం. దీని కోసం మార్చి 1న 'చలో మేడిగడ్డ'కార్యక్రమం చేపడుతున్నాం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు మాజీ మంత్రులు, ఇతర ముఖ్య నేతలు తెలంగాణ భవన్ నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు బయలుదేరి వెళ్తాం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ తదితరులతో కలిసి కేటీఆర్ మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. దశలవారీగా కాళేశ్వరంలోని ప్రతీ రిజర్వాయర్‌ను సందర్శించడంతోపాటు కాంగ్రెస్ మంత్రులు తమ వెంట వస్తే వారినీ తీసుకెళ్తామని చెప్పారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు కేటీఆర్ మాటల్లోనే...

రైతాంగంపై కక్షపూరిత వైఖరి మానుకోండి

మరమ్మతులు చేపట్టకుండా వచ్చే వర్షాకాలంలో కాళేశ్వరంలో అంతర్భాగమైన మూడు బ్యారేజీలు వరదలో కొట్టుకుపోయేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. నేరపూరిత మనస్తత్వంతోనే బ్యారేజీలకు మరమ్మతు చేయకుండా రోజూ వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతోంది. గతంలోనూ కాంగ్రెస్ మిగతా 3వ పేజీలో ▶

మార్చి 10న బీఆర్‌ఎస్ 'చలో కరీంనగర్'

- మేడిగడ్డపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేలా బహిరంగ సభ
- సభ ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా నేతలతో కేటీఆర్ భేటీ - 3లో

డ్రగ్ పార్టీలో డైరెక్టర్ క్రిష్

- మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ వెల్లడి
- కొకైన్ తీసుకున్నాడా లేదా? తేలాల్సి ఉంది
- ఆయన్ను విచారించి వైద్య పరీక్షలు నిర్వహిస్తాం
- పెడ్లర్ సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీని అరెస్టు చేశాం



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన డ్రగ్ పార్టీలో ప్రముఖ సినీ దర్శకుడు క్రిష్ పాల్గొన్నట్టు మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ తెలిపారు. అయితే కొకైన్ వాడారా? లేదా? అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈ పార్టీ కోసం డ్రగ్ సరఫరా చేసిన (పెడ్లర్) సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీని అరెస్టు చేశామని చెప్పారు. రాడిసన్ హోటల్‌లో గజ్జల వివేకానంద్‌కు 10 సార్లు మాదకద్రవ్యాలు సప్లయ్ చేసినట్లుగా అబ్బాస్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడని వివరించారు. చాలాసార్లు మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఫిర్యాదు చేస్తే అంతు చూస్తాం



మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి చందాదారులకు కొన్ని నెలలుగా బెదిరింపులు వస్తున్నాయి. మరికొందరికి రామోజీ ముఠా ఫోన్లు చేసి వేధిస్తోంది. కొందరిని తమ చిట్‌ఫండ్ కార్యాలయాలకు పిలిపించుకుని మరీ బెదిరిస్తోంది.

- వివరాలు 12లో

'ధరణి' అధికారాల బదలాయింపు!



ఇకపై 'ధరణి' దరఖాస్తుల పరిష్కార అధికారాలను తహసీల్దార్లు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ)కు కట్టబెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు అధికారాల బదలాయింపు కసరత్తు చురుగ్గా సాగుతోంది.

- వివరాలు 5లో


తహసీల్దార్లకు మినహాయింపు..



ఎన్నికల బదిలీల నుంచి తహసీల్దార్లను మినహాయించనున్నారు. కేంద్రఎన్నికల సంఘం మంగళవారం జారీచేసిన తాజా ఉత్తర్వుల మేరకు ఆర్డీఓ స్థాయి వరకే బదిలీలు జరుగుతాయని రెవెన్యూ వర్గాలంటున్నాయి.

- వివరాలు 12లో


ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు



'ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు సీఎం కావడం మన దురదృష్టం' అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

- వివరాలు 3లో

ఇంతంజాయేత్



అదేదో సారు ఇప్పుడే కొత్తగా చేసినట్లు మాట్లాడుతున్నారే.. వెళ్లండి!

11,062 పోస్టులతో

రేపు డీఎస్సీ నోటిఫికేషన్



మే 3వ వారంలో పరీక్ష.. 10 రోజుల పాటు నిర్వహణ

పాత నోటిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనేలా సాఫ్ట్‌వేర్ తయారీ

గత డీఎస్సీకన్నా పోస్టుల సంఖ్య పెరగడంతో భారీగా దరఖాస్తులు రావొచ్చని అంచనా

ప్రశ్నపత్రాలు మొదలు ఫలితాల వరకూ సాంకేతికతను వినియోగించేలా కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ నోటిఫికేషన్ గురువారం వెలువడే అవకాశం ఉంది. మే 3వ వారంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన అధికారులు ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. పది రోజులపాటు పరీక్ష నిర్వహించే వీలుందని... ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ కూడా ఖరారైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తం 11,062 టీచర్ పోస్టులను విద్యాశాఖ ప్రతిపాదించగా దీనికి ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించింది. దీంతో నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి. వాస్తవానికి బుధవారమే నోటిఫికేషన్ ఇవ్వాలని భావించినా షెడ్యూల్ ఖరారు, సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు తుది మెరుగులు దిద్దాల్సి ఉండటంతో ఒకరోజు ఆలస్యం కావొచ్చని అధికారులు తెలిపారు. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చారు. వాటితోపాటు కొత్త పోస్టులు కలుపుకొని డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కారణంగా పాత నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. అయితే గతంలో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనేలా సాఫ్ట్‌వేర్‌కు రూపకల్పన చేస్తున్నారు.

ఎస్జీటీ పోస్టులే ఎక్కువ..

విద్యాశాఖలో మొత్తం 21 వేల టీచర్ పోస్టుల ఖాళీలున్నట్లు లెక్కగట్టారు. వాటిల్లో ఎస్జీటీలను నేరుగా నియమించడానికి వీలుంది. కాబట్టి ప్రస్తుతం డీఎస్సీలో ప్రకటించే 11,062 పోస్టుల్లో 6,500 పోస్టులు ఎస్జీటీలే ఉండే వీలుంది. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలపై మరికొంత స్పష్టత రావాల్సి ఉంది. పదోన్నతుల ద్వారా ఎస్జీటీలతో 70 శాతం వరకూ భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం నేరుగా నియామకం చేపడతారు. పదోన్నతులకు సంబంధించి న్యాయ వివాదం ఉండటంతో ఎస్‌ఏ పోస్టులపై ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. కాబట్టి 1,500–2,000 వరకూ ఎస్‌ఏ పోస్టులను నేరుగా డీఎస్సీ ద్వారా చేపట్టే వీలుంది. భాషా పండితులు, పీఈటీలు ఇతర పోస్టులు కలుపుకొని మొత్తం 11,062 పోస్టులు ఉండే వీలుందని తెలుస్తోంది. గతేడాది ప్రకటించిన డీఎస్సీకి 1,77,502 దరఖాస్తులొచ్చాయి. ఈసారి పోస్టులు పెరగడంతో భారీగా దరఖాస్తులు వచ్చే వీలుందని మిగతా 5వ పేజీలో ▶

లక్ష కోట్లు.. 5 లక్షల ఉద్యోగాలు

- 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ రెండో దశ చేపడతాం
- బయో ఏషియా సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- మెదక్, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఫార్మా విలేజీల ఏర్పాటు
- హైదరాబాద్‌లో ప్రారంభమైన 21వ బయో ఏషియా సదస్సు
- వివిధ దేశాలకు చెందిన 100కు పైగా సైంటిస్టులు, ప్రతినిధులు హాజరు
- పలు దేశాల ప్రతినిధులతో విడివిడిగా భేటీ అయిన సీఎం




సదస్సులో అతిథులకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జీనోమ్ వ్యాలీ రెండో దశను 300 ఎకరాల్లో నెలకొల్పుతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రూ.2 వేల కోట్లతో దానిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. 10 ఫార్మా విలేజీలను ఏర్పాటు చేసి.. రూ.లక్ష కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, 5 లక్షలకుపైగా కొత్త ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో 21వ బయో ఏసియా–2024 సదస్సు ప్రారంభమైంది. ప్రపంచ దేశాలకు చెందిన 100 మందికిపైగా ప్రముఖ సైంటిస్టులు, విదేశీ ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. జీవవైవిధ్యం, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు, వైద్య రంగంలో మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీసీ కులాల పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత తమ కులాలను ఓబీసీ జాబితా నుంచి తప్పించారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. విభజన అనంతరం తెలంగాణకు చెందిన శెట్టిబలిజ సహా 28 వెనుకబడిన కులాలు రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయంటూ దాఖలైన పలు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలే ధర్మాసనం ముందుకొచ్చాయి. తెలంగాణకు చెందిన ఓబీసీల కేసు అని, విభజన తర్వాత పలు కులాలను ఓబీసీల నుంచి తప్పించారని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం, తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ...రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిందని, సెన్సెస్ నిమిత్తం రూ.150 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆరు నెలల్లో రిపోర్టు వస్తుందని తెలపగానే... అంతవరకూ వేచిచూడలేమని ధర్మాసనం తెలిపింది. కేసు వివరాలు నాన్‌మిస్‌లీనియస్ (రెగ్యులర్ కేసుల విచారణ జరిగే) రోజున వింటామని తదుపరి విచారణ ఏప్రిల్ 3కు వాయిదా వేస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది.

గోదావరి సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీయాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం అర్ధాంతరంగా వాయిదాపడింది. మంగళవారం ఉదయం ఇక్కడి జలసౌధలో బోర్డు చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ నుంచి ఈఎన్సీ(జనరల్) జి.అనిల్ కుమార్, సీఈ(హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి) శంకర్ నాయక్, ఎస్‌ఈ కోటేశ్వరరావు, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యప్రసాద్ హాజరయ్యారు. అయితే దీనికి ఏపీ హాజరుకాలేదు. సమావేశానికి హాజరుకాలేమని ఇదివరకే ఏపీ తెల్చిచెప్పిన విషయం విదితమే. ఏపీ అధికారులు దూరంగా ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు బోర్డు చైర్మన్ ప్రకటించారు. తదుపరి సమావేశం ఈనెల 29న లేదా మార్చి 1న నిర్వహిస్తామని బోర్డు తెలిపింది. మార్చి 1వ తేదీ తర్వాత ఏ క్షణంలోనైనా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున, ఆలోగా సమావేశం నిర్వహించనున్నట్లు బోర్డు పేర్కొంది. సమావేశం ఎప్పుడు పెట్టినా హాజరవుతామని తెలంగాణ సమాచారం ఇచ్చింది.

నాకు ఎలాంటి నోటీసులు అందలేదు

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ నుంచి తనకు ఎలాంటి నోటీసులూ అందలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ స్పష్టం చేశారు. ఒకవేళ లీగల్ నోటీసులు అందితే అధిష్టానం, న్యాయవాదులతో చర్చించి సమాధానం ఇస్తానన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ లీగల్ సెల్ రంగంలోకి దిగబోతుందని తెలిపారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీని కించపరిచేలా ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ, ఇరిగేషన్, ఐటీ, పరిశ్రమల శాఖల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన కాంగ్రెస్.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఎస్‌వోసీకి ఐదు వారాల గడువివ్వండి

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ను కోరిన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీకి వీలుగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా టర్మ్ అండ్ రిఫరెన్స్ (టీఏఆర్) జారీ చేయడంతో, దానిపై విచారణకు సంబంధించిన స్టేట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) దాఖలుకు ఐదువారాల గడువు ఇవ్వాలని కృష్ణా ట్రిబ్యునల్‌ను తెలంగాణ కోరింది. కృష్ణా జలాల విషయంలో ఏ విధంగా తెలంగాణకు అన్యాయం జరిగిందో వివరిస్తూ... బేసిన్ పారామీటర్, బేసిన్ వెంట నివాసం ఉంటున్న జనాభా, పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతాలను నివేదిస్తూ ఎస్‌వోసీని దాఖలు చేయనున్నారు. సమగ్రంగా ఎస్‌వోసీ దాఖలు చేయాల్సి ఉండటంతో ఐదువారాల సమయం ఇవ్వాలని జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్–2)ను కోరుతూ తెలంగాణ పిటిషన్ దాఖలు చేయ గా, ఆరు వారాల గడువు కోరుతూ ఏపీ మరో పిటిషన్ వేసింది. కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలకు పంచే టీఏఆర్‌పై ఏపీ తొలినుంచీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. దీనిపై విచారణ చేపట్టకుండా ట్రిబ్యునల్‌ను నిలువరించాలని కోరుతూ సుప్రీంకోర్టులో కేసు కూడా దాఖలు చేసింది. టీఏఆర్ విచారణ చేయరాదని కోరుతూ ఏపీ ఎస్‌వోసీ దాఖలు చేసే అవకాశాలున్నాయి. తెలుగు రాష్ట్రాలు గడువు పెంపు కోరుతూ పిటిషన్లు వేయడంతో ఈ విజ్ఞప్తికి అనుకూలంగా ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.



చేవెళ్లలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ సభా వేదికపై డిప్యూటీ సీఎం భట్టితో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో పొన్నం ప్రభాకర్, దీపాదాస్ మున్షీ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఇక ఇందిరమ్మ కమిటీలు

▶ మొదటి పేజీ తరువాయి

పేదబిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వడాన్ని భరించలేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత వంటివారంతా కాంగ్రెస్ పార్టీకి శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్లలో 'జన జాతర' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఇందులో సీఎం రేవంత్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

''నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ జరిగింది. నియామకాల ముసుగులో ఒక్క కుటుంబంలోని వారికే పదవులు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీచేశాం. ఇది చూసి ఓర్వలేని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితారావు అంతా కలిసి కుట్ర చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి శాపనార్థాలు పెడుతున్నారు. పేదల బిడ్డలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తే మీ కడుపు మండిందా?

త్వరలోనే మెగా డీఎస్సీ

నీ బిడ్డ కవితను ప్రజలు ఓడిస్తే.. ఆరు నెలల్లోనే ఎమ్మెల్సీని చేశావు. ఎంపీగా ఓడిన బంధువు వినోద్‌రావును ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చేశావు. మా పేదోళ్లు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీ బిడ్డలు పదేళ్లు తల్లిదండ్రుల కష్టార్జితంతో అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ కోచింగ్ సెంటర్లలో చదివినా ఉద్యోగాలు రాక, పెళ్లిళ్లుగాక రోడ్లపై తిరుగుతుంటే.. చెట్లకు ఉరేసుకుని చనిపోతుంటే... ఏ ఒక్కరోజైనా ఆలోచన చేశావా కేసీఆర్? నువ్వు మనిషివా.. మానవ రూపంలో ఉన్న మృగానివా? ఏ ఒక్కరోజైనా ఆ పేదబిడ్డల గురించి ఆలోచన చేశావా? కానీ కాంగ్రెస్ వచ్చిన వెంటనే 25వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేశాం. మార్చి 2న మరో రెండు వేల గ్రూప్స్ పోస్టులు భర్తీ చేస్తాం, త్వరలోనే మెగా డీఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తాం.

కుర్చీని తాకడం నీ తరం కాదు

బీఆర్ఎస్ పాలనలో పరీక్ష పత్రాలను జిరాక్స్ సెంటర్లలో పల్లీ బఠానీల్లాగా అగ్రాస్ (వేలం) పెట్టారు. ఇందుకు కారణమైన వారిని అరెస్టు చేశారా? మేం వచ్చిన తర్వాత జైల్లో వేశాం. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశాం. మీ నోటి నుంచి ఏనాడైనా అభినందించారా? ఎప్పుడు కుర్చీలో కూర్చుందామా అని ఎదురు చూస్తున్నారు. ఇది ఇనాం కుర్చీ కాదు. వారసత్వంగా వచ్చిందికాదు. నల్లమల నుంచికార్యకర్తగా కష్టపడితే వచ్చింది. దీన్ని తాకడం నీతరం కాదు. ఈ ప్రభుత్వం మూడు నెలలకో, ఆరు నెలలకో కూలుతుందని ఎవరైనా గ్రామాల్లోకి వచ్చి చెప్తే.. వారిని చెట్టుకు కట్టేసి తగిన బుద్ధి చెప్పండి.

ఒక్కసీటైనా గెలిపించి చూపించు!

ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డినే సీఎం అని చెప్తే కాంగ్రెస్‌కు ముప్పై సీట్లు కూడా రాకపోయి ఉండేదని ఓ సన్నాసి చెప్పిండు. నేను సవాల్ విసురుతున్నా.. ఇప్పుడు రేవంతే సీఎం, పీసీసీ అధ్యక్షుడు. నీకు దమ్ముంటే, ధైర్యముంటే రేపు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కసీటైనా గెలిపించి చూపించు. నీలా తండ్రి పేరు చెప్పుకుని కుర్చీలో కూర్చోలేదు. కార్యకర్తగా కష్టపడి జెండాలు మోసి, లాఠీదెబ్బలు తిని, అక్రమ కేసుల్లో అరెస్టయి చర్లపల్లి జైల్లో మగ్గిన. భయపడకుండా, లొంగిపోకుండా నిటారుగా నిలబడి ఎదురొడ్డి కొట్లాడిన అసలు సిసలైన కార్యకర్తను నేను. మిమ్మల్ని ఓడించి కుర్చీలో కూర్చున్నోడిని. ఈ కార్యకర్తలు నాకు అండగా నిలబడ్డంత కాలం దేవుడొచ్చినా ఈ కుర్చీని తాకలేడు.

గ్యారంటీలు అమలు చేసి తీరుతం..

సోషల్ మీడియా ఉంటే తామే గెలిచేవాళ్లమని కేటీఆర్ చెప్తున్నాడు. టీవీలు, పేపర్లన్నీ మీ చుట్టపోళ్లవే కదా! మాకేమన్నా మైకులు ఉన్నాయా? సినిమా థియేటర్లు ఉన్నాయా? క్లబ్‌హౌస్‌లు ఉన్నాయా? కార్యకర్తలు కష్టపడితేనే మాకు అధికారం వచ్చింది. మాకు ఆ ట్యూబ్, ఈ ట్యూబ్, ఏ ట్యూబ్ అక్కరలేదు. మా కార్యకర్తలే మీ ట్యూబులైట్లు పగలగొట్టే బాధ్యత తీసుకున్నరు. సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకు ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను అమలు చేసి తీరుతాం.

చంపడమేనా గుజరాత్ మోడల్?

బీజేపీ పదే పదే గుజరాత్ మోడల్ అని చెబుతోందని.. ఊర్లో ఉన్నవాళ్లందరినీ తగలబెట్టడమే మోడలా? అని సీఎం రేవంత్ మండిపడ్డారు. ''ఇతర రాష్ట్రాల్లో ఉన్న పెట్టుబడిదారులను బెదిరించి మీ రాష్ట్రాలకు గుంజుకపోవుడా మీ మోడల్? ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులను కాల్చి చంపారు. ఇదేనా గుజరాత్ మోడల్? నిన్న మొన్నటి వరకు ఈ కేడీ, ఆ మోడీ కలిసే ఉన్నారు. ఇవాళ మేం వేరని చెప్తున్నారు. ఈ నాటకాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకుంది?'' అని రేవంత్ పేర్కొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

ఆడబిడ్డల కోసం ఆనాడు దీపం పథకాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. రూ.4 వందలకే సిలిండర్ ఇచ్చింది. కానీ మోదీ వచ్చిన తర్వాత రూ.1,200కు పెంచి మహిళల కంట కన్నీళ్లు తెప్పిస్తున్నారు. మేం రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం. ప్రతి పేదవాడి ఇంట్లో వెలుగులు నింపేందుకు 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించాం. మహిళలను కోటీశ్వరులను చేస్తాం. వచ్చే ఎన్నికల్లో 14 మంది కాంగ్రెస్ ఎంపీలను గెలిపించి పార్లమెంటుకు పంపండి. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత నాది..'' అని రేవంత్ పేర్కొన్నారు.



మంగళవారం చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ సభకు హాజరైన ప్రజలు

కరెంటు తీగలు పట్టుకుని చూడండి: భట్టి

కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని చెప్పిన ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ఆ కరెంట్ తీగలు పట్టుకొని చూడాలి.. కరెంట్ ఉందో లేదో తెలుస్తుంది. దేశ చరిత్రలోనే ఈరోజు ఓ సుదినంగా మిగిలిపోతుంది. మహిళల కోసం ఇచ్చిన గ్యారంటీల్లో మరో రెండు అమలు చేస్తున్నాం. బీజేపీ ప్రభుత్వానికి ఒక్కటే చెబుతున్నాం.. ఇక్కడ ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతోంది. ఇక్కడ ఓట్ల కోసం మతాలు, కులాల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. చేవెళ్ల ప్రాణహితను కాదని ఈ ప్రాంతానికి నీళ్లు రాకుండా చేసి కాళేశ్వరం అద్భుతమని లక్షల కోట్లు గోదావరిలో పోసి ఏం చేశారు? ఎన్ని అప్పులున్నా, ఎన్ని ఇబ్బందులున్నా అధిగమించి ప్రతీనెల 1న ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. పథకాలను అమలు చేస్తున్నాం.

తెలంగాణ చరిత్రలో గొప్పరోజులివి: ఉత్తమ్

రాష్ట్ర చరిత్రలోనే గొప్పరోజులివి. పేదల కోసం పని చేసే ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే ఇచ్చిన హామీల్లో నాలుగు అమలు చేసి చూపించాం. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి పేదవాడికీ ఈ పథకాలు అందుతాయి. ఎవరూ ఆందోళన చెందొద్దు. ఇప్పుడు దరఖాస్తు చేసుకోలేని వారు కూడా మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మతిపోయి ఆరోపణలు: శ్రీధర్‌బాబు

బీఆర్ఎస్ అవినీతిపై విడుదల చేసిన శ్వేతపత్రాలకు జవాబు చెప్పలేని స్థితిలో ఆ పార్టీ నాయకత్వం ఉంది. 6 గ్యారంటీలపై చులకనగా మాట్లాడిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా పేదలకు అందించటం కళ్లారా చూసున్నారు. బండి సంజయ్ మతిలేని మాటలకు మేము తలచుకుంటే రాష్ట్రంలో అతీగతీ లేకుండా చేస్తాం.

కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ: సీతక్క

పేదలపై ఆర్థిక భారం తగ్గించేలా రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ పథకాలను తెచ్చాం. అక్కాచెల్లెళ్ల కళ్లలో ఆనందం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాలను అమలు చేస్తున్నారు. వీటిని ప్రతిపక్షాలు చూసి ఓర్వలేక కళ్లలో కారం పోసుకొని ఆరోపణలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ. మహిళను ప్రధానిని చేసిన పార్టీ.

ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారు: పొంగులేటి

ప్రజలు కోరుకొని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు హామీలు, 72 రోజుల్లోనే మరో రెండు పథకాలను ప్రవేశపెట్టాం. బీఆర్ఎస్ నాయకులకు మాత్రం అపోహలు ఉన్నాయి. వీటిని అసెంబ్లీ సాక్షిగా అర్థమయ్యేట్లుగా చూపిస్తున్నాం.

ముట్టుకుంటే మాడి మసైపోతారు: పొన్నం

బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు ప్రజలకిచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చారో చెప్పాలి. కాంగ్రెస్‌ను ఎవరైనా ముట్టుకుంటే మాడి మసైపోతారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీ, విభజన హామీలను అమలు చేయలేని బీజేపీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.

లక్ష కోట్లు.. 5 లక్షల ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరణలు, ఔషధ పరికరాలకు ప్రోత్సాహకాలపై వారు చర్చించనున్నారు. ఈ సదస్సును సీఎం రేవంత్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు.

వ్యాక్సిన్ల రాజధానిగా హైదరాబాద్..

దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని రేవంత్ చెప్పారు. ప్రముఖ టకేడా సంస్థ బయోలాజికల్–ఈ సంస్థతో కలసి హైదరాబాద్‌లో వ్యాక్సిన్ తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు. హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌డీ సెంటర్ ఏర్పాటుకు మిల్టెనీ బయోటెక్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ''హైదరాబాద్ ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రగామిగా ఉంది. ఇప్పుడు లైఫ్ సైన్సెస్ రంగానికి రాజధానిగా మారింది. ప్రపంచంలో మూడు కోవిడ్ వ్యాక్సిన్లు వస్తే.. అందులో ఒకదాన్ని అందించిన ఘనత హైదరాబాద్‌కే దక్కింది. ఎన్నో పరిశోధనలకు నిలయంగా నిలిచింది'' అని సీఎం చెప్పారు. మెదక్, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేవలం గంటా గంటన్నర ప్రయాణ దూరంలోనే ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుందన్నారు. మూడు విభిన్న ప్రాంతాల్లో అభివృద్ధిని వికేంద్రీకరించేలా వ్యూహాన్ని అమలు చేస్తామని తెలిపారు. పరిశోధనలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తామని.. అద్భుత మౌలిక సదుపాయాలతో సంపూర్ణమైన వ్యవస్థను రూపొందించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. స్టార్టప్‌లు, కార్పొరేట్ల మధ్య వారధిగా ఉన్న ఎంఎస్ఎంఈలను మరింత ముందుకు తీసుకెళ్లడంపై దృష్టిపెడతామన్నారు. ''మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్‌లా మా ప్రభుత్వం పనిచేస్తుంది..'' అని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

నైపుణ్య రాజధానిగా హైదరాబాద్: శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌ను భారతదేశంలోనే నైపుణ్యం కలిగిన రాజధానిగా మార్చడానికి సీఎం రేవంత్ కట్టుబడి ఉన్నారని ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని విద్యార్థులందరికీ పరిశ్రమలతో కలసి పనిచేసే తప్పనిసరి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు తీసుకురావాలని నిర్ణయించామని చెప్పారు. విద్యారంగానికి విలువను అందించేలా కొత్త విప్లవం తీసుకువస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, రెగ్యులేటరీ ఏజెన్సీల మధ్య సమ్మిళితమైన కొత్త డైనమిక్ లైఫ్ సైన్సెస్ పాలసీని కూడా తెస్తున్నామన్నారు.

పలు దేశాల ప్రతినిధులతో సీఎం భేటీ

బయో ఏషియా సదస్సు సందర్భంగా పలు దేశాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లో పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా పెట్టుబడులు పెట్టాలని వారిని సీఎం కోరారు. వచ్చే మూడేళ్లలో రీజనల్ రింగ్ రోడ్‌ను పూర్తి చేస్తామన్నారు. వెస్ట్రన్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీ జెర్మీజుర్గన్స్, బెల్జియం అంబాసిడర్ డెడిర్ వాండర్ హసక్ తదితరులు సీఎంతో విడివిడిగా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్ రంగంలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని, భారత్‌లో తమ తొలి కమర్షియల్ ఆఫీస్‌ను హైదరాబాద్‌లోనే ప్రారంభిస్తున్నామని వెస్ట్రన్ ఆస్ట్రేలియా మంత్రి సాండర్సన్ ఈ సందర్భంగా వివరించారు.

పథకాలు ఆగవు

▶ మొదటి పేజీ తరువాయి

సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ ఆరు గ్యారంటీల వల్లే అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజ లు ఎన్నుకున్నారు. అందువల్ల ఆర్థికంగా ఎన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో మహిళల జీవితాలు దుర్భరంగా ఉన్నప్పుడు యూపీఏ ప్రభుత్వం దీపం పథకం తెచ్చింది. అప్పుడు రూ.400 ఉన్న సిలిండర్‌ను మోదీ ప్రధాని అయ్యాక రూ.1200కు పెంచారు. అలా ధర పెరిగిన సిలిండర్‌పై రాయితీ ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్ ప్రభుత్వం చేయలేదు. కానీ ఎన్నికల సందర్భంగా మేం ఈ హామీ ఇచ్చాం. ఆ మేరకు లక్ష మంది మహిళల సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించాలనుకున్నాం. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అడ్డు రావడంతో సచివాలయంలోనే ప్రారంభిస్తున్నాం. ఇతర సంక్షేమ పథకాలు ఆపం. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దేశానికే రోల్‌మోడల్‌గా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దుతాం..'అని చెప్పారు.

ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు

డిప్యూటీ సీఎం భట్టి

'గత ప్రభుత్వానికి అధికారం అప్పగించే సమయానికి తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉంది. కానీ గత పదేళ్లలో అప్పుల కుప్పగా మార్చారు. ప్రస్తుతం ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారని దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోంది. కానీ మేం హామీలన్నీ కచ్చితంగా అమలు చేసి చూపిస్తాం. అర్హత ఉన్న వారందరికీ మార్చిలో వచ్చే విద్యుత్ బిల్లు జీరో (200 యూనిట్లలోపు వినియోగిస్తే) బిల్లుగా వస్తుంది. అయితే వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలి. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.' అని భట్టి విక్రమార్క తెలిపారు.

తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ రూ.500కే సిలిండర్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

'ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని, తెల్లరేషన్ కార్డు ఉన్నవారందరికీ రూ.500 సిలిండర్ అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆయిల్ కంపెనీలకు ముందస్తుగా డబ్బు చెల్లిస్తామని, వారు ఆ తర్వాత లబ్ధిదారుల అకౌంట్లలో వేస్తారని తెలిపారు. మూడేళ్ల సగటు వినియోగం ఆధారంగా ఒక్కో సిలిండర్‌ను రూ.500కు ఇస్తామని వివరించారు. త్వరలోనే కేవలం రూ.500 చెల్లిస్తే.. గ్యాస్ సిలిండర్ అందించేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలివీ..

రూ.500కే సిలిండర్ పొందాలంటే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలి. తెల్ల రేషన్‌కార్డు ఉండాలి. మూడేళ్ల సగటు వినియోగం ఆధారంగా రూ. 500కు సిలిండర్లు అందజేస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి పేరిట ఎల్పీజీ కనెక్షన్ యాక్టివ్‌గా (కనెక్షన్ వినియోగంలో ఉండాలి) ఉండాలి. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

ఒక సర్వీస్ కనెక్షన్‌కే వర్తింపు: 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందడానికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలి. తెల్ల రేషన్‌కార్డు కలిగి, ఆధార్‌కార్డు విద్యుత్ సర్వీసు కనెక్షన్‌తో అనుసంధానమై ఉండాలి. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి జీరో బిల్లు వస్తుంది. రేషన్‌కార్డులోని యజమాని పేరు ఉన్న విధంగా ఈ పథకం కోసం విద్యుత్ సర్వీసు కనెక్షన్ పేరును డిస్కమ్‌లు మార్చవు. అలాంటి సర్వీసు ఉన్న వారికి యథావిధిగా బిల్లులు వస్తాయి. ఈ పథకం కింద విద్యుత్‌ను వాణిజ్య అవసరాలకు వాడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారు. గృహజ్యోతి పథకం పొందడానికి అన్ని అర్హతలున్నా.. ప్రస్తుత పద్ధతిలోనే విద్యుత్ బిల్లు వస్తే..ఎంపీడీవో/మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించి తెల్ల రేషన్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ సర్వీసు నంబర్ (యూనిక్ సర్వీస్ కనెక్షన్)తో అనుసంధానమైన ఆధార్ కార్డును జోడించి దరఖాస్తు ఇవ్వాలి. వినియోగదారులు ఎంపీడీవో/మునిసిపల్ కార్యాలయం లేదా ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు అక్‌నాలెడ్జ్‌మెంట్‌ను చూపిస్తే చాలు..వారి దగ్గర నుంచి బిల్లును బలవంతంగా వసూలు చేయడం జరగదు. ఈ మేరకు ఇంధన శాఖ ఉత్తర్వులిచ్చింది.

గొర్రెల కొనుగోళ్ల కేసులో ఏసీబీ దూకుడు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో చోటుచేసుకున్న నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తునకు సంబంధించి ప్రాథమిక నివేదికను ఏసీబీ రూపొందిస్తున్నట్టు తెలిసింది. ఈ వారంలోనే నివేదికను ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీలో పథకంలో భాగంగా రైతులకు చేరాల్సిన రూ.2.10 కోట్లను కాంట్రాక్టర్, పశుసంవర్ధకశాఖ అధికారులు కుమ్మక్కై దారి మళ్లించిన విషయం తెలిసిందే. దీనిపై గత డిసెంబర్‌లో గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. కామారెడ్డి జిల్లా ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్‌డైరెక్టర్ ధర్మపురి రవి, మేడ్చల్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయి, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్‌వాటర్ ఆఫీసర్ పి.రఘుపతిరెడ్డి, నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్‌ను ఏసీబీ అధికారులు ఈనెల 22న అరెస్ట్ చేశారు. కేసులో ఏ1, ఏ2 నిందితులైన మొహిదుద్దీన్, సయ్యద్ ఇక్రముద్దీన్ విదేశాలకు పారిపోవడంతో వారిపై లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. గొర్రెలు విక్రయించిన పల్నాడు జిల్లా రైతులకు చేరాల్సిన డబ్బును నిందితులు పలు బ్యాంకు అకౌంట్లలోకి బదిలీ చేసినట్టు ఏసీబీ గుర్తించారు. ఈ ఖాతాదారుల వివరాలు ఇవ్వాలని కోరుతూ సంబంధిత బ్యాంకులకు ఇప్పటికే లేఖలు రాసినట్టు తెలిసింది. ఆ వివరాలు వచ్చిన తర్వాత బినామీలపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఏసీబీ రంగం సిద్ధం చేస్తోంది.

ఔషధ పేటెంట్లకు మరిన్ని చట్టాలు అవసరం

బయో ఆసియా 2024 సదస్సులో వక్తలు

- ఫార్మా రంగంలో డేటా అనలిటిక్స్, ఏఐ వినియోగంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో ఔషధ ఆవిష్కరణలకు సంబంధించి పేటెంట్ల కోసం మరింత మెరుగైన చట్టాలు అవసరమని బయో ఏషియా సదస్సులో జరిగిన చర్చల్లో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పదేళ్ల కిందటితో పోలిస్తే భారత్‌లో పేటెంట్ల వాతావరణం కాస్త మెరుగుపడిందన్నారు. పేర్కొన్నారు. భారత్‌లో తయారవుతున్న ఔషధాలను ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సంబంధిత చట్టాలను మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం బయో ఏషియా సదస్సులో చర్చించారు. దీనితోపాటు వివిధ అంశాలపై లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగాలకు చెందిన నిపుణులు కీలకోపన్యాసాలు చేశారు.



బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

ఆవిష్కరణలు, సంస్కరణలపై చర్చలు

బయో ఏషియా సదస్సులో భారత్‌లో, ప్రత్యేకించి తెలంగాణలో జీవశాస్త్ర, ఔషధ రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలపై మంగళవారం బృంద చర్చలు జరిగాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఔషధ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో ఎదురయ్యే అవరోధాలపై మరో బృందం చర్చించింది. ఔషధ ఆవిష్కరణల్లో డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికత వినియోగం తీరుతెన్నులపై చర్చ జరిగింది. కొలన్ కేన్సర్ చికిత్స కోసం విద్యా, పరిశోధన సంస్థలు, ఆవిష్కరణలపై అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ప్యానెల్ అభిప్రాయపడింది. తక్కువ ధరకు ఔషధాల లభ్యత, మెరుగైన ఆవిష్కరణల వాతావరణం కోసం జీనోమ్ వ్యాలీలో సామర్థ్య పెంపుదల కేంద్రం ఏర్పాటుపైనా చర్చలు జరిగాయి.

ఏఐ సాంకేతిక వినియోగాన్ని పెంచాలి

సదస్సులో బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్ సీఈవో డాక్టర్ క్రిస్టోఫర్ బోయెర్నర్, నోబెల్ విజేత ప్రొఫెసర్ గ్రెగ్ సెమంజా, ప్రావిడెన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నీ హాఫ్‌మన్ కీలకోపన్యాసాలు చేశారు. ఆక్సిజన్ లోపంతో వచ్చే వ్యాధులకు జన్యు చికిత్సలపై పరిశోధన, అభివృద్ధి జరగాలని గ్రెగ్ సెమంజా సూచించారు. వ్యాధుల నిర్ధారణలో వైద్యులు ఏఐ సాంకేతికతను ఉపయోగించేలా కృషి జరగాలని డాక్టర్ రోడ్నీ హాఫ్‌మన్ కోరారు. రోగ నిర్ధారణ పరీక్షల ఫలితాలు వేగంగా వచ్చేలా ఏఐ సాంకేతికతతో కూడిన పరికరాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని క్రిస్‌బోయెర్నర్ నొక్కి చెప్పారు. జాన్‌హాప్కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్, నోబెల్ విజేత ప్రొఫెసర్ గ్రెగ్ సెమంజాకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 'జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు'ను ప్రదానం చేశారు. ఇక సదస్సులో భారత్‌లో తయారయ్యే వాక్సిన్లు, ఔషధ సరఫరా చైన్‌లు అంతర్జాతీయ స్థాయిలో ఎదుర్కొంటున్న భౌగోళిక, రాజకీయ అవాంతరాలపై వివిధ సంస్థల సీఈఓలతో కూడిన బృందం చర్చించింది. డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, అడ్వెంట్ అంతర్జాతీయ భాగస్వామి స్టెఫాన్ స్టోఫెల్, లారస్ లాబ్స్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావా, ఫైజర్ ఇండియా అధ్యక్షులు మీనాక్షి నెవాషియా, పిరమిల్ ఫార్మా చైర్‌పర్సన్ నందిని పిరమిల్ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.



మీ చేతికి..‘మంచి’ ఆయుధం!

‘మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం’లో సీఎం జగన్ దిశానిర్దేశం

- రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు మేలు చేశాం
- 99% హామీలను అమలు చేశాం.. విశ్వసనీయత చాటుకున్న పార్టీ మనదే
- 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో మనం గెలవాల్సిందే

సాక్షి, అమరావతి: ‘రాష్ట్రంలో మరో 45 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. గత 57 నెలలుగా లంచాలు, వివక్షకు తావులేకుండా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకూ 87 శాతం కుటుంబాలకు మంచి చేయగలిగాం. దేశ చరిత్రలో ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు ఎప్పుడూ ఇవ్వని ఆయుధాలను మీ చేతుల్లో పెట్టా. ఇప్పటికే మన పార్టీ టిక్కెట్లన్నీ దాదాపుగా ఖరారయ్యాయి. రెట్టించిన ఉత్సాహంతో క్షేత్ర స్థాయిలోకి వెళ్లండి. ప్రజలకు మంచి చేసి ఓట్లు అడుగుతున్నామన్న గొప్ప సంతృప్తితో ఇంటింటికీ వెళ్లండి. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీలతో గెలిచి రావాల్సిన బాధ్యత మీదే’అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో చరిత్రాత్మక విజయం సాధించామని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికీ మంచి చేసిన నేపథ్యంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లోనూ గెలవాల్సిందేనని శ్రేణులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ‘మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం’పేరుతో మంగళవారం సీఎం జగన్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. 175 నియోజక వర్గాల నుంచి సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ, మండల, జగనన్న సచివాలయాల కన్వీనర్లు సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

విశ్వసనీయతే మన బలం..

రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా, ఏ ఇంటికి వెళ్లి అడిగినా విశ్వసనీయత ఉన్న పార్టీ ఏదంటే ఒక్క వైఎస్సార్‌సీపీనే అనే మాట వినపడుతుంది. ఒక పార్టీకి, రాజకీయ నాయకుడికి ఇది చాలా చాలా అవసరం. బహుశా దేశ రాజకీయాల్లో ఇలాంటి గౌరవం ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కింది. ప్రతి కార్యకర్త తమ నాయకుడిని చూపించి కాలర్ ఎగరేసే పరిస్థితి ఉన్నప్పుడే ఆ పార్టీకి గౌరవం లభిస్తుంది. పార్టీ నాయకుడు కూడా అలాగే వ్యవహరించాలి. విశ్వసనీయతే మన బలం. 2014లో చంద్రబాబు 650 పేజీలతో మేనిఫెస్టో తెచ్చి అందరినీ మోసగించారు. అసాధ్యమని తెలిసినా రైతన్నలకు రూ.87,612 కోట్లు రుణమాఫీ మొదట సంతకంతోనే చేస్తానని నమ్మబలికారు. దాదాపు రూ.15 వేల కోట్ల పొదుపు సంఘాల రుణాలనూ మాఫీ చేస్తానన్నాడు. ఇంటింటికీ ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి అని అన్నాడు. అప్పుడు మన పార్టీలో కూడా చాలామంది శ్రేయోభిలాషులు మనం కూడా అలాంటి వాగ్దానాలు ఇద్దామన్నారు. ఇప్పుడు హామీలిచ్చి ఎన్నికలు అయిపోయిన తరువాత చూద్దామన్నారు. ఒకవైపు చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతుంటే మనం నీతిగా, నిజాయితీగా యుద్ధం చేయడం కుదరదని నాకు సలహా ఇచ్చారు. అప్పుడు నేను ఒక్కటే అన్నాను. విలువలు, విశ్వసనీయత అనే పదాలకు అర్థం చెబుతూ మనం చేయగలిగిందే చెబుదామని సూచించా. ఒక పని చేయలేమని తెలిసినప్పుడు మన నోటి నుంచి ఆ మాట రాకూడదని చెప్పా. నాడు ఆ మోసాలకు తోడు ప్రధాని మోదీ గాలి వీస్తుండటంతో దత్తపుత్రుడి సహకారంతో చంద్రబాబు గద్దెనెక్కారు. మోసం చేసి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను చంద్రబాబు చెత్తబుట్ట పాలు చేశారు. చివరకు ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారంటే టీడీపీ తరఫున ప్రచారం చేయడానికీ ఆ పార్టీ కేడర్ సాహసించలేదు.

99% హామీలు అమలు చేశాం..

2019లో మనం కేవలం రెండు పేజీలతో మేనిఫెస్టో తీసుకొచ్చాం. నాడు మేనిఫెస్టో అంశాల గురించి చర్చిస్తుంటే విజయనగరం జిల్లాలో అప్పల నరసయ్య ఇవన్నీ సాధ్యమేనా? అని నాతో అన్నారు. ఇవన్నీ కచ్చితంగా చేసి తీరుతామని చెప్పా. అన్నీ ఆలోచన చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకున్నాం. ప్రతిమాట నెరవేరుస్తానని చెప్పా. చరిత్రలో ఎప్పుడు చూడని విధంగా 151 స్థానాలతో అధికారంలోకి వచ్చాం. 22 ఎంపీ స్థానాలు గెల్చుకున్నాం. ఏకంగా 99 శాతం హామీలను నెరవేర్చాం, మీరే చూసి టిక్కు పెట్టాలని ప్రతి ఇంటికీ వెళ్లి చిత్తశుద్ధితో అడుగుతున్నాం.

పొరపాటు జరిగితే మళ్లీ అరాచకమే...

ఎవరైనా పొరపాటున వైఎస్సార్‌సీపీకి ఓటు వేయకపోతే మళ్లీ జన్మభూమి కమిటీలు సంతకం పెట్టినట్టే. ఇంటివద్దే పారదర్శకంగా అందిస్తున్న పథకాలన్నీ వద్దని మనంతట మనం సంతకం పెట్టినట్టే. పొరపాటు చేస్తే పేదవాడి గురించి ఆలోచించే పరిస్థితే ఉండదు. మళ్లీ పేదవాడి బతుకు చిన్నాభిన్నమే అవుతుందనే సంకేతం ప్రతి గడపకూ చేరవేయాలి. అమ్మా..! జగన్ ఏదైనా చెబితే చేస్తాడు. చెప్పే ముందు నాలుగు సార్లు ఆలోచన చేస్తాడు. చేయగలిగింది మాత్రమే చెబుతాడు. కానీ చంద్రబాబు అలాంటి వ్యక్తి కాదు. ఎన్నికల కోసం, ఓట్ల కోసం ఆయన ఏమైనా చెబుతాడు. పొరపాటు చేస్తే మళ్లీ అరాచకం వస్తుందని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలి. ప్రజలకు నేను చేయగలిగినంత మంచి చేశా. ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకుడూ ఎప్పుడూ ఇవ్వని ఆయుధాలను మీ అందరి చేతుల్లో పెట్టా. వీటితో ముందుకు వెళ్లి ఎన్నికల్లో గెలిచి రావాల్సిన బాధ్యత ఈ 45 రోజుల్లో మీరు చేసే ఆర్గనైజేషన్ బలంపై ఆధారపడి ఉంది. ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో, అంతే విశ్వాసంతో ముందుకు అడుగులు వేయాలి. మీ అందరికీ ఆల్ ది బెస్ట్ విషెష్..

క్లాస్ వార్..

ఇవాళ జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. ఇది క్లాస్ వార్ అని గుర్తు పెట్టుకోండి. పేదవాడు ఒకవైపున.. పెత్తందార్లు మరోవైపున నిలిచి యుద్ధం జరుగుతోంది. మీ జగన్ ఉంటే పేదవాడు బాగుపడతాడు. మీ జగన్ ఉంటే లంచాలు, వివక్ష లేకుండా పథకాలు కొనసాగుతాయి. ఇంటికే వలంటీర్ వస్తాడు. అవ్వాతాతలకు తోడుగా ఉంటూ సహాయం అందుతుంది. మీ జగన్ ఉంటేనే బడులు బాగుంటాయి. పేద బిడ్డలకు ఇంగ్లీషు మీడియం అందుతుంది. మీ జగన్ ఉంటేనే గ్రామాలలో విలేజ్ క్లినిక్‌లు పనిచేయడం కొనసాగుతుంది. విస్తరించిన ఆరోగ్యశ్రీ గొప్పగా సేవలు అందిస్తుంది. ఏ పేదవాడు ఆరోగ్యం కోసం అప్పులు పాలు కాకుండా వైద్యం అందే పరిస్థితి కొనసాగాలంటే జగన్ ఉంటేనే జరుగుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయంలో ఎవరి ఊహకూ అందని మార్పులు తీసుకొచ్చాం. అక్క చెల్లెమ్మలకు దిశ యాప్‌తో భద్రత కల్పిస్తున్నాం. ఇవన్నీ కొనసాగాలంటే మీ జగన్‌తోనే సాధ్యమనే సందేశాన్ని అందరికీ చేరవేయాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వివాదాల ‘విహారి’!

ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారిపై అనేక ఫిర్యాదులు

- విహారి వ్యవహార శైలిపై కోచ్, హెడ్ కోచ్‌లు కూడా ఫిర్యాదులు
- కెప్టెన్‌గా కొనసాగించాలని బెదిరించి లేఖ రాయించారంటున్న ఆటగాళ్లు
- పృథ్వీరాజ్ సీనియర్ ఆటగాడు.. పలు టోర్నీల్లో ప్రతిభ నిరూపించుకున్నాడు
- అతనికి అవకాశం ఇవ్వకుండా గాయపడ్డ ఆటగాడిని కీపర్‌ను చేసిన హనుమ
- విచారణలో ఆరోపణలన్నీ వాస్తవాలని తేలాయి.. అందుకే ఏసీఏ చర్యలు
- ఈ విషయాలు తెలిసీ రామోజీ విష ప్రచారం

సాక్షి, విశాఖపట్నం: క్రికెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) చేస్తున్న కృషితో పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన క్రీడలు దేశాన్నే ఆకర్షించాయి. ఈ రాష్ట్రం ఏ రంగంలో బాగుపడినా నచ్చని పచ్చమీడియా.. ముఖ్యంగా రామోజీరావు క్రీడలపైనా విషం చిమ్ముతున్నారు. ఇందుకు ఆంధ్ర రంజీ మాజీ కెప్టెన్ హనుమ విహారి ఉదంతాన్ని కూడా విషపూరితం చేసి, చిలువలు పలువలు అల్లి ఈనాడులో కథనాలు వండి వారుస్తున్నారు. నిజానికి ఆంధ్ర క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హనుమ విహారి వైఖరి ఆది నుంచి వివాదాస్పదమే. జట్టు సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడుతుంటారన్న ఫిర్యాదులున్నాయి. విహారి వ్యవహార శైలిపై పలుమార్లు సాటి ఆటగాళ్లు, ఏసీఏ అధికారులు, కోచ్‌లు, కోచ్ హెడ్‌లు కూడా ఫిర్యాదులు చేశారు. అవన్నీ వాస్తవమేనని విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నారు. ఏసీఏ కథనం ప్రకారం..


వైకాపా నేతల వికృత క్రీడలో
హనుమ విహారి ఔట్!

చాలా జట్లలో 17 మందికన్నా ఎక్కువ సభ్యులు

ఈనాడు పేర్కొన్నట్టు.. క్రికెట్ జట్టులో 15 మందే ఉండాలన్న నిబంధనేమీ లేదు. 17 మందికి మించి సభ్యులున్న జట్లు చాలానే ఉన్నాయి. 2023–24 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ టీమ్‌లో 18 మంది ఉన్నారు. హైదరాబాద్ జట్టులోనూ 17 మంది కంటే ఎక్కువే ఉన్నారు. కోవిడ్ సమయంలో ఏసీఏ కూడా ఆంధ్ర జట్టుకు 22 మందిని ఎంపిక చేసింది. ఏసీఏ కార్యదర్శి కోటా కూడా కొత్తదేమీ కాదు.. చంద్రబాబు హయాం నుంచే ఉంది. ఈ విషయాలు తెలియకుండానే రామోజీ కథనం అల్లారా?

విహారిపై ఫిర్యాదుల్లో కొన్ని..

- బెంగాల్ రంజీ మ్యాచ్‌లో విహారి అందరి ముందు ఒక ఆటగాడి (పృథ్వీరాజ్)ని అసభ్యంగా దుర్భాషలాడారు. దీనిపై ఆయన ఏసీఏకు ఫిర్యాదు చేశారు.
- సాటి జట్టు సభ్యులు, సపోర్టు స్టాఫ్‌తో పాటు ఏసీఏ అధికారులు సైతం తరచూ విహారి అసభ్యకర పదజాలంపై ఫిర్యాదులు చేశారు.
- ముస్తాఖ్ ఆలీ టోర్నమెంట్ ఆంధ్ర టీం మేనేజర్ రాజారెడ్డి కూడా జట్టులో గ్రూపులకు విహారి కారణమవుతున్నారని ఫిర్యాదు చేశారు.
- ఇతర రాష్ట్రాల తరఫున మ్యాచ్‌లు ఆడేందుకు నిరభ్యంతర సర్టిఫికెట్ ఇవ్వాలని విహారి పదే పదే ఏసీఏని అడిగేవారు. కొన్నిసార్లు తన నిర్ణయాన్ని మార్చుకుని క్షమాపణలు కూడా చెప్పేవారు. తరచూ కెప్టెన్సీ నుంచి తప్పించాలనేవారు. మళ్లీ ఆంధ్ర జట్టులోనే కొనసాగుతానని చెబుతుండేవారు.
- విహారి అనుభవం, ఆంధ్ర క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా జట్టులో కొనసాగించారు.
- హనుమపై వచ్చిన ఆరోపణలు వాస్తవాలేనని విచారణలో తేలింది.
- కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాలని సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి చంద్రమౌళి ప్రసాద్ చౌదరి నుంచి ప్రతిపాదన వచ్చింది. దీంతో విహారి తర్వాత స్థానంలో ఉన్న రిక్కీబుయ్‌ని కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ నిర్ణయాన్ని కూడా విహారి అంగీకరించి అభినందించారు కూడా.
- ఆ తర్వాత కెప్టెన్‌గా తననే కొనసాగించాలంటూ విహారి తమను బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించుకున్నట్టు జట్టు సభ్యులు తెలిపారు.
- పృథ్వీరాజ్ ఒకేసారి రంజీ జట్టులోకి రాలేదు. అండర్ 14, 16, అండర్ 19 వినూ మన్కడ్, కూచ్ బిహార్, అండర్ 23, 25 కల్నల్ సీకేనాయుడు, విజయ్ హజారే ట్రోఫీల్లో ఆడి ప్రతిభ నిరూపించుకున్నాడు. ఇంత సీనియారిటీ, అనుభవం ఉన్నప్పటికీ, జనవరిలో బెంగాల్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో కెప్టెన్ విహారి అతన్ని ఆడించలేదు. గాయపడిన మరో వికెట్ కీపర్‌ను ఆడించారు.

ఫౌండేషన్ మూతపడేలా

2021 నవంబర్‌లో తిరుపతిలో వరదల్లో ప్రజలకు పాలు, బ్రెడ్ వంటి ఆహార పదార్థాలను హనుమ విహారి ఫౌండేషన్ అందించింది. ఫౌండేషన్ సహాయ కార్యక్రమాల్లో ఇద్దరు వాలంటీర్లు ఎన్టీఆర్ ట్రస్ట్ టీ షర్ట్స్ వేసుకుని కనిపించారు. దీంతో వరద బాధితులకు ప్రభుత్వం సహాయం చేయడంలేదని, తామే చేస్తున్నామంటూ టీడీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. అయితే, ఈ సహాయ కార్యక్రమానికి టీడీపీకి కానీ, ఎన్టీఆర్ ట్రస్టుకు కానీ సంబంధం లేదని, తమ బృందంలోని ఇద్దరు వాలంటీర్స్ ఎన్టీఆర్ ట్రస్ట్ టీ షర్ట్స్ వేసుకుని ఉన్నారని, అంతమాత్రాన ఇది ఎన్టీఆర్ ట్రస్టు చేసినట్టు కాదంటూ విహారి ఫౌండేషన్ గట్టిగా ఖండించింది. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు విహారిని వేధించి, వెంటబడి ఫౌండేషన్ మూతపడేలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే టీడీపీ నేతలు ఇప్పుడు విహారిపై ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడటం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రికెట్‌పై రాజకీయాలు దురదృష్టకరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్

జెంటిల్మన్ గేమ్ అయిన క్రికెట్ క్రీడపై రాజకీయాలు చేయడం దురదృష్టకరమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ‘క్రికెట్ అభివృద్ధి, విస్తరణకు దేశంలోని పలు అసోసియేషన్ల మాదిరిగానే ప్రతిష్టాత్మక ఏసీఏ కూడా విశేష కృషి చేస్తోంది. ఆటగాళ్ల ప్రవర్తన నియమావళి, నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను అనుసరిస్తోంది. ఇందులో పక్షపాతం, రాగద్వేషాలకు తావులేదు. ఏసీఏనుద్దేశించి హనుమ విహారి ఆరోపణలు చేయడం విచారకరం. ఆటగాళ్ల మధ్య చిన్నచిన్న పొరపొచ్చాలు వచ్చినా సమన్వయం కుదిర్చి సత్ఫలితాలు సాధించడం జట్టు బాధ్యత. అందులోభాగంగానే ఏ ఆటగాడైనా తొందరపడినా, మరో రకంగా ప్రవర్తించినా వారి పట్ల అత్యంత సంయమనం పాటిస్తూ జట్టును ఏకతాటిపైకి తీసుకు రావడానికి ఏసీఏ కృషి చేస్తుంది. జట్టు ప్రయోజనాలు, క్రికెట్ స్ఫూర్తిని పరిగణనలోకి తీసుకుని లోలోపలే సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తుంది. పరిధి దాటితే నిబంధనల ప్రకారం వివక్ష లేకుండా చర్యలు తీసుకుంటుంది. హనుమ విహారి బహిరంగంగా సామాజిక మాధ్యమాల వేదికగా ఏసీఏ, సాటి సభ్యులపై ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రజలు గమనించాలి’ అని ఏసీఏ కోరింది.

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షునిగా భోజనపల్లి

సాక్షి, హైదరాబాద్: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ శాఖ నూతన అధ్యక్షునిగా భోజనపల్లి నర్సింహ్మా మూర్తి, భాగ్యనగర్ క్షేత్ర సంఘటనా మంత్రిగా గుమ్మళ్ల సత్యం నియమితులయ్యారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో అయోధ్యలో జరిగిన వీహెచ్‌పీ కేంద్రీయ సమావేశాలలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్ర కమిటీలలో మార్పులు చేస్తూ కొత్త నియామకాలను జాతీయ అధ్యక్షుడు ఆలోక్ కుమార్ ప్రకటించారు. ఈ నియామకాలపై వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, తెలంగాణా రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తం చేసింది.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల కిడ్నాప్ ఘటనపై డీజీపీకి ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ఇల్లందు మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం సందర్భంగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లపై దాడి, కిడ్నాప్ చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీ రవిగుప్తాను మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడ డీజీపీ రవిగుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజాహిత యాత్రపై రాళ్లదాడి

బండి సంజయ్ యాత్రలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల బాహాబాహీ

- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఉద్రిక్తత
- కరీంనగర్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా..
- కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే పొన్నం దానికి సిద్ధమా అంటూ సవాల్


అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో బీజేపీ జాతీయ కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బండి సంజయ్, మంత్రి పొన్నం మధ్య మాటల యుద్ధమే ఇందుకు కారణమని అంటున్నారు. మంగళవారం ప్రజాహిత యాత్ర హుస్నాబాద్ మండలం రాములపల్లిలో కొనసాగుతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బండి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కొందరు కార్యకర్తలు యాత్రలోకి చొచ్చుకునిరాగా.. బీజేపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. ఓ కార్యకర్తను బీజేపీ నాయకులు చితకబాదారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు.

పొన్నం సిద్ధమా: యాత్ర హుస్నాబాద్‌కు చేరుకున్న సందర్భంగా బండి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే రాజకీయ సన్యాసానికి పొన్నం సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యమని పొన్నం అన్న మాట నిజం కాదా అని అన్నారు. రాముడు అయోధ్యలోనే పుట్టాడని, అక్కడే రామమందిరం ఉన్నట్లు కచ్చితంగా చెబుతామన్నారు. పొన్నంకు రాముడంటే కోపమంటూ.. అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మించే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. సంచలనం కోసమే పొన్నం యాత్రను అడ్డుకోవాలనుకుంటున్నారని ఆరోపించారు.

పొన్నం తన తల్లిని అడ్డుపెట్టుకొని..

మంత్రి పొన్నం ప్రభాకర్ తన తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయాలనుకుంటున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. స్వర్గంలో ఉన్న పొన్నం తండ్రి ఆత్మ ఎంతగా క్షోభిస్తుందో ఆలోచించుకోవాలన్నారు. పొన్నం తల్లి నిండు నూరేళ్లు బతకాలని కాంక్షించారు. ‘అందరు తల్లులు నా తల్లితో సమానం. ఆయన తల్లిని నేను అవమానించలేదు. వాళ్ల తల్లిని అవమానించడమంటే నా తల్లిని నేను అవమానించినట్లే’అని బండి చెప్పారు.

సంజయ్.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు..

- బండి రాజకీయ డ్రామాలకు తెరలేపారంటూ మంత్రి పొన్నం ఫైర్



హుస్నాబాద్: ఎంపీ బండి సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, తన తల్లి గురించి మాట్లాడటమేంటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇదేమి రాజకీయమో బీజేపీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వం ఆలోచించాలని చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పొన్నం మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. బండి సంజయ్ రాజకీయ డ్రామాలకు తెరలేపారంటూ మండిపడ్డారు. ‘నేను రాముడి పుట్టుక, అక్షింతల గురించి మాట్లాడలేదు. నా తల్లి జన్మకు సంబంధించిన మాటలు బండి సంజయ్ మాట్లాడుతున్నారు. ఇది ఎంత వరకు సమంజసమో ఆయనకే తెలియాలి. నా తల్లి అయినా ఎవరి తల్లి అయినా తల్లే. తల్లి మాట నీ సమాధికి కారణం కాబోతుంది.. బండి సంజయ్ జాగ్రత్తా..’అని పొన్నం వ్యాఖ్యానించారు. రాజకీయ డ్రామాలు చేస్తూ బండి సంజయ్ యాత్రను కొనసాగిస్తున్నారని విమర్శించారు. బండి వ్యాఖ్యలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భార్య మెడలోని మంగళసూత్రాన్ని అమ్మి బండి సంజయ్ ఎన్నికల్లో గెలిచారన్నారు. ఆనాడు కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే రాజకీయంగా ఎన్నికల్లో ఏవిధంగా వాడుకున్నారో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు.

ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు

- మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు సీఎం కావడం దురదృష్టకరం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ‘ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరు. ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం పెట్టే ఖర్చులో కూడా లాభం తీయాలనుకునే వారు వ్యాపారులవుతారు గానీ పాలకులు కారు. మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టం’అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంద శాతం జనావాసాలకు నిరంతరం సురక్షిత మంచినీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ‘మిషన్ భగీరథ’ప్రభుత్వానికి లాభం తెచ్చే పని కాదని, దండగని రేవంత్ మాట్లాడటం శోచనీయమన్నారు. మిషన్ భగీరథ కోసం గత ప్రభుత్వం రూ. 35 వేల కోట్లు ఖర్చు చేస్తే, దాన్ని రూ.50 వేల కోట్లకు పెంచి చెబుతున్న ఘనత రేవంత్‌కే దక్కుతుందన్నారు.

మిషన్ భగీరథపై అవగాహన లేదు

‘మిషన్ భగీరథ పథకం లక్ష్యంపై సీఎం అనే వ్యక్తికి కనీసం అవగాహన లేదు. మిషన్ భగీరథ ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలి. లాభనష్టాలు బేరీజు వేసుకోవడం తగదు. రైతులకు సాగునీరు ఇవ్వడాన్ని, ప్రజలకు మంచినీరు ఇవ్వడాన్ని కూడా లాభనష్టాలతో బేరీజు వేసుకునే ప్రభుత్వం ఒకటి వస్తుందని తెలంగాణ ప్రజలు కలలో కూడా ఊహించి ఉండరు. బీడు భూముల్లో సిరులు పండుతుంటే రైతులు పడే సంతోషం చూడాలి తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారి మనస్తత్వంతో లాభనష్టాలు చూడొద్దని కోరుతున్నా. ఆసరా పెన్షన్లు, రైతుబంధు వంటివి కూడా లాభం లేని పథకాలుగా భావించి రద్దు చేస్తారా’అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తరచూ తన ఎత్తు గురించి మాట్లాడుతున్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రజల కోసం ఎవరెంత ఆలోచిస్తున్నారో, ఎవరెంత పని చేస్తున్నారో మాత్రమే అవసరమన్నారు. ‘హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. అధికారంలోకి రాగానే, ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైంది. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజు లేకుండా అమలు చేయాలి.. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి’అని హరీశ్ పేర్కొన్నారు.

బండిపై కాంగ్రెస్ ఫైర్

- మంత్రి పొన్నంపై వ్యాఖ్యలను ఖండించిన జీవన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌నుద్దేశించి ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. పదేళ్లుగా రాష్ట్రానికి బీజేపీ, కరీంనగర్‌కు సంజయ్ ఏం చేశారని ప్రశ్నించిన ప్రభాకర్‌పై వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సంజయ్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వ్యాఖ్యానించింది. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుక్కుంటోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక రాముడిని గుడిలో పూజించడం కాకుండా మోదీని గుడిలో పెట్టి పూజించే సంస్కృతి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ తల్లిపై వ్యాఖ్యలు చేయడం బండికి తగదని చెప్పారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొన్నం మాతృమూర్తినుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే కరీంనగర్‌లో సంజయ్‌ను ఓడిస్తానని ఏఐసీసీ ఓబీసీ విభాగం కోఆర్డినేటర్ రుద్ర సంతోశ్ చెప్పారు.

బీజేపీలోకి బీఆర్‌ఎస్ ఎంపీలు?

▶ మొదటి పేజీ తరువాయి

స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది.

సర్వేలే ప్రాతిపదికగా..: మోదీపాలన, బీజేపీ పట్ల పెరుగుతున్న ఆదరణకు తోడు పార్టీ తరఫున బరిలో నిలపాలని భావిస్తున్న అభ్యర్థులు, ఇతర పార్టీల సిట్టింగ్ ఎంపీల ఇమేజ్, గుర్తింపు జత కలిస్తే గెలిచే అవకాశాలు మెరుగవుతాయని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థుల ఎంపికపై వివిధ అంశాల ప్రాతిపదికన బీజేపీ సర్వేలు నిర్వహిస్తోంది.

- రాష్ట్రంలో 12 ఎంపీ సీట్ల పరిధిలో మోదీ పాలన, పార్టీ పట్ల ప్రజల్లో మద్దతు 30 శాతానికి పైగా వ్యక్తం కాగా, ప్రజల్లో సొంతంగా పదినుంచి 15 శాతం సానుకూలత సాధించే బలమైన అభ్యర్థికి టికెట్ ఇస్తే 8 నుంచి 10 దాకా కచ్చితంగా గెలిచే అవకాశాలున్నాయని బీజేపీ ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు.
- మిగతా ఐదారు స్థానాల్లో పార్టీ పట్ల ప్రజల్లో 20 శాతం దాకా మద్దతు వ్యక్తం కాగా, ఆయా స్థానాలకు పోటీపడుతున్న పార్టీ అభ్యర్థుల్లో ఐదారు శాతమే సానుకూలత వ్యక్తం కావడంతో ఆ స్థానాల్లో అభ్యర్థుల ఖరారు పెండింగ్‌లో పెట్టాలని నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం.
- పార్టీ అభ్యర్థులు అంతగా బలంగా లేని ఆయా సెగ్మెంట్ల పరిధిలో ఇతర పార్టీలకు చెందిన సిట్టింగ్ ఎంపీలు వస్తే గెలిచే అవకాశాలపై అన్వేషణ సాగిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఇతర పార్టీలకు చెందిన కొందరు సిట్టింగ్ ఎంపీలు ఓకే అంటే వారిలో బరిలో దింపేందుకు నాయకత్వం సిద్ధమైనట్టు పార్టీ వర్గాల సమాచారం.
- ఇటీవల జరిగిన రాష్ట్రపార్టీ విస్తృత భేటీలో నిర్వహించిన అభిప్రాయసేకరణలో ఎంపీ రాములు చేరితే నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాన్ని తప్పక గెలుచుకోగలుగుతామనే అభిప్రాయాన్ని పార్టీ నేతలు వెలిబుచ్చినట్టు సమాచారం. పార్టీపరంగా సర్వేతో పాటు రాములు వస్తే విజయం సాధిస్తామనే అంచనాల నేపథ్యంలో ఆయనను చేర్చుకునేందుకు లైన్ క్లియర్ చేసినట్టు తెలుస్తోంది.

10న బీఆర్‌ఎస్ ‘చలో కరీంనగర్’

- మేడిగడ్డపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేలా బహిరంగసభ
- సభ ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టే లక్ష్యంతో బీఆర్‌ఎస్ వచ్చే నెల పదోతేదీన భారీ బహిరంగసభ నిర్వహించనుంది. ‘చలో కరీంనగర్’పేరిట నిర్వహించే ఈ సభకు గోదావరి పరీవాహక ప్రాంత జిల్లాల నుంచి భారీ జనసమీకరణ చేయాలని నిర్ణయించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఈ సభకు పొరుగునే ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్‌తోపాటు ఖమ్మం నుంచి కూడా జనసమీకరణ చేసేలా బీఆర్‌ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సభ నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం తెలంగాణభవన్‌లో భేటీ అయ్యారు. ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు కేసుల నమోదు, అరెస్టులకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు.

ఏర్పాట్లపై కేటీఆర్ దిశానిర్దేశం: ‘చలో మేడిగడ్డ’పేరిట మార్చి 1న పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతల పర్యటన ఏర్పాట్లపై కేటీఆర్ పలు సూచనలు చేశారు. సభా ప్రాంగణం ఎంపిక, ఎండలు ముదురుతున్న నేపథ్యంలో చేయాల్సిన వాటిపై దిశానిర్దేశం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, మరమ్మతులో నిర్లక్ష్యం, ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగింపే లక్ష్యంగా ఈ సమావేశం ఉంటుందని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

బీఆర్‌ఎస్ ‘చలో మేడిగడ్డ’

▶ మొదటి పేజీ తరువాయి


హయాంలో కడెం, గుండ్లవాగు, మూసీ, సింగూరు, పులిచింతల సహా అనే ప్రాజెక్టుల్లో సమస్యలు వచ్చాయి. బ్యారేజీల మరమ్మతుకు ఇంజనీరింగ్ పరిష్కారాలు ఉన్నాయి. రాజకీయ లబ్ధి మానుకుని రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాఫర్ డ్యాంను నిర్మించి మేడిగడ్డలో దెబ్బతిన్న మూడు పిల్లర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వచ్చే వేసవిలో సాగునీరే కాదు.. మంచినీళ్లు కూడా ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం చేసినా రైతుల జీవితాలను దెబ్బ తీసి పొలాలను ఎండబెట్టకండి.

కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే కాదు

కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ మాత్రమే కాదని మూడు బ్యారేజీలు, అనేక రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లు, సొరంగాలు, కాలువల సమాహారం. 40 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే కామధేనువు కాళేశ్వరం వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లను సందర్శిస్తాం. తెలంగాణకు ఉన్న భౌగోళిక పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకాల ద్వారానే నీరు అందించడం సాధ్యం. కాస్ట్ బెనిఫిట్ అనాలసిస్ అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్న మేధావులు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. బాసర నుంచి భద్రాచలం దాకా గోదావరి జలాల కోసం 60 ఏళ్ల పాటు పోరాటాలు జరిగినా తెలంగాణకు నీళ్లకు బదులుగా కన్నీళ్లు మిగిల్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. నీళ్ల గోసను గద్దర్, సదాశివుడు వంటి కవులు వివరిస్తే, జల సాధన ఉద్యమాల ద్వారా కేసీఆర్ పల్లెలను జాగృతం చేశారు. గోదావరి జలాలను తెలంగాణ పొలాలకు మళ్లించే సంకల్పంతోనే సీడబ్ల్యూసీ, నిపుణుల సూచనతో మహారాష్ట్రతో సంప్రదించి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు.

కాగ్ నివేదిక పవిత్ర గ్రంథం కాదు

కాగ్ రిపోర్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి సహా అనేక మంది తప్పుపట్టి అదేమీ పవిత్ర గ్రంథం కాదని తేల్చారు. గతంలో జలయజ్ఞం సహా కల్వకుర్తి ప్రాజెక్టులో రూ.900 కోట్ల గురించి కాగ్ ప్రస్తావించింది. కాగ్ నివేదికపై ద్వంద్వ వాదన వినిపిస్తున్న కాంగ్రెస్ సమాధానాలు చెప్పాలి. అప్పుల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రస్తుతం కొత్తగా అప్పులు తేవొద్దు.



జనాలు సాధారణంగా (సంతోషం కోసం) ఇతరులు ఏం చేస్తున్నారో చూసి, గుడ్డిగా అనుసరిస్తారు. నిజమైన సంతోషం ఏమిటో వారికి అంత ముఖ్యమైనది కానట్టుగా దాన్ని ఇతరుల ఎంపికకు వదిలేస్తారు.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 28 ఫిబ్రవరి 2024

ఆచితూచి అడుగేద్దాం!

శాస్త్రవిజ్ఞాన విజయాలతో మానవాళి ఎప్పటికప్పుడు ముందడుగేయడం చరిత్రలో సంతోష సందర్భమే. గత వారం అలాంటి మరో సందర్భం ఎదురైంది. పుడమికి అతి సమీపంలో ఉండే గ్రహమైన చంద్రునిపై మరోసారి మానవ మేధ సాఫ్ట్ ల్యాండింగ్ చేయగలిగింది. ఇప్పటి దాకా వివిధ దేశాల ప్రభుత్వాలు అధికారిక అంతరిక్ష పరిశోధనా సంస్థలతో అద్భుత విజయాలు సాధించడం చూశాం. ఈసారి ఓ ప్రైవేట్ సంస్థ చందమామపై జయకేతనం ఎగరేసింది. అమెరికాకు చెందిన 'ఇన్ట్యూటివ్ మెషీన్స్' (ఐఎం) సంస్థ ఫిబ్రవరి 22న ఓ రోబోటిక్ వ్యోమనౌకను చందమామపై సాఫ్ట్ ల్యాండ్ చేసింది. ఆ ఘనత సాధించిన తొలి ప్రైవేట్ సంస్థగా చరిత్ర సృష్టించింది. ఇప్పటి వరకు ప్రపంచంలో కేవలం అయిదే దేశాలు జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేశాయి. అలా చూస్తే, ఒక ప్రైవేట్ సంస్థ ఆ అపురూప విన్యాసం చేయడం చెప్పుకోదగ్గ మైలురాయి. అయితే, చరిత్రలో రెండో పర్యాయం ఇప్పుడు మళ్ళీ జాబిల్లిపై వ్యోమయానం ఊపందుకున్న వేళ రానున్న రోజుల్లో అంతర్జాతీయంగా నిర్దిష్టమైన అంతరిక్ష విధానం, ప్రత్యేక అంతరిక్ష చట్టం అవసరం ఉందని అర్థమవుతోంది.

అమెరికా అంతరిక్ష నౌక ఒకటి చంద్రమండల ఉపరితలంపై దిగడం గత 50 ఏళ్ళ పైచిలుకులో ఇదే ప్రథమం! అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' 1972లో అపోలో ప్రోగ్రామ్కు తెర దించిన తర్వాత మళ్ళీ ఆ దేశం చంద్ర మండల పునఃప్రవేశం మళ్ళీ ఇప్పుడే! చంద్రునిపై వ్యోమనౌక దిగడమనే సవాలులో మానవజాతి ఎన్నో ఏళ్ళుగా విజయాలు, వైఫల్యాలు – రెండూ చవిచూసింది. చంద్రునిపై దిగడంలో విఫలమైన ప్రతిసారీ వ్యోమనౌకల శకలాలు చంద్రోపరితలంపై చెల్లాచెదరై పడివుండడమూ చూశాం. అంతెందుకు... గత నెలలో మరో అమెరికన్ సంస్థ 'ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ' సైతం ఓ ల్యాండర్ను చంద్రునిపైకి పంపాలని చూసింది. ఇంధనం లీకేజీతో ఆ యత్నాన్ని అర్ధంతరంగా ముగించింది. సదరు ల్యాండర్ భూవాతావరణంలోకి పునఃప్రవేశించి, పసిఫిక్ మహాసముద్రంపై దగ్ధమైంది. విఫలమైన ఆ 'ఆస్ట్రోబోటిక్', విజయవంతమైన 'ఐఎం' సంస్థ... రెండూ 'నాసా' అండతో వాణిజ్యపంథాలో చంద్రునిపైకి వ్యోమనౌకల్ని పంపే కృషిలో భాగమే. గగనాంతర సీమల గవేషణలో ప్రైవేట్ రంగ ప్రమేయం పెరుగుతున్న తీరుకు ఇది ఉదాహరణ.

చరిత్ర గమనిస్తే – 1966లోనే సోవియట్ యూనియన్ 'లూనా9' తొలిసారిగా చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది. నాలుగు నెలల తర్వాత 'సర్వేయర్1'తో అమెరికా విజయం సాధించింది. అది క్రమంగా చంద్రునిపైకి మానవయాత్రకు దారి తీసింది. 1969లో నాసా 'అపోలో11'తో నీల్ ఆర్మ్స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్లు చంద్రునిపై అడుగిడిన తొలి వ్యక్తులుగా చరిత్ర సృష్టించినప్పటి నుంచి ఇప్పటికి అరడజనుకు పైగా యాత్రల్లో డజను మంది చంద్రునిపై కాలుమోపారు. 2026 చివరి కల్లా మరోసారి చంద్రునిపైకి మానవ యానానికి అమెరికా సిద్ధమవుతోంది. మూడో దేశంగా చైనా, గత ఏడాది 'చంద్రయాన్3' ద్వారా రెండో ప్రయత్నంలో విజయం సాధించి నాలుగో దేశంగా భారత్ చంద్రునిపై ల్యాండింగ్ చేశాయి. ఈ జనవరిలో జపాన్ తప్పుదిశలో ల్యాండింగ్ జరిపినప్పటికీ, అసలంటూ చేసిన అయిదో దేశంగా ఆ జాబితాలో చేరింది. ఇప్పుడు ఐఎం విజయంతో చంద్రమండల యాత్రల్లో ప్రైవేట్ రంగ శక్తియుక్తులు హెచ్చనున్నాయి. మరిన్ని యాత్రలకు సన్నాహాలు సాగుతున్నందున లోతైన అన్వేషణ, శాస్త్రీయ పరిశోధనలకు కలువలరేడు కేంద్రబిందువు కానున్నాడు.

నిజానికి, చంద్రునిపై దిగేందుకు ప్రైవేట్ సంస్థలు గతంలోనూ అనేక యత్నాలు చేశాయి. 2019లో ఇజ్రాయెల్ బెరేషీట్ చంద్రునిపై కుప్పకూలింది. 2023లో ఓ జపనీస్ సంస్థ తాలూకు ల్యాండర్ పడిపోయింది. తాజా ప్రైవేట్ ప్రయోగ విజయంలోనూ లోటుపాట్లు లేకపోలేదు. గ్రీకు పురాణాల్లోని తెలివైన వీరుడు 'ఒడిస్సియస్' పేరు పెట్టుకున్న ఐఎం వారి వ్యోమనౌక ఆఖరుఘట్టంలో జాబిల్లి దక్షిణ ధ్రువానికి దగ్గరలో నేరుగా కాక అనుకున్నదాని కన్నా వేగంగా, పక్కవాటుగా దిగింది. దాంతో, ముందనుకున్నట్టు వారం కాకుండా, 2–3 రోజుల ముందే తట్టాబుట్టా సర్దుకుంటోంది. అయితే, అసలంటూ ఐఎం విజయవంతం కావడంతో నాసా 'కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్' (సీఎల్పీఎస్) కార్యక్రమం కింద మరిన్ని ప్రైవేట్ ప్రయత్నాలు సాగుతాయి. 2020 నాటికి పూర్తయ్యేలా మరో 14 ప్రైవేట్ సంస్థలతో నాసా పెట్టుకున్న 260 కోట్ల డాలర్ల కాంట్రాక్టులే అందుకు తార్కాణం. ఇటీవలే భారత్ సైతం జాతీయ అంతరిక్ష రంగంలో నూరు శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచింది. అంటే రానున్న రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)పై భారం తగ్గి, ప్రైవేట్ రంగంలో భారతీయ అంకుర సంస్థల మధ్య పోటాపోటీ పెరగనుంది.

ప్రపంచమంతటా ఇలాంటి ప్రైవేట్ ప్రయత్నాలతో కష్టాలూ తప్పవు. 1967 నాటి 'ఔటర్ స్పేస్ ట్రీటీ' మినహా ఇప్పటికీ అంతర్జాతీయ అంతరిక్ష నిబంధనలేవీ లేవు. ఆ ఒడంబడిక సైతం అనుసరించాల్సిన విధుల జాబితాయే తప్ప, పాటించి తీరాల్సిన ఆదేశాలు కావు. తాజా ఒడిస్సియస్ దెబ్బతో వివిధ సంస్థలు చంద్రునిపైకి ఏవైనా పంపి, దాన్ని ఎలాగైనా నింపే వీలుంది. అందుకే, ఇప్పుడు అంతర్జాతీయ అంతరిక్ష, చంద్రమండల చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఇప్పటికే ఉపగ్రహాలతో క్రిక్కిరిసిన దిగువ భూకక్ష్య లానే చంద్రమండలమూ నిండవచ్చని శాస్త్రవేత్తల జోస్యం. చంద్రునిపై నిర్ణీత ప్రాంతాలు శాస్త్రీయ పరిశోధనా శాలలకు కీలకం గనక అవాంఛనీయ పోటీ తప్పదు. విలువైన హీలియమ్3 కోసం చంద్రునిపై గనుల తవ్వకాలు జరిగినా ఆశ్చర్యం లేదంటున్నారు. కాబట్టి, ఆచితూచి అడుగు వేయాల్సిన సందర్భమిది. నైతికతకు కట్టుబడి పరిశోధనలు సాగిస్తూనే, వెన్నెలరేడు వాతావరణాన్ని విధ్వంసం చేయనిరీతిలో చట్టాలు చేసుకోవాల్సిన సమయమిది.

చారిత్రక మూలాల్లో జ్ఞాన కాంతులు

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ఏ దేశానికైనా, ఏ జాతికైనా చారిత్రక తాత్విక జ్ఞానం అవసరం. నిజానికి తొలి నుంచీ ఉన్నది భౌతికవాదమే. భారతదేశంలోని భౌతికవాద చింతన అన్ని కీలక పరిణామాల్లో ప్రధాన శక్తిగా నిలిచింది. మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పును, నీరును, గాలిని, భూమిని; వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. అయితే అనేక సందర్భాలలో ప్రజలు వెలుగు నుండి చీకట్లోకి, జ్ఞానం నుండి అజ్ఞానంలోకి, వాస్తవం నుండి భ్రమలలోకి తిరోగమిస్తూ ఉంటారు. అప్పుడే అభ్యుదయవాదులు వారిలో జ్ఞానతృష్ణను కలిగించాలి.

భారతదేశ తాత్విక మూలాలపై ఈనాడు లోతైన చర్చ జరుగుతోంది. నిజానికి భారతీయ తత్వశాస్త్రాన్ని సృష్టించినవారు మూలవాసులు. వీరు మెసపటోమియా, సింధూ నాగరికతల కాలం నాటివారు. వీరి మౌఖిక జ్ఞాన సంపదకు ప్రత్యామ్నాయంగానే వైదిక సాహిత్యం వచ్చింది. వైదిక సాహిత్యం కూడా మొదట్లో మౌఖిక రూపంలోనే ఉంది. తర్వాత లిఖిత రూపం ధరించింది. భారతీయ తత్వశాస్త్రం ప్రధానంగా భౌతికవాద తత్వశాస్త్రం. భారతదేశంలో తత్వశాస్త్రమంటే ఆధ్యాత్మిక వాదంగా ప్రచారం చేశారు. తత్వశాస్త్రమనగానే అది ఆత్మ గురించో, పరలోకం గురించో చెప్పేదనే భావన ఏర్పడింది. నిజానికి భౌతిక అంశాల నుండి రూపొందినదే తత్వశాస్త్రం. భారతదేశంలో అతి ప్రాచీన జాతులు తాత్వికాంశాల మీద సుదీర్ఘమైన చర్చ చేశాయి. శరీరానికీ, చైతన్యానికీ ఉన్న సంబంధాన్నీ; మానవునికీ, ప్రకృతికీ ఉన్న సంబంధాన్నీ, విశ్వ పరిణామాన్నీ, మానవ పరిణామాన్నీ వీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. ప్రకృతి; సమాజం పట్ల ఉదయించిన అనేక ప్రశ్నలకు భౌతిక దృక్పథంతో సమాధానం వెదికారు.

మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పును, నీరును, గాలిని, భూమిని; వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. నిప్పు మానవ సామాజిక పరిణామంలో కీలక పాత్ర వహించింది. నిప్పును ఆరాధించిన జాతుల కంటే, నిప్పును భౌతిక శక్తిగా గుర్తించిన జాతులు శక్తిమంతంగా ముందుకు నడిచాయి. నిప్పు మానవ జీవితాన్ని ఒక భౌతిక శక్తిగా ప్రభావితం చేసింది. నిప్పును ఆరాధించే జాతులకూ, నిప్పును అధీనం చేసుకొన్న జాతులకూ సమరం జరిగింది. తన చుట్టూ వున్న భౌతిక ప్రపంచాన్ని సమన్వయించుకోవడంలో విఫలమైనవారు భావవాదులుగా రూపొందారు. వీరు భౌతిక సామాజిక వాస్తవికతకు భిన్నమైన భావవాదంతో భౌతికవాదులకు ఎదురు నిలుస్తూ వచ్చారు.

అంతేగాక వానరుడి నుండి నరుడిగా పరిణామం చెందిన ప్రతి కీలక దశలోనూ మానవుని భౌతిక దృక్పథమే అతనికి నిర్ణయాత్మక మెట్టుగా ఉపకరించింది. లక్షలాది సంవత్సరాలకు పూర్వం ఉష్ణమండలంలో ఎక్కడో ఒక చోట నరవానరుడిగా ఉన్న మానవుడు మానవుడిగా రూపొందిన పరిణామంలో చేతుల్ని ఉపయోగించుకున్న తీరును ఎంగెల్స్ వర్ణించాడు. రోమ శరీరులైన మన పూర్వీకులు మొదట ఒక నియమంగానూ, తరువాత అవసరంగానూ నిలబడటానికి కారణం ఆనాటికి చేతులకు వివిధ రకాలైన ఇతర పనులు ఏర్పడి ఉంటాయని అనుకోవాలి. వానరాలు ఆహారాన్ని స్వీకరించడానికి, ఆహారాన్ని పట్టుకోవడానికి చేతులను ఉపయోగిస్తాయి. కొన్ని రకాల క్రింది తరగతి స్తన్య జంతువులలో కూడా ముందు పంజాలను



ఉపయోగించడం మనం చూస్తాం. చాలా రకాల కోతులు తాము చెట్ల మీద నివసించడానికై గూళ్ళను నిర్మించడానికి చేతులను ఉపయోగిస్తాయి. చింపాంజీలు తమ చేతులతో చెట్ల కొమ్మల మధ్య కప్పులు చేసుకొని ఎండ వానల నుండి కాపాడుకుంటాయి. శత్రువుల నుండి ఆత్మ రక్షణకై ఇవి చేతులతో కర్రలను, కొమ్మలను పట్టుకొని కొట్టడానికి పూనుకొంటాయి. బోనుల్లో ఉంచిన కోతులు మానవులను చూచి నేర్చుకున్న అనేక చిన్న చిన్న పనులను తమ చేతులతో చేయగలవు. కానీ మానవునికెంతో సన్నిహితమైన దశకు చేరుకున్న వానరుని చేతినీ, అనేక లక్షల సంవత్సరాల కర్మల వల్ల అభివృద్ధి నొందిన మానవుడి చేతిని చూస్తే ఎంతో భేదం కనబడుతుంది. కండరాల సంఖ్య ఒక్కటే, నిర్మాణం కూడా ఒక్కటే. అయినా ఎంతటి నికృష్టస్థితిలోని ఆటవికుడైన మానవుని హస్తం కూడా ఎంతో అభివృద్ధి చెందిన వానర హస్తం చేయలేని వందలాది పనులను అలవోకగా చేస్తుంది. వానర హస్తం ఏ చిన్న రాతి పనిముట్టును ఎంత బండగానైన చేసి ఎరుగదు.

భారతదేశంలోని భౌతికవాద చింతన అన్ని కీలక పరిణామాల్లో ప్రధాన శక్తిగా నిలిచింది. మానవ జాతి ప్రతి అడుగులో తన అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటూ ముందుకు నడిచింది. ఈ భౌతిక దృక్పథంతో కూడిన మానవ ప్రయాణానికి భావవాదం ఒక పెద్ద అవరోధంగా నిలిచింది. మానవ ప్రగతిలో అసమానతలు సృష్టించింది. చరిత్ర పరిణామ క్రమంలో మానవ సమాజాన్ని సమన్వయించడాన్ని మార్క్స్ గతి తార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథం అన్నాడు. ఈ క్రమంలో భారత సమాజాన్ని పరిశీలిస్తే చార్వాకులు భారత ఉత్తరఖండంలో భౌతిక సిద్ధాంత కర్తలుగా మన ముందు నిలుస్తారు. వారికి ఎదురు నిలిచిన వైదికులు భావ వాదానికి కొమ్ము కాసిన ప్రతినిధులు అయ్యారు.

వేద వాఙ్మయానికి ప్రత్యామ్నాయంగా భారతీయ భౌతికవాదంగా చార్వాకవాదం ముందుకొచ్చింది. భారతీయ భౌతికవాదాన్ని సాంఖ్యదర్శనం ముందుకు తీసుకువెళ్ళింది. ఈ సాంఖ్య శాస్త్రానికి మూల పురుషులు కపిలుడు, అసురీ, పంచశిఖుడు, ఈశ్వర కృష్ణుడు. ఈశ్వర కృష్ణుని 26 మంది గురుతరాల నుండి ఈ సాంఖ్యం బోధింపబడినట్లు చెప్పబడింది. ఒక్కొక్క గురువు నుండి మరొక గురువు తరానికి 30 సంవత్సరాల అంతరం ఉందని అనుకుంటే, 780 సంవత్సరాల అంతరం కపిలుడికీ, ఈశ్వర కృష్ణుడికీ ఉంది. దీనిని బట్టి కపిలుడు క్రీ.పూ.7, 8 శతాబ్దాల వాడై ఉండవచ్చునని చరిత్రకారుల అంచనా. బుద్ధుడి మీద కూడా సాంఖ్య ప్రభావం ఉందనేది స్పష్టం. బుద్ధుడు క్రీ.పూ. 6వ శతాబ్దం వాడనుకుంటే సాంఖ్య సిద్ధాంతం అప్పటికే ప్రాచుర్యం పొంది ఉంది. దీనినిబట్టి కూడా కపిలుని సాంఖ్య శాస్త్రం క్రీ.పూ. 8 శతాబ్దిదని అనుకోవచ్చు.

ఇకపోతే సమాజ నిర్మాణానికి సంబంధించిన మూలాలను అధ్యయనం చేయకుండా, సమాజ వ్యవస్థను ఉన్నదున్నట్లుగా అంగీకరించడం యధాతథవాదం. అది మార్పును అంగీకరించని వాదం. మార్పునకు భావజాలం ఒక చోదకశక్తి. దళితుల చరిత్ర నిర్మాణంలో హేతువాదమే కీలకం అవుతుంది. బి.ఆర్. అంబేడ్కర్ హేతువాద దృక్పథంతోనే సామాజిక చరిత్ర నిర్మాణంలోని చిక్కుముడులను విప్పారు. కానీ లిఖిత పరమైన ఆధారాలు లేవని వీరి చరిత్రను మనువాదులు నిరాకరిస్తారు. భారతదేశంలో మనువాదం ఉత్పత్తికి భిన్నమైనది. జీవిక కోసం సృష్టించిన ఆధ్యాత్మిక కల్పన వాదం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి చివరికి దేశ చరిత్రను గజిబిజి చేసింది. అనేక వైరుధ్యాలు, ప్రక్షిప్తాలతో కూడిన సాహిత్యంలో తాత్విక అంశాలు, చారిత్రక అంశాలు మృగ్యమైనాయి.

ప్రజలు ఎల్లప్పుడు రాజకీయాల్లో వంచనకు, ఆత్మ వంచనకు తెలివి తక్కువగా బలి అవుతూనే ఉన్నారు. అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల ప్రకటనల వెనుక ఏదో ఒక వర్గపు ప్రయోజనాలు దాగివున్నాయనే విషయాన్ని గ్రహించేంత వరకు వారలా బలి అవుతూనే ఉంటారు. ప్రతి పురాతన సంస్థ అది ఎంత అనాగరికమైనదిగా, కుళ్ళిపోయినదిగా కనబడినప్పటికీ పాలక వర్గాలకు చెందిన కొన్ని శక్తులచే అది నిలబెట్టబడుతోంది. ఈ విషయాన్ని గ్రహించనంతవరకూ సంస్కరణ వాదులు, అభివృద్ధి కాముకులు పాత వ్యవస్థను సమర్థించే వారి చేత మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకే ఒక మార్గం వుంది. అదేమిటంటే మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతను తుడిచి వేసి కొత్తను సృష్టించే సామర్థ్యం కలిగివున్న శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటిత పర్చడం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గొప్ప వైద్యుడు



ఇండియాలో ఎండోక్రైనాలజీ విభాగ వ్యవస్థాపకుల్లో ఒకరైన ప్రొఫెసర్ నారాయణ పణిక్కర్ కోచుపిళ్లై మరణం (ఫిబ్రవరి 26) అత్యంత బాధాకరం. ఆయనకు ఎండోక్రైనాలజీ వైద్యులు (మధుమేహం లాంటివి చూసే వాళ్ళు), మొత్తంగా దేశ వైద్యరంగమూ రుణపడి ఉంటుంది.

– అంబరీశ్ మిథల్, ఎండోక్రైనాలజిస్ట్

నగరాలు చేయాల్సినవి...



దేశంలో దాదాపు 70 శాతం గ్రీన్హౌజ్ వాయు ఉద్గారాలకు భారత నగరాలే కారణం. చాలా నగరాలు 2050 కల్లా తమ జనాభాను రెట్టింపు చేసుకుంటాయి. అందుకే ఇవి నడకకు, సైకిళ్లకు వసతులు కల్పించాలి. పాదాచారుల క్రాసింగ్ సిగ్నల్స్ ఏర్పాటుచేయాలి. విద్యుత్ వాహనాల ఛార్జింగ్కు మౌలిక వసతులు కల్పించాలి. టాప్ క్లాస్ ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పరచాలి.

– అమితాభ్ కాంత్, నీతి ఆయోగ్ మాజీ సీఈఓ

నవ హీరోలు



ఇస్రో తలపెట్టిన తొలి స్పేస్ఫ్లైట్ మిషన్ 'గగన్యాన్'లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లేందుకు నలుగురు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫైటర్ పైలట్లు ఎంపిక య్యారు. గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా. వాళ్లకు అభినందనలు.

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

ఎత్తుగడ



ప్రతిపక్ష పార్టీ నాయకుడి భార్యనో, మేనల్లుడినో మీ పార్టీలోకి చేర్చుకోవాలి; ఇక వీళ్లు అవతలి పక్షంలో ఉన్నప్పటికీ ఆ నాయకుడు వీళ్లకు మద్దతిస్తాడు.

– ప్రసేన్జిత్ దత్తా, వ్యాఖ్యాత

లోపలి పోరు



నేను: రాత్రి బాగా ఆలస్యమైంది కాబట్టి, ఇంకొంత సేపు పడుకోవచ్చు. ఐదింటికి నా బుర్ర: అమ్మాయీ లే! కుక్కను అలా ఓసారి తిప్పుకొని వచ్చి, నవలను రివైజ్ చేయాల్సిన టైమ్ ఇది.

– తాహా కొరీల్, రచయిత్రి

ఇన్ బాక్స్

సైన్స్ ప్రచారంలో...

జన విజ్ఞాన వేదిక' ఒక సైన్సు ప్రచార సంస్థ. ఇది సమాజంలో శాస్త్ర దృక్పథంతో సంబంధం లేకుండా జరుగుతున్న అన్యాయాలనూ, మూఢ నమ్మకాలనూ ఎదిరించి సామాన్య ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తూ ఉంది. 1988 ఫిబ్రవరి 28న డాక్టర్స్ , ఇంజనీర్స్, ఉపాధ్యాయులు, లాయర్స్ వంటి అనేక మంది మేధావులతో ఏర్పడ్డది. అప్పటినుంచి అప్రతిహతంగా ప్రజాసైన్స్ ఉద్యమాన్ని నడుపుతోంది. మూఢ నమ్మకాలు, ఛాందస భావాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దీర్ఘకాల పోరాటాలు చేస్తోంది. జీవ వైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం, కాలుష్యాన్ని అరికట్టేందుకు కృషి చేయడం, శాస్త్ర శోధనలను ప్రోత్సహించడం వంటి ఆశయాలను కొనసాగిస్తూ ఉంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 51ఏ(హెచ్) ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తున్నది.

ప్రారంభంలో సారా నిషేధం, అక్షరాస్యత ఉద్యమాలతో జన విజ్ఞాన వేదిక ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తనదైన ముద్ర వేసింది. 'చెకుముకి' సంబరాలతో బాల్య దశలోనే శాస్త్రీయ అభివృద్ధికి కృషి చేస్తోంది. కూల్ డ్రింక్స్ తాగొద్దని ప్రచారం చేస్తూ సహజ పానీయాల్ని తాగాలని ప్రోత్సహిస్తున్నది. గ్రహణంపై ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగించింది. ఈ సంస్థకు 2005లో శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేసినందుకుగాను జాతీయ బహుమతి లభించింది. ఇది జన విజ్ఞాన వేదిక సైన్సు ప్రచారంలో చేస్తున్న కృషికి మంచి గుర్తింపు. పరిశీలన, ప్రశ్న, పరికల్పన, ప్రయోగం, విశ్లేషణ, నిర్ధారణ దశల ద్వారా కనుగొన్న సత్యమే సైన్సులో భాగం కావాలని నిరంతరం ఈ సంస్థ ప్రచారం చేస్తున్నది. వైజ్ఞానిక పద్ధతిని నిత్యజీవన సమస్యల అవగాహనకూ, పరిష్కారానికీ ఉపయోగించుకుంటే అది వైజ్ఞానిక దృక్పథం అవుతుంది. సైన్సు అందించే జీవనతత్వాన్నీ, టెక్నాలజీలనూ వాడుకుని మానవాభ్యుదయం వైపు సాగడమే స్వేచ్ఛకు మార్గం. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్. ప్రజా సైన్స్ ఉద్యమం వర్ధిల్లాలి.

– సంపతి రమేష్ మహారాజ్
జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
(జన విజ్ఞాన వేదిక ఆవిర్భవించి నేటికి 35 ఏళ్లు)

సారాంశం

సరికొండ చలపతి

పిడుగులున్నారు... హై'టేక్ కేర్'..!

సోషల్ మీడియాలో తిరుగుతోన్న ఓ జోక్ చూడండి.
ఏడేళ్ల పిల్లాడు ఫొటో దిగడానికి వాళ్ల నాన్నతో కలిసి స్టూడియోకి వెళ్లాడు. పిల్లాడు కుదురుగా కూచుంటాడో లేదోనని కంగారు పడుతున్న వాళ్ల నాన్నని చూసి ఫొటోగ్రాఫర్ ''మై హూం నా.. '' అన్నట్టు కళ్లతో సైగ చేస్తూ.. చిరునవ్వుతో పిల్లాడితో ఇలా అన్నాడు.
''ఇటు చూడమ్మా.. కెమెరానే చూడాలి.. ఫ్లాష్ వస్తుంది.. కళ్లు మూయకూడదు. ఇలా అలా కదలకూడదు. చూడు కెమెరాలోంచి పిట్టలొస్తాయి....''
తన చేతిలో ఉన్న ఫోన్ పక్కన పెడుతూ ఏడేళ్ల పిల్లాడి జవాబు ఇది..
''ఏం కతలు పడుతున్నావా.. సరిగా ఫోకస్ చెయ్యి.. పోట్రెయిట్ మోడ్ యూస్ చెయ్యి. ఐఎస్ఓ 200 కంటే తక్కువ పెట్టు. హై రెజల్యూషన్ పిక్ కావాలి. ఫేస్బుక్ ప్రొఫైల్ కోసం. ముచ్చట్లాపి సరిగ్గా తియ్యి.. పిచ్చుకలెలా వస్తాయి కెమెరాలోంచి ఏం మీ అయ్యగూడు పెట్టిండా కెమెరాలోపల...''
– ఫొటోగ్రాఫర్ ఫేస్ ఫీలింగ్స్... పిల్లాడి నాన్న కళ్లలో భయం సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదుగా...

....

పిల్లలు పిడుగులవుతున్నారు.. నిన్నటి చందమామ కథలు ఇకవారి దగ్గర నడవవు.
సమస్త ప్రపంచం, టెక్నాలజీ వారి చేతిలోకి వచ్చింది.

....

ఇలాంటి దృశ్యాలు ఇప్పుడు మామూలే..
ఓ చిన్నారి.. ఏవో చిన్నచిన్న వస్తువులతో రోబో వంటి ఆకృతిని తయారు చేసింది. సముద్రాలెన్ని, ఖండాలెన్ని, వాటి పేర్లేమిటన్న పాఠాలనూ అప్పజెప్తోంది.
మరో చిన్నారి ఉన్నట్టుండి చక్కగా బొమ్మలు వేయడం మొదలుపెట్టేసింది. ఇంకో చిన్నారి పేపర్ను మడిచి విభిన్న ఆకృతులను (ఒరిగామి) తయారు చేస్తోంది.
ఇవేవీ బడిలో చెప్పినవి కాదు. తల్లిదండ్రులు నేర్పినవీ కాదు.. మరెక్కడివి? యూట్యూబ్లో ఎడ్యుకేషన్ వీడియోలు చూశారు. తామూ సొంతంగా ఏదో చేయాలనుకున్నారు.
అంతే.. ఇలాంటి చిన్నారులెందరో 'టెక్నాలజీ' గురువుకు ఏకలవ్య శిష్యులు.



రోజూ మూడు గంటలు సోషల్ మీడియాలో...
గత ఏడాది మన దేశంలో పిల్లల సోషల్ మీడియా అలవాట్లపై సర్వే జరిగింది. అందులో 9 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో 60 శాతం మంది రోజూ 3 గంటలకుపైనే సోషల్ మీడియాలో గడుపుతున్నట్టు తేలింది.

- 13–17 ఏళ్ల మధ్య టీనేజర్లలో 95 శాతం 8–12 మధ్య పిల్లల్లో 40 శాతం మంది సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు.
- పిల్లల్లో 15 శాతం మంది రోజూ 6 గంటలకుపైగా ఫోన్తో గడిపితే.. 46 శాతం మంది మూడు నుంచి ఆరు గంటల వరకు వాడుతున్నారు. మరో 39 శాతం మంది గంట నుంచి 3 గంటల వరకు వినియోగిస్తున్నారు.
- 18 ఏళ్లలోపువారు ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగించాలంటే తల్లిదండ్రుల అనుమతిని తప్పనిసరి చేయాలని 73 శాతం తల్లిదండ్రులు సర్వేలో పేర్కొనడం గమనార్హం.

....

టెక్... కిక్...
ప్రముఖ ప్యూ రీసెర్చ్ సంస్థ చేసిన ఓ అధ్యయనం ప్రకారం.. టీనేజ్ పిల్లలు తాము సాధించిన విజయాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. 49 శాతం మంది తాము సాధించినది చెప్పుకొంటుంటే.. 44 శాతం మంది కుటుంబానికి సంబంధించిన పోస్టులు..విహార యాత్రలు, సంబరాలు, ఫంక్షన్లు వంటివి చేస్తున్నారు.

- 34 శాతం మంది తమ ఎమోషన్లను సోషల్మీడియాలో పంచుకుంటుంటే.. అందులో పర్సనల్ విషయాలనూ ప్రస్తావిస్తున్నవారు 13 శాతం ఉన్నారు.
- మతపరమైన అంశాలపై 11 శాతం, రాజకీయ అంశాలపై 9 శాతం టీనేజర్లు పోస్టులు పెడుతున్నారు. ఇక ఎడ్యుకేషన్, సోషల్, ఎంటర్టెయిన్మెంట్ వంటి ఇతర అంశాలపై 28 శాతం మంది పోస్టులు పెడుతున్నారు.

....

డిజిటల్ ఏజ్ తగ్గుతోంది...
ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అధ్యయనాల ప్రకారం.. పిల్లల చేతికి 'టెక్' అందుతున్న వయసు క్రమంగా తగ్గుతూ వస్తోంది. స్మార్ట్ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, ఇతర ఇంటర్నెట్ ఆధారిత పరికరాల విస్తృతే దీనికి కారణం. ఆడుతూ, పాడుతూ నేర్చుకునే క్రమంలో.. ఇటు ఇళ్లలో, అటు స్కూళ్లలో కూడా డిజిటల్ పరికరాల వినియోగం బాగా పెరిగింది. నడక నేర్చుకునే కంటే ముందే.. 'ఫోన్'ను ఆపరేట్ చేయడం, గేమ్స్ ఆడటం నేర్చుకుంటున్న పరిస్థితి ఉంది.

....

కరోనా లాగా స్పీడ్గా...
కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఏడాదికిపైగా లాక్డౌన్లు పెట్టాయి. పెద్దవాళ్లకు కాస్త వెసులుబాటు ఇచ్చినా.. పిల్లల బడులైతే ఏడాదిన్నర పాటు నడవలేదు. ఇంట్లోంచి బయటికి వెళ్లలేని పరిస్థితి. కానీ టెక్నాలజీ పుణ్యమా అని ఏదీ ఆగలేదు. ఆన్లైన్ క్లాసులతో పిల్లల చదువులు భేషుగ్గా సాగాయి. సరికొత్త బోధన దిశగా అడుగులు పడ్డాయి. అదే సమయంలో పిల్లలు తోటివారితో వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకోవడం, చాటింగ్ చేయడం ద్వారా ఒంటరితనాన్ని అధిగమించగలిగారు... **అక్కడ నుంచి సోషల్ మీడియా వేగంగా అంటుకుంది.**

....

నిపుణుల అబ్జర్వేషన్ ఇదీ..

- టెక్నాలజీ చిన్నారులు కొత్త విషయాలను నేర్చుకునేందుకు అద్భుత అవకాశాలను ఇస్తోంది. ఎడ్యుకేషన్ యాప్స్, వీడియోలు, ఇంటరాక్టివ్ గేమ్స్ వంటివి కొత్త, కఠినమైన అంశాలను కూడా అరటిపండు ఒలిచి నోటికి అందించినట్టుగా అతి సులువుగా, సొంతంగా నేర్చుకోగలిగిన సామర్థ్యాన్ని ఇస్తున్నాయి.
- విస్తృతమైన సమాచారం అందుబాటులో ఉండటంతో పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచుతోంది. ఏదైనా ఓ అంశానికి సంబంధించిన కొత్త కొత్త సంగతులను శోధించి తెలుసుకునే అవకాశాలు ఉంటున్నాయి.
- టెక్నాలజీ పిల్లల్లో చిన్ననాటి నుంచే సృజనాత్మకతకు పదును పెడుతోంది. కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయగలిగే సామర్థ్యాన్ని ఇస్తోంది.
- సొంతంగా కంటెంట్ను రూపొందించి ప్రపంచవ్యాప్తంగా ఎవరితోనైనా పంచుకోగలగడంతో పిల్లల్లో వినూత్న ఆలోచనలకు, ఆత్మవిశ్వాసం పెరగడానికి తోడ్పడుతోంది.
- పజిల్స్ను పరిష్కరించడం, ఎడ్యుకేషన్ సంబంధిత గేమ్స్ ఆడటం ద్వారా.. సమస్యలను పరిష్కరించే నైపుణ్యం అలవడుతోంది. ఏదైనా సమస్యకు కొత్త తరహాలో, సులువైన పరిష్కారం కనుగొనే దిశలో ఏకాగ్రత పెంపొందుతోంది.
- ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా విభిన్న నేపథ్యాలున్న పిల్లలను కలిసే అవకాశంతో సామాజిక సంబంధాలపై, భిన్నమైన ప్రాంతాల్లో పరిస్థితులపై అవగాహన ఏర్పడుతోంది. విభిన్న వ్యక్తులతో ఎలా వ్యవహరించాలి, ఎలా స్నేహం చేయాలనే సామర్థ్యం సమకూరుతోంది.

....

వారి సూచన ఇదీ...
ఇదే సమయంలో కంప్యూటర్, స్మార్ట్ఫోన్ వంటి పరికరాల అతి వినియోగం కాస్త చేటుకూ దారితీస్తోంది. పిల్లల శారీరక, మానసిక అంశాలపై ముఖ్యంగా భావోద్వేగాలపై ప్రభావం చూపుతోంది. చిన్నవయసులోనే టెక్నాలజీ వాడకంతో దుష్ప్రభావాలపైనా చాలా అధ్యయనాలు జరిగాయి. ఇబ్బందికరమైన, తప్పుడు సమాచారం, సైబర్ బుల్లీయింగ్ వంటివి పిల్లల మానసిక పరిస్థితిపై వ్యతిరేక ప్రభావం చూపుతున్న ఘటనలూ ఉన్నాయి. రూపాయికి బొమ్మా బొరుసు రెండూ ఉన్నట్టే.. టెక్నాలజీ వెంట మంచి, చెడు రెండూ వస్తున్నాయి. తల్లిదండ్రులు కాస్త జాగ్రత్తగా ఉండగలిగితే చాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చవితి రా.1.04 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** చిత్త పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.2.04 నుండి 3.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.47 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** రా.12.33 నుండి 2.18 వరకు, సంకటహర చతుర్థి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.01.

మరణశయ్యపై మగ్గాలు

నిలిచిపోయిన వస్త్రోత్పత్తి.. | పనుల్లేక 10 వేల మంది కార్మికుల అవస్థలు | ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్ల కోసం ఆందోళన

ప్రభుత్వం వద్ద రూ.కోట్ల బకాయిలు | పనులు కల్పించాలని నేతన్నల డిమాండ్ | నేడు సిరిసిల్లలో 'నేతన్నల ఆకలి కేక.. మహాధర్నా'


సాంచాల మధ్య పోరండ్ల సమ్మయ్య (ఫైల్)

పని కల్పించాల్సిందే..



సిరిసిల్ల నేతన్నలకు పని కల్పించాల్సిందే. ఇదే ప్రధాన డిమాండ్‌తో ఆందోళనకు సిద్ధమయ్యాం. తమిళనాడు ప్రభుత్వం ఏటా 14 కోట్ల మీటర్ల చీరలు, ధోవతుల ఆర్డర్లు ఇస్తూ నేతన్నలకు పని కలి ్పస్తోంది. యార్న్ కూడా సరఫరా చేస్తోంది. ఈ తరహా ప్రయత్నం తెలంగాణలో చేస్తే నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు పని కల్పించాలి. లేకుంటే.. సిరిసిల్ల నేతన్నలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారు.

- మూశం రమేశ్, కార్మిక నేత, సిరిసిల్ల

సిరిసిల్ల: 'సాంచాల మధ్య వస్త్రోత్పత్తి చేస్తున్న ఈయన పేరు పోరండ్ల సమ్మయ్య. వయసు 52 ఏళ్లు. 32 ఏళ్లుగా సాంచాలు నడుపుతున్న సమ్మయ్యకు ముగ్గురు పిల్లలున్నారు. భార్య బీడీలు చుడుతుంది. ఇటీవలి వరకు బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేస్తే నెలకు రూ.16 వేల వరకు ఉపాధి లభించింది. బతుకమ్మ చీరలు అయిపోగానే పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేయడం ద్వారా నెలకు రూ.10 వేలు సంపాదించుకున్నాడు. ఇప్పుడు సాంచాలకు నూలు రావడం లేదు. బీములు తెగితే మరో బీము ఎక్కడం లేదు. ఫలితంగా పని లేదు. పాలిస్టర్ బట్టకు మార్కెట్ ధర లేక వస్త్రోత్పత్తిని నిలిపివేశాడు..'

గతంలో ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు, ప్రైవేటు పాలిస్టర్ ఆర్డర్లతో సమాంతరంగా సిరిసిల్ల నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి లభించేది. ఇప్పుడు సమ్మయ్య లాంటి నేతన్నలకు పనిలేక దిక్కులు చూస్తున్నారు. మరోపని చేతకాక.. వస్త్రోత్పత్తి లేక.. పదివేల మంది కార్మికులు, ఆసాములు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

'సిరిసిల్లలో ఎప్పుడూ బిజీగా ఉండే ఒక ప్రముఖ వస్త్ర వ్యాపారి ఐదు నెలల క్రితం 40 లారీల వస్త్రాన్ని ప్రభుత్వానికి సరఫరా చేశాడు. అంతకుముందే బతుకమ్మ చీరల బట్టను సరఫరా చేశాడు. ఆ వ్యాపారికి ప్రభుత్వం ద్వారా రూ.60 కోట్లు రావలసి ఉంది. నాలుగు నెలలుగా బకాయిలు రాకపోవడంతో సదరు వ్యాపారి పాలిస్టర్ నూలు తెప్పించడం, బీములు పోయించడం ఆపేశాడు. ఫలితంగా అతనిపై ఆధారపడిన ఆసాములు, కార్మికులకు పని కరువైంది. ప్రభుత్వం నుంచి రూ.60 కోట్ల బకాయిలు వస్తే మళ్లీ నూలు(దారం)పై పెట్టుబడి పెట్టి కోములు దిగుమతి చేసేవాడు. బీములు పోయించి ఆసాములకు అందించేవాడు..'

అసలేం జరిగింది..

2017 నుంచి ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతో రూ.350 కోట్ల మేరకు 6.50 కోట్ల మీటర్ల బట్టను సిరిసిల్ల నేతన్నలు ఉత్పత్తి చేసేవారు. కార్మికులు, ఆసాములకు మెరుగైన ఉపాధి లభించేది. ఏడాదిలో ఆరు నెలల పాటు బతుకమ్మ చీరలు, మరో ఆరు నెలలపాటు పాలిస్టర్ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నడిచేది. ప్రభుత్వం మారిపోవడంతో బతుకమ్మ చీరల ఆర్డర్లపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఆ ఆర్డర్లు వచ్చే అవకాశం లేదు. మరోవైపు ఇప్పటికే సరఫరా చేసిన బట్టకు సంబంధించి రూ.260 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గతంలో సగం సాంచాలపై పాలిస్టర్, సగం సాంచాలపై బతుకమ్మ చీరలు నడిచేవి. కానీ జిల్లా అధికారులు మొత్తం సాంచాలపై బతుకమ్మ చీరలను నడిపించాలని హుకుం జారీ చేసి పాలిస్టర్ వస్త్ర వ్యాపారాన్ని, మార్కెట్‌ను దెబ్బ తీశారు. దీంతో ప్రైవేటు పాలిస్టర్ వ్యాపారం మొత్తం పరాధీనమైంది. సిరిసిల్ల వ్యాపారులకు మార్కెట్ లేకుండా పోయింది. అటు ప్రభుత్వ ఆర్డర్లు లేక.. ఇటు ప్రైవేటు ఆర్డర్లు రాక.. మొత్తం సిరిసిల్ల పరిశ్రమ బజారున పడింది. సిరిసిల్లలో 26 వేల సాంచాలుండగా.. సగం సాంచాలు వస్త్రోత్పత్తిని లేక మూతపడ్డాయి.

మహాధర్నాకు సర్వం సిద్ధం

సిరిసిల్ల నేతన్నలకు ఏటా పని కల్పించాలనే డిమాండ్‌తో 'నేతన్నల ఆకలి కేక.. మహాధర్నా'ను బుధవారం నిర్వహించనున్నారు. సీఐటీయూ పవర్‌లూమ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా 'నేతన్నల ఆకలి కేక- మహాధర్నా' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

టెస్కో ద్వారా ఆర్డర్లు వస్తాయి



ఇప్పటికే రాజీవ్ విద్యా మిషన్ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చాం. అవి నడుస్తున్నాయి. ఇంకా అన్ని ప్రభుత్వ శాఖల వస్త్రోత్పత్తి ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది. సింగరేణి, పోలీస్, మున్సిపల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖల వస్త్రాల ఆర్డర్లను టెస్కో ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జీవో రావలసి ఉంది.

- ఎం.సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లాలోని జంగల పోలీస్ స్టేషన్ పరిధిలో గల చోటాడోంగేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరపగా.. పోలీసులు కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఈ సంఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా పలువురు తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. సంఘటనా ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించిన మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం ఆ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

ఆడుకుంటూ కుప్పకూలిన ఎనిమిదేళ్ల బాలుడు

కార్డియాక్ అటాక్ అంటున్న వైద్యులు


బాలుడు రితిక్

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ ఎనిమిదేళ్ల బాలుడు రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి ఆడుకుంటూ ఉన్నట్టుండి కుప్పకూలి చనిపోయాడు. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్లులో సోమవారం రాత్రి జరిగింది. చాగల్లుకు చెందిన బూర్ల అశోక్‌-రమ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు రితిక్(8) ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు.సోమవారం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆ బాలుడు సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి బాలుడిని ఘన్‌పూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి హనుమకొండకు తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, బాలుడి మృతికి కార్డియాక్ అటాక్ కారణమై ఉండవచ్చని వైద్యులు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న మందుల సీజ్



సాక్షి, హైదరాబాద్: అధిక ధరలకు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న మందుల దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీలత ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో జరిపిన సోదాల్లో ఓ మెడికల్ దుకాణంలో డొనేమ్ ఇంజెక్షన్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఒక్కో ఇంజెక్షన్ జీఎస్టీతో కలిపి రూ.1,067కు విక్రయించాల్సి ఉండగా రూ.1,899కు విక్రయిస్తున్నట్టు అధికారుల సోదాల్లో వెల్లడైంది. అధిక ధరకు విక్రయిస్తున్న మొత్తం రూ.36,081 విలువైన మందులను సీజ్ చేసినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు 'బీమా' వర్తింప చేయాలి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికులకు ప్రకటించిన కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు, ఇంజనీర్లకు వర్తింప చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్ (టీవీఈఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెహ్రూ, భాస్కర్ కోరారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహజ్యోతి)తో ఎన్నో ఇళ్లలో వెలుగులు నింపుతున్నారని, అలాగే విద్యుత్ ఉద్యోగులకు కూడా బీమా కల్పించి ఆదుకోవాలని మంగళవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు.

11,062 పోస్టులతో రేపు డీఎస్సీ నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు అంచనా వేస్తున్నారు.

అప్రమత్తంగా అధికారులు: డీఎస్సీపై నిరుద్యోగులు భారీ ఆశలు పెట్టుకున్నారు. దాదాపు 4 లక్షల మంది ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. వాళ్లంతా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. ప్రశ్నపత్రాలు మొదలుకొని ఫలితాల వరకూ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై మరింతగా దృష్టి పెట్టారు. పాస్‌వర్డ్స్, ఆన్‌లైన్ వ్యవస్థ భద్రతాంశాలను ఉన్నతాధికారులు సమీక్షించారు. సాంకేతిక విభాగంలో ప్రైవేటు సంస్థల పాత్ర ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. కీలకపాత్ర పోషించే అధికారులు ప్రతి అంశాన్నీ పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి.

రోడ్డుపై నిలబడితే దూసుకొచ్చిన మృత్యువు

- ట్యాంకర్ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి... ఒకరికి తీవ్ర గాయాలు
- నాందేడ్‌-అకోలా హైవే.. మాసానిపల్లి సర్వీస్‌రోడ్డుపై ఘటన
- ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్ భయంతో వేగంగా వెళ్తూ..
- కాగితంపల్లి వద్ద బోల్తా.. డ్రైవర్ దుర్మరణం


ఎండీ వాజీద్ | ముక్రమ్ | ఎండీ హాజీ

వట్‌పల్లి(అందోల్), అల్లాదుర్గం(మెదక్): నిలబడి ఉన్న యువకులను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందిన దుర్ఘటన సంగారెడ్డి జిల్లా ఆందోలు మండలం మాసానిపల్లి గ్రామ శివారు నాందేడ్‌-అకోలా హైవే సర్వీస్‌రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్ భయంతో వేగంగా వెళ్తుండగా, మెదక్ జిల్లా కాయిదంపల్లి శివారులో హైవేపై ట్యాంకర్ బోల్తాపడటంతో అతనూ దుర్మరణం పాలయ్యాడు. జోగిపేటకు చెందిన ఎండీ వాజీద్ (29), ముక్రమ్ (26), ఎండీ హాజీ (26), రిజ్వాన్, అర్షద్, శంషు కారులో డాకూరు వైపు వెళ్తున్నారు. మాసానిపల్లి అండర్ పాస్ దగ్గరలో రోడ్డు పక్కన కారు ఆపి వాజీద్, ముక్రమ్, రిజ్వాన్ మూత్ర విసర్జనకు వెళ్లి కారు వద్దకు వస్తుండగా సంగుపేట వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా కారు పక్కన నిలుచున్న వాజీద్, ముక్రమ్ పై నుంచి వెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందగా, రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. కారును సైతం ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో పల్టీకొట్టింది. అందులో ఉన్న హాజీ మరణించగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ట్యాంకర్ డ్రైవర్ ఆపకుండా డాకూరు రూట్‌లోనే వేగంగా వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాలను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన రిజ్వాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఢీకొట్టిన ట్యాంకర్ డ్రైవర్ మృతి

ఆందోల్ మండలం మాసాన్‌పల్లి వద్ద రోడ్డుపై ముగ్గురు యువకులను ఢీకొట్టిన ట్యాంకర్ డ్రైవర్ కియారామ్ (25) ప్రాణభయంతో అతివేగంగా వాహనం నడుపుకుంటూ వచ్చాడు. కాయిదంపల్లి శివారులోకి రాగానే ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడటంతో కియారామ్‌కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జోగిపేట మార్చురీకి అల్లాదుర్గం పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్ పార్టీలో డైరెక్టర్ క్రిష్

▶ మొదటి పేజీ తరువాయి

డ్రగ్ పార్టీలు చేసుకున్నట్లు చెప్పాడని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ డీసీపీ తెలిపారు.

రెండురోజుల్లో క్రిష్‌ను విచారిస్తాం

క్రిష్ రెండురోజుల్లో విచారణకు వస్తారని, ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డీసీపీ చెప్పారు. వివేకానంద్‌ను కలిసేందుకు మాత్రమే వచ్చినట్లు క్రిష్ చెబుతున్నాడని, వైద్య పరీక్షలు చేస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. కేదార్, నిర్భయ్ అనే కామన్ ఫ్రెండ్స్ ద్వారా సినిమా వాళ్లు వివేకానంద్‌కు పరిచయం అయ్యి ఉండవచ్చని తెలిపారు. డ్రగ్‌కు బానిస కావడంతోనే తరచుగా పార్టీలు నిర్వహించి ఉండవచ్చని అన్నారు. డ్రగ్ హైదరాబాద్‌లోనే కొనుగోలు చేసినట్లు అబ్బాస్ చెబుతున్నాడని, అయితే ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారణలో తేలుతుందని చెప్పారు. కొకైన్ సరఫరా చేసిన ప్రతిసారీ రెండు నుంచి నాలుగు గ్రాములు వివేకానంద్‌కు అందించాడన్నారు. వివేకానంద్ ఎంత మొత్తంలో డబ్బులు చెల్లించాడో త్వరలో చెబుతామని చెప్పారు.

పరారీలో శ్వేత, సందీప్

కేసులో అనుమానితులుగా ఉన్న శ్వేత, సందీప్‌లు పరారీలో ఉండగా బెంగళూరులో ఉన్న చరణ్ అక్కడే విచారణకు వస్తున్నట్లు తెలిపారు. డ్రగ్ పార్టీ నిర్వహించిన వారితో పాటు హోటల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు. హోటల్‌లో కొన్ని సీసీ కెమెరాలు పని చేయడం లేదని, శనివారం రాత్రి 12.30 గంటలకు వెళ్లే సరికే అందరూ పార్టీ నుంచి వెళ్లిపోయారని వివరించారు. డ్రగ్ పార్టీలకు రెగ్యులర్‌గా ఎవరు వస్తున్నారు, డ్రగ్ సప్లయ్ చైన్ తదితర అంశాలపై విచారణ చేపడతామన్నారు. ఇప్పటికి పార్టీలో 10 మంది ఉన్నట్లు గుర్తించగా ముగ్గురికి డ్రగ్ పాజిటివ్‌గా వచ్చిందని, మిగిలిన వారిని కూడా విచారించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. శ్వేత బెంగళూరు డ్రగ్ కేసులో కూడా నిందితురాలిగా ఉందంటూ మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, ఆ వివరాలు సేకరిస్తామని, గతంలో రాడిసన్ హోటల్ మేనేజర్ డ్రగ్‌తో పట్టుబడిన కేసు వివరాలు కూడా సేకరిస్తామని అన్నారు. సయ్యద్ అరెస్టుతో రాడిసన్ డ్రగ్ పార్టీ కేసులో ఇప్పటివరకు నలుగురిని అరెస్టు చేసినట్లయ్యింది.

'ధరణి' అధికారాల బదలాయింపు!

ఇప్పటివరకు కలెక్టర్లకే పూర్తి అధికారాలు

- కమిటీ సూచన మేరకు అధికారాల మార్పుపై రెవెన్యూశాఖ కసరత్తు
- ఆధార్ తప్పుల నుంచి డిజిటల్ సంతకాల వరకు క్లియరెన్స్ తహసీల్దార్లకే
- నోషనల్ ఖాతాలు, భూమి వర్గీకరణ, పేరు మార్పు తదితర వ్యవహారాలు కలెక్టర్ల వద్దనే
- నోషనల్ ఖాతాల నుంచి పట్టా మార్పు అంశం సీసీఎల్‌ఏ పరిధిలోనికి
- కొన్ని దరఖాస్తులు పరిష్కరించే బాధ్యతలు అదనపు కలెక్టర్లకు కూడా

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు కలెక్టర్లకు మాత్రమే 'ధరణి'దరఖాస్తుల పరిష్కార అధికారాలుండగా, వికేంద్రీకరణ ద్వారా తహసీల్దార్లు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ)కు కొన్ని అధికారాలు కట్టబెట్టనున్నారు. ధరణి పోర్టల్ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు రైతు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారాల బదలాయింపు కసరత్తు చురుగ్గా సాగుతోంది. ఏ అధికారికి ఏ దరఖాస్తు పరిష్కరించే అధికారం ఇవ్వాలన్న దానిపై రెవెన్యూశాఖ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

- ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం 35 మాడ్యూళ్లు అందుబాటులో ఉన్నాయి.
- తాజా లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కేవలం రెండు మాడ్యూళ్లలో మాత్రమే 1.5 లక్షల దరఖాస్తులున్నాయని ధరణి కమిటీ గుర్తించింది.
- టీఎం 14 (గ్రీవెన్సెస్ ఆన్ స్పెసిఫిక్ ల్యాండ్ మ్యాటర్స్) మాడ్యూల్‌లో 40,435 దరఖాస్తులు, టీఎం 33 (మాడిఫికేషన్ రిక్వెస్ట్ అప్లికేషన్) మాడ్యూల్‌లో 1.05 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- మిగిలిన 33 మాడ్యూళ్లలో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారాల బదలాయింపునకు కసరత్తు జరుగుతుండగా, ముఖ్యమైన టీఎం 14, 33 మాడ్యూళ్లలో ఏ దరఖాస్తులు ఎవరు పరిష్కరించాలన్న దానిపై ధరణి కమిటీతో పా టు రెవెన్యూశాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది.

అవసరమైతేనే సీసీఎల్‌ఏకు

- ధరణి మాడ్యూళ్ల (టీఎం14, టీఎం33)లోని దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్‌తో పాటు సీసీఎల్‌ఏలకు అధికారాలు కల్పిస్తూ వికేంద్రీకరణ కసరత్తు జరుగుతోంది.
- టీఎం14లో ఆధార్ తప్పులు, ఆధార్ అందుబాటులో లేకపోవడం, తండ్రి, భర్త పేరులో తప్పులు, ఫొటో మిస్ కావడం, జెండర్, కులం తప్పుగా నమోదు కావడం, సర్వే నంబర్ మిస్సింగ్, తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు లేకపోవడంలాంటి సమస్యలున్నాయి. వీటిలో సర్వేనంబరు మిస్సింగ్ మినహా ఇతర సమస్యల పరిష్కార అధికారాలు తహసీల్దార్లకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.
- సర్వేనంబరు మిస్సింగ్ దరఖాస్తుల పరిష్కారం ఆర్డీఓలకు అప్పగించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇక, టీఎం 33లో భాగమైన పాసుపుస్తకాల్లోని తప్పుల సవరణ, నోషనల్ ఖాతా (ప్ర భుత్వ భూమి ఉండే ఖాతా) నుంచి పట్టాభూమిగా మార్పు, పాసు పుస్తకంలోని పేరుమా ర్పు, మిస్సింగ్ సర్వేనంబరు, భూమి వర్గీకరణ, భూమి స్వభావం, భూమి రకం, భూమి అనుభవదారుని పేరు లాంటి సమస్యలను పరిష్కరించే అధికారాన్ని తహసీల్దార్లు, ఆర్డీఓల సిఫారసులతో కలెక్టర్లకు అప్పగించనున్నారు.
- నోషనల్ ఖాతా మార్పు అధికారం మాత్రం అవసరమైతే సీసీఎల్‌ఏ అనుమతి తీసుకునేలా మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది. మిగిలిన మాడ్యూళ్లలో కొన్నింటిని అదనపు కలెక్టర్లు (రెవెన్యూ)కు అప్పగించనున్నారు. ఈ మేరకు ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల సమస్యలను పరిష్కరించే అధికారాలను వికేంద్రీకరించే ప్రక్రియ త్వరలోనే ఓ కొలిక్కి వస్తుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి.

పాలేరు కాల్వ గేట్లు ఎత్తిన రైతులు

రిజర్వాయర్ వద్ద ఉద్రిక్తత ● పోలీసులు, రైతుల మధ్య తోపులాట


గేట్లు ఎత్తడంతో కాల్వలో పారుతున్న నీరు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. పాలేరు పాత కాల్వకు నీరు వదిలి తమ పంటలను కాపాడాలంటూ కూసుమంచి, నేలకొండపల్లి మండలాల రైతులు తెలంగాణ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యాన రిజర్వాయర్ వద్ద ఖమ్మం-సూర్యాపేట రహదారిపై ఆందోళన చేపట్టారు. అనంతరం రైతులే కాల్వ గేట్లు ఎత్తి నీటిని వదలడంతో అర్ధగంట పాటు 30 క్యూసెక్కుల నీరు పారింది. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు రైతులను నెట్టివేసే క్రమంలో తోపులాట జరిగింది. చివరకు పోలీసులు, నీటిపారుదలశాఖ సిబ్బంది గేట్లను దించి గేట్ల వద్ద కంప వేయగా దాన్ని కూడా రైతులు తొలగించే ప్రయత్నం చేశారు. చివరకు జలవనరులశాఖ ఎస్ఈ ఆనంద్‌కుమార్, ఈఈ వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులు చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. పాలేరు కాల్వ కింద వేలాది ఎకరాల్లో పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని నాయకులు తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో నాయకులు, రైతులు ఆందోళన విరమించారు.

సమ్మక్క పూజారి కన్నుమూత


సిద్దబోయిన దశరథం

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం (37) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. దశరథం మంగళవారం ఉదయం నిద్ర నుంచి లేవకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు మేడారంలోని వైద్య శిబిరానికి తరలించారు. వైద్యులు పరీక్షించి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. దశరథం సోదరుడు, సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు కూడా ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. సోదరులిద్దరూ స్వల్పకాల వ్యవధిలో మృతిచెందడంతో మేడారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగిన సమ్మక్క- సారలమ్మ మహాజాతర పూజా కార్యక్రమాల్లో దశరథం పాల్గొని అమ్మలకు సేవలందించారు. దశరథం మృతిపై మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క, సారలమ్మ పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు పరామర్శించారు.



భారత 'సూపర్ ఫోర్'!

మన గగన్‌యాన్ వ్యోమగాములు వీళ్లే ● జాతికి పరిచయం చేసిన మోదీ

- దేశ ఆకాంక్షలకు ప్రతిరూపమంటూ ప్రశంస
- ప్రతిష్టాత్మక ఆస్ట్రోనాట్ వింగ్స్ ప్రదానం
- వచ్చే ఏడాది ఆరంభంలో అంతరిక్షంలోకి!

తిరువనంతపురం: భారత అంతరిక్ష చరిత్రలో మరో సువర్ణాధ్యాయానికి తెర లేచింది. మన అంతరిక్ష సంస్థ ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. మిషన్‌లో పాల్గొని రోదసిలోకి వెళ్లనున్న నలుగురు భారత వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం జాతికి పరిచయం చేశారు. ఇందుకోసం ఎంపికైన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ సుభాన్షు శుక్లా పేర్లను ఆయన స్వయంగా ప్రకటించారు. వీరు నలుగురూ భారత వాయుసేనకు చెందిన ఫైటర్ పైలట్లే. కేరళలోని తుంబలో ఉన్న విక్రమ్ సారాబాయ్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారికి ప్రతిష్టాత్మకమైన 'ఆస్ట్రోనాట్ వింగ్స్'ను మోదీ ప్రదానం చేశారు. అనంతరం భావోద్వేగ పూరితంగా ప్రసంగించారు. దేశ అమృత తరానికి వారు అత్యుత్తమ ప్రతినిధులంటూ ప్రశంసించారు. ''ఈ నలుగురు వ్యోమగాముల పేర్లు భారత విజయగాథలో శాశ్వతంగా నిలిచిపోతాయి. నాలుగు దశాబ్దాలుగా దేశం కంటున్న కలను వారు నిజం చేయనున్నారు'' అంటూ కొనియాడారు. ''వీళ్లు కేవలం నలుగురు వ్యక్తులో, నాలుగు పేర్లో కాదు. 140 కోట్ల మంది భారతీయుల కలలకు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవనున్న నాలుగు ప్రబల శక్తులు!'' అన్నారు. గగన్‌యాన్ మిషన్ పూర్తిగా దేశీయంగా రూపుదిద్దుకుని మేకిన్ ఇండియాకు తార్కాణంగా నిలిచిందంటూ హర్షం వెలిబుచ్చారు. ఏ విధంగా చూసినా ఇది చరిత్రాత్మక మిషన్ అని చెప్పారు. ''గతంలో భారతీయ వ్యోమగామి వేరే దేశం నుంచి విదేశీ రాకెట్‌లో రోదసీలోకి వెళ్లొచ్చారు. మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత భారత్ అంతరిక్షంలో అడుగు పెట్టబోతోంది. ఈసారి టైమింగ్, కౌంట్‌డౌన్, రాకెట్‌తో సహా అన్నీ మనం స్వయంగా రూపొందించుకున్నవే. గగన్‌యాన్ మిషన్‌లో వినియోగిస్తున్న ఉపకరణాల్లో అత్యధికం భారత్‌లో తయారైనవే. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న స్వావలంబనకు తార్కాణమిది'' అన్నారు. ఈ అమృత కాలంలో భారత వ్యోమగామి దేశీయ రాకెట్‌లో చంద్రునిపై దిగడం ఖాయమని జోస్యం చెప్పారు.

అంతరిక్ష శక్తిగా భారత్

భారత అంతరిక్ష రంగం సాధిస్తున్న ప్రగతి యువతలో శాస్త్రీయ జిజ్ఞాసను ఎంతగానో పెంపొందిస్తోందని, 21వ శతాబ్దిలో మనం ప్రపంచశక్తిగా ఎదిగేందుకు బాటలు పరుస్తోందని మోదీ హర్షం వెలిబుచ్చారు. ఇస్రో సాధించిన పలు ఘన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''తొలి ప్రయత్నంలోనే అరుణ గ్రహం చేరి అతి కొద్ది దేశాలకే పరిమితమైన అరుదైన ఘనత సాధించాం. ఒకే మిషన్‌లో 100కు పైగా ఉపగ్రహాలనూ రోదసిలోకి పంపాం. చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా రికార్డు సృష్టించాం. ఆదిత్య ఎల్1ను భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టాం. ఇలాంటి విజయాలతో భావి అవకాశాలకు ఇస్రో సైంటిస్టుల బృందం నూతన ద్వారాలు తెరుస్తోంది. ఫలితంగా అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ వాణిజ్య హబ్‌గా మారనుంది. మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రానున్న పదేళ్లలో ఐదింతలు పెరిగి 44 బిలియన్ డాలర్లకు చేరనుంది'' అని చెప్పారు. ఇస్రో అంతరిక్ష మిషన్లలో మహిళా సైంటిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. చంద్రయాన్ మొదలు గగన్‌యాన్ దాకా ఏ ప్రాజెక్టునూ మహిళా శక్తి లేకుండా ఊహించుకోలేని పరిస్థితి ఉందన్నారు. 500 మందికి పైగా మహిళలు ఇస్రోలో నాయకత్వ స్థానాల్లో ఉన్నారంటూ హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్, సీఎం పినరాయి విజయన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

వారిది మొక్కవోని దీక్ష

గగన్‌యాన్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో నలుగురు వ్యోమగాములూ అత్యంత కఠోరమైన శ్రమకోర్చారంటూ మోదీ ప్రశంసించారు. ''అత్యంత కఠినమైన శారీరక, మానసిక పరిశ్రమతో పాటు యోగాభ్యాసం కూడా చేశారు. ఆ క్రమంలో ఎదురైన ఎన్నో సవాళ్లను మొక్కవోని పట్టుదలతో అధిగమించారు. రోదసి మిషన్ కోసం తమను తాము పరిపూర్ణంగా సన్నద్ధం చేసుకున్నారు'' అన్నారు. వారు దేశంలోని పలు ప్రాంతాలతో పాటు 13 నెలలు రష్యాలోనూ శిక్షణ పొందారు. మానవసహిత గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా 2025లో ముగ్గురు వ్యోమగాములను రోదసిలోని 400 కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలోకి పంపి 3 రోజుల తర్వాత సురక్షితంగా వెనక్కు తీసుకురావాలన్నది ఇస్రో లక్ష్యం. ఇది విజయవంతమైతే అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. గగన్‌యాన్ మిషన్‌కు రూ.10 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా.


విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్‌లో ప్రధాని మోదీ


స్పేస్ సెంటర్‌లో వ్యోమమిత్రతో మాట్లాడుతున్న ప్రధాని

హాయ్ వ్యోమమిత్రా

గగన్‌యాన్ మిషన్ ప్రగతిని విక్రం సారాబాయి స్పేస్ సెంటర్లో మోదీ సమీక్షించారు. మిషన్‌కు సంబంధించిన పలు అంశాలను సోమనాథ్‌తో పాటు ఇస్రో సైంటిస్టులను అడిగి తెలుసుకున్నారు. మానవసహిత యాత్రకు ముందు గగన్‌యాన్‌లో భాగంగా రోదసిలోకి వెళ్లనున్న హ్యూమనాయిడ్ రోబో వ్యోమమిత్రతో సరదాగా సంభాషించారు.

మహిళ ఎందుకు లేదంటే...

గగనయాన్ మిషన్‌కు ఎంపికైన నలుగురిలో ఒక్క మహిళ కూడా లేకపోవడం ఆసక్తికరంగా మారింది. అంతరిక్ష యాత్రకు వ్యోమగాముల ఎంపిక ప్రక్రియే అందుకు కారణమని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి మిషన్లకు టెస్ట్ పైలట్ల పూల్ నుంచి మాత్రమే వ్యోమగాముల ఎంపిక జరుగుతుంది. అత్యున్నత వైమానిక నైపుణ్యంతో పాటు అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ నిబ్బరంగా వ్యవహరించగల సామర్థ్యం టెస్ట్ పైలట్ల సొంతం. గగన్‌యాన్ మిషన్‌కు ఎంపిక జరిపిన సమయంలో భారత టెస్ట్ పైలట్ల పూల్‌లో ఒక్క మహిళ కూడా లేరు. దాంతో గగన్‌యాన్ మిషన్‌లో మహిళా ప్రాతినిధ్యం లేకుండాపోయింది. భావి మిషన్లలో మహిళా వ్యోమగాములకు స్థానం దక్కుతుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు.

3 ప్రాజెక్టులు జాతికి అంకితం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సమీప భవిష్యత్తులో చేపట్టనున్న భారీ రాకెట్ ప్రయోగాల నిమిత్తం సుమారు రూ.1,800 కోట్లతో నిర్మించిన మూడు ఇస్రో సెంటర్లను మోదీ తుంబా నుంచి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ భవనం, ఇస్రో ప్రపొల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటీ భవనం, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ట్రైనోసిక్ విండ్ టన్నెల్ భవనాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిద్వారా ఏటా 8 నుంచి 15 పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలతో పాటు మొదటి ప్రయోగ వేదికపై ఒకేసారి రెండు రాకెట్లను అనుసంధానం చేసుకునే వెసులుబాటు కలుగుతుంది

గఘనయానులు...

భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో పాల్గొనబోతున్న వ్యోమగాములంతా నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థులే. ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, శుభాన్షు శుక్లా వృత్తిరీత్యా యుద్ధపైలెట్లు. వీరంతా గగన్‌యాన్ కోసం ఇప్పటికే రష్యాలో వ్యోమగాములుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. భారత్‌లోనూ ఇస్రో వీరికి కొంతకాలంగా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. తమ నలుగురు యుద్ధవిమాన పైలెట్లు గగన్‌యాన్‌లో భాగస్వాములు కావడం తమకెంతో గర్వకారణమని భారత వాయుసేన పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ 'సూపర్ ఫోర్' గురించి...

ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్

భారత వాయుసేనలో యుద్ధవిమానాన్ని సుదీర్ఘకాలంపాటు నడిపిన అనుభవం ఉన్న పైలెట్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ ఈ నలుగురిలో ఒక్కడిగా ఎంపికయ్యారు. కేరళలోని తిరువజియాడ్‌లో 1976 ఆగస్ట్ 26న జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో శిక్షణ పూర్తిచేసుకుని అక్కడే 'స్వోర్డ్ ఆఫ్ హానర్'ను సాధించారు. తమిళనాడులోని వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో, తాంబరం ఎఫ్ఐఎస్‌లో చదువుకున్నారు. తర్వాత ఈయన 1998 డిసెంబర్19న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో యుద్ధవిమాన పైలెట్‌గా విధుల్లో చేరారు. సుఖోయ్30ఎంకేఐ, మిగ్–21, మిగ్–29 ఇలా పలు రకాల యుద్ధవిమానాలు నడపడంలో ఈయన దిట్ట. మొత్తంగా 3,000 గంటలకుపైగా యుద్ధవిమానాలను నడిపారు. కీలకమైన సుఖోయ్–30 స్క్వాడ్రాన్‌కు కమాండింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. 'ఎ' కేటగిరీ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టెస్ట్ పైలెట్‌గా అనుభవం గడించారు. గగన్‌యాన్‌లో ఈయన గ్రూప్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. నాయర్ భార్య లీనా మలయాళ సినీపరిశ్రమలో నటిగా పేరొందారు. వీళ్లది పెద్దలు కుదిర్చిన పెళ్లి. గత నెల 17వ తేదీన వీరి వివాహం జరిగింది. ' మా ఆయనకు తొలి ఇండియన్ ఆస్ట్రోనాట్ వింగ్స్ దక్కడం కేరళ రాష్ట్రానికే గర్వకారణం' అని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. వీళ్ల కుటుంబం కేరళలోని పాలక్కడ్ జిల్లా నెన్మరలో నివసిస్తోంది. నాయర్‌ను ఆస్ట్రోనాట్‌గా ప్రధాని ప్రకటించగానే నెన్మరలో పండగ వాతావరణం నెలకొంది.

అజిత్ కృష్ణన్

అజిత్ కృష్ణన్ 1982లో చెన్నైలో జన్మించారు. ఈయన సైతం ఎన్‌డీఏలో శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకుని స్వోర్డ్ ఆఫ్ ఆనర్ పొందారు. రాష్ట్రపతి బంగారు పతకాన్ని సాధించారు. ఈయన తమిళనాడులోని వెల్లింగ్టన్‌లోని డీఎస్ఎస్‌సీలోనూ చదువుకున్నారు. 2003 జూన్‌లో భారత వాయుసేనలో పైలెట్‌గా చేరారు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టెస్ట్ పైలెట్‌గా ఉంటూ 2,900 గంటలపాటు యుద్ధ విమానాలను నడిపారు. సుఖోయ్, మిగ్, జాగ్వర్, డోర్నియర్, ఏఎన్–32 రకం విమానాలను నడిపారు. ఈ మిషన్‌లో అవసరం మేరకు గ్రూప్ కెప్టెన్‌గా ఉంటారు.

అంగద్ ప్రతాప్

అంగద్ ప్రతాప్ 1982లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జన్మించారు. ఈయన సైతం ఎన్‌డీఏ పూర్వ విద్యార్థే. 2004 డిసెంబర్‌లో భారత వాయుసేన దళాల్లో చేరారు. టెస్ట్ పైలెట్‌గా, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందించారు. దాదాపు 2,000 గంటలపాటు విమానాలు నడిపిన అనుభవం ఉంది. సుఖోయ్ 30 ఎంకేఐ, మిగ్–21, మిగ్–29, హాక్, డోర్నియర్, ఏఎన్–32సహా ఎన్నో రకాల విమానాలను సమర్థవంతంగా నడిపారు. గగన్‌యాన్ మిషన్‌లో ఈయన గ్రూప్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు.

శుభాన్షు శుక్లా

వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1985లో జన్మించారు. ఎన్‌డీఏలో శిక్షణ పూర్తిచేసుకుని 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలెట్‌గా చేరారు. ఫైటర్ కంబాట్ లీడర్‌గా, టెస్ట్ పైలెట్‌గా 2,000 గంటలపాటు యుద్ధవిమనాలు నడిపారు. భారత వాయుసేనలోని దాదాపు అన్నిరకాల యుద్ధవిమానాలు నడపడంలో ఈయన నైపుణ్యం సాధించారు. ఈ నలుగురికి రష్యాలోని యూరీ గగారిన్ కాస్మోనాట్ శిక్షణ సంస్థలో సమగ్రమైన శిక్షణ ఇచ్చారు. గగన్‌యాన్‌లో ఈయన వింగ్ కమాండర్‌గా వ్యవహరిస్తారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్‌కు మళ్లీ నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి సమన్లు పంపింది. మార్చి 4వ తేదీన విచారణకు రావాలంటూ మంగళవారం జారీ చేసిన ఎనిమిదో విడత నోటీసుల్లో పేర్కొంది. ఆరోసారి నోటీసులు జారీ చేసిన సమయంలో కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో సహకరించడం లేదంటూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ ఫిర్యాదు చేసింది. దీంతో కోర్టు సమన్లు అందుకున్న కేజ్రీవాల్ ఈనెల 17న వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది.

జమాతె ఇస్లామీపై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: జమాతె ఇస్లామీ జమ్మూ కశ్మీర్ (జేఈఎల్)పై నిషేధాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. వేర్పాటువాద చర్యలకు, హింసను ప్రేరేపించేందుకు అవసరమైన నిధులు సేకరించడంతో పాటు ఈ సంస్థపై మొత్తం 47 కేసులున్నాయి. దీనిపై 2019 ఫిబ్రవరిలో తొలిసారి కేంద్రం నిషేధం విధించింది.

జయప్రదను అరెస్ట్ చేయండి

రామ్‌పూర్(యూపీ): గత లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగినపుడు ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన కేసులో మాజీ ఎంపీ, నటి జయప్రదను అరెస్ట్‌చేయాలని అక్కడి రామ్‌పూర్ కోర్టు పోలీసులను ఆదేశించింది. అరెస్ట్ చేసి మార్చి నెల ఆరోతేదీన తమ ఎదుట ప్రవేశపెట్టాలని సూచించింది. 2019లో ఎన్నికల ప్రవర్తనానిబంధనావళి ఉల్లంఘనపై కేమారి, స్వార్ పోలీస్‌స్టేషన్లలో జయప్రదపై రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విషయమై తమ ముందు హాజరుకావాలని ప్రత్యేక ఎంపీ–ఎమ్మెల్యే కోర్టు జయప్రదకు సూచించింది. అయినా ఆమె రాకపోవడంతో ఇప్పటి వరకు ఏడుసార్లు నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీఅయ్యాయి. ఇంత జరిగినా ఆమె కోర్టుకు రాకపోవడంతో జయను 'పరారీలో ఉన్న వ్యక్తి'గా జడ్జి ప్రకటించారు.

జోరుగా క్రాస్ ఓటింగ్

రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ జాక్‌పాట్ ● పోలింగ్ జరిగిన 15 సీట్లలో 10 కైవసం

- కాంగ్రెస్‌కు హిమాచల్‌లో అనూహ్య షాక్
- ఆరుగురి క్రాస్ ఓటింగ్, సింఘ్వి ఓటమి
- యూపీలో బీజేపీకి 8 సీట్లు, ఎస్పీకి రెండే
- ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్!

బెంగళూరు/లఖ్‌నవూ/సిమ్లా/న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల్లో జోరుగా క్రాస్ ఓటింగు సాగింది. దాంతో సంఖ్యాబలం ప్రకారం 8 స్థానాలు నెగ్గాల్సిన బీజేపీ మరో రెండు చోట్ల అనూహ్య విజయం సాధించింది! యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి, హిమాచల్‌ప్రదేశ్‌లో పాలక కాంగ్రెస్‌కు గట్టి షాకిచ్చింది. ఏప్రిల్లో ఖాళీ అవుతున్న 56 రాజ్యసభ స్థానాలకు గాను 41 చోట్ల ఎన్నిక ఇప్పటికే ఏకగ్రీవం కావడం తెలిసిందే. యూపీలో 10, కర్నాటకలో 4, హిమాచల్‌లో ఒకటి చొప్పున మిగతా 15 స్థానాలకు మంగళవారం ఓటింగ్ జరిగింది. అసెంబ్లీల్లో సంఖ్యాబలం మేరకు యూపీలో బీజేపీ 7, ఎస్పీ 3; కర్నాటకలో కాంగ్రెస్ 3, బీజేపీ 1; హిమాచల్‌లో ఏకైక స్థానంలో కాంగ్రెస్ గెలవాల్సి ఉంది. కానీ బీజేపీ హిమాచల్‌లో పోటీకి దిగడమే గాక యూపీలో 8వ అభ్యర్థిని రంగంలోకి దించింది. కర్నాటకలో కూడా ముగ్గురు కాంగ్రెస్, ఒక బీజేపీ అభ్యర్థితో పాటు దాని మిత్రపక్షం జేడీ(ఎస్) నుంచి ఐదో అభ్యర్థీ పోటీకి దిగారు. యూపీలో ఏడుగురు ఎస్పీ, ఒక బీఎస్పీ ఎమ్మెల్యేలు; హిమాచల్‌లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా ఓటేశారు. దాంతో హిమాచల్‌లోని ఏకైక సీటుతో పాటు యూపీలో 8వ రాజ్యసభ స్థానమూ బీజేపీ కైవసమయ్యాయి. కర్నాటకలో మాత్రం బీజేపీ ఎత్తులు పారలేదు. సంఖ్యాబలానికి అనుగుణంగా కాంగ్రెస్ 3, బీజేపీ ఒక స్థానంలో నెగ్గాయి. అయితే ఒక బీజేపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేయడమే గాక మరొకరు ఓటింగ్‌కు దూరంగా ఉండి పార్టీకి షాకిచ్చారు! మూడు పార్టీలూ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలకు తమ సిద్ధమవుతున్నాయి!

హిమాచల్‌లో టాస్

హిమాచల్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలకు గాను పాలక కాంగ్రెస్‌కు 40 మంది ఎమ్మెల్యేలుండగా బీజేపీకి 25 మందే ఉన్నారు. అయితే ముగ్గురు స్వతంత్రులతో పాటు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు ఓటేశారు. దాంతో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి అనూహ్య ఓటమి చవిచూశారు. అభ్యర్థులిద్దరికీ సమానంగా చెరో 34 ఓట్లు రావడంతో టాస్ ద్వారా హర్ష్‌ను విజేతను తేల్చారు. ఇక యూపీలో హైడ్రామా చోటుచేసుకుంది. ఓవైపు పోలింగ్ జరుగుతుండగానే సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ మనోజ్ పాండే పార్టీ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నిర్వహించిన సమావేశానికి ఆయనతో పాటు మరో ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. వీరిలో కనీసం ఏడుగురు బీజేపీకి అనుకూలంగా ఓటేసినట్టు తేలింది. ఒక బీఎస్పీ ఎమ్మెల్యే కూడా బీజేపీకి ఓటేశారు. దాంతో ఆ పార్టీ అభ్యర్థులు ఆర్‌పీఎన్ సింగ్, తేజ్‌వీర్‌సింగ్, అమర్‌పాల్ మౌర్య, సంగీతా బల్వంత్, సుధాన్షు త్రివేది, సాధనాసింగ్, నవీన్ జైన్, సంజయ్ సేఠ్ విజయం సాధించారు. సమాజ్‌వాదీ నుంచి జయాబచ్చన్, రాంజీలాల్ సుమన్ నెగ్గగా అలోక్ రంజన్ ఓటమిపాలయ్యారు. కర్నాటకలో మాత్రం ఊహించిన ఫలితాలే దక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థులు అజయ్ మాకెన్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్, బీజేపీ అభ్యర్థి నారాయణ కె.బాండే గెలుపొందగా జేడీ(యూ) అభ్యర్థి కుపేంద్రరెడ్డి ఓటమి చవిచూశారు. అయితే యశవంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయగా యల్లాపుర బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ పోలింగ్‌కు దూరంగా ఉన్నారు! వారిద్దరూ కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. వారిపై చర్యలకు బీజేపీ సిద్ధమైంది. క్రాస్ ఓటింగ్ నేపథ్యంలో హిమాచల్‌లో సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలను కూల్చేయడం మోదీ సర్కారుకు అలవాటుగా మారిందంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు.


మంగళవారం కోర్టు రూంలోనే ఓర్లోవ్‌ను కస్టడీలోకి తీసుకుంటున్న సైనం

రష్యా హక్కుల నేతకు 30 నెలల జైలు

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిన తీరును తీవ్రంగా తప్పుబడుతూ వ్యాసాలు రాసిన రష్యా మానవ హక్కుల కార్యకర్తపై అక్కడి కోర్టు కన్నెర్రజేసింది. ప్రభుత్వ చర్యను తప్పుబడుతూ ఆర్టికల్స్ రాయడం నేరమంటూ 70 ఏళ్ల ఒలెగ్ ఓర్లోవ్‌కు 30 నెలల కారాగార శిక్ష విధిస్తూ మాస్కో కోర్టు తీర్పు చెప్పింది. రాజకీయ దురుద్దేశ్యంతో పెట్టిన కేసు ఇది అని ఆయన చేసిన వాదనలను కోర్టు పట్టించుకోలేదు. ఆయనకు రెండు సంవత్సరాల 11 నెలల జైలు శిక్ష వేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించగా రెండు సంవత్సరాల ఆరునెలల శిక్షను కోర్టు ఖరారుచేసింది. ఈ కేసులో గతంలోనే విచారణ ముగిసింది. అప్పుడు ఆయనకు కొంతమేర జరిమానా కట్టాలని మాత్రమే కోర్టు సూచించింది. అయితే పుతిన్ ప్రభుత్వంపై విమర్శలను సహించేది లేదని, కఠిన శిక్ష వేయాల్సిందేనని ప్రాసిక్యూషన్ ఈ కేసు పునర్విచారణను కోరి చివరకు ఇలా శిక్ష పడేలా చేసింది. గతంలో నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని అందుకున్న మానవహక్కుల సంస్థ 'మెమోరియల్'కు ఓర్లోవ్ సహ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఓర్లోవ్‌ను శిక్షించడాన్ని మెమోరియల్ సంస్థ తీవ్రంగా తప్పుబట్టింది. తమ ఉద్యమం ఆగదని పేర్కొంది.

బందీల్ని వదిలితే యుద్ధ విరామం: బైడెన్

జెరూసలేం: రంజాన్ మాసారంభం లోగానే యుద్ధానికి విరామం ఇచ్చేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పారు. అయితే, ముందుగా హమాస్ మిలిటెంట్లు కొందరు ఇజ్రాయెల్ బందీలను విడిచిపెట్టేందుకు అంగీకరించాల్సి ఉందన్నారు. తాత్కాలిక విరమణ సమయంలో మిగతా బందీల విడుదలతోపాటు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను మరికొందరిని విడుదల చేయడానికి సంబంధించి చర్చలు జరుగుతాయన్నారు. వచ్చే వారం నుంచి ఒప్పందం అమల్లోకి రావచ్చని ఎన్‌బీసీకిచ్చిన ఇంటర్వ్యూలో బైడెన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా, ఈజిప్ట్, ఖతార్‌ల మధ్యవర్తిత్వంతో రూపుదిద్దుకుంటున్న ఈ ఒప్పందం పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. అయితే, చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని హమాస్ ప్రతినిధి ఒకరు చెప్పారు. తమ డిమాండ్లపై పునరాలోచన ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. బైడెన్ తెలిపిన అంశాలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పందించలేదు. మార్చి 10న రంజాన్ మాసం మొదలుకానుంది.

లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఖాన్విల్కర్

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నియమితులయ్యారు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థి, నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా సుశీల్ చంద్ర, పంకజ్ కుమార్, అజయ్ టిర్కేలు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ మంగళవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వీరి నియామకాలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. జస్టిస్ ఖాన్విల్కర్ సుప్రీంకోర్టు జడ్జిగా 2022 జూలైలో పదవీ విరమణ చేశారు. లోక్‌పాల్‌కు చైర్‌పర్సన్ సభ్యుల పదవీ కాలం ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వయసు దాకా ఉంటుంది. ప్రధాని అధ్యక్షతలోని ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు వీరిని రాష్ట్రపతి నియమిస్తారు.

అంతటా మిత్రులే.. కేరళలో తప్ప!

కాంగ్రెస్, కమ్యూనిస్టుల బంధంపై మోదీ ఎద్దేవా

తిరువనంతపురం: కేంద్రంలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా గట్టి కూటమిని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశమంతటా ఎప్పటికీ మిత్రులు(బెస్ట్ ఫ్రెండ్స్ ఫరెవర్, బీఎఫ్ఎఫ్)గా కొనసాగే కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు ఒక్క కేరళలో మాత్రం శత్రువులుగా ఉంటాయని వ్యాఖ్యానించారు. మంగళవారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన కేరళ బీజేపీ విభాగం పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. దేశ పురోగతికి సంబంధించిన ఎలాంటి రోడ్ మ్యాప్ కూడా ప్రతిపక్ష పార్టీల వద్ద లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలిసే తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు సంధిస్తున్నారన్నారు. 'సీఎం విజయన్‌కు అవినీతి, కుంభకోణాలతో సంబంధముందని, ఫాసిస్ట్ ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుంది. బదులుగా కమ్యూనిస్ట్ ప్రభుత్వం కాంగ్రెస్ శ్రేణులపై లాఠీచార్జి చేయిస్తుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు సైతం అవినీతికి పాల్పడ్డాయని ప్రత్యారోపణలు చేస్తుంది. ఇదంతా కేరళలోనే. బయట ఇండియా కూటమి భేటీల్లో రెండు పక్షాల నేతలు కలిసి కూర్చుని సమోసాలు, బిస్కెట్లు తింటూ టీ తాగుతుంటారు. వీరు తిరువనంతపురంలో చెప్పేదొకటైతే, ఢిల్లీలో చెప్పేది ఇంకొకటి'అని ప్రధాని మోదీ పేర్కొన్నా రు.

కాంగ్రెస్ జాడల్లోనే కమ్యూనిస్టులు..

కాంగ్రెస్ ట్రాక్ రికార్డు చూస్తే దశాబ్దాలపాటు ఒకే ఒక్క కుటుంబం దేశంపై పెత్తనం ఎలా చెలాయించిందీ తెలుస్తుందన్నారు. 'ఆ ఒక్క కుటుంబం ప్రయోజనాలు దేశ ప్రజలందరి ప్రయోజనాల కంటే కూడా మిన్న. ఇప్పుడు కమ్యూనిస్టులు సైతం ఇదే రకంగా వ్యవహరిస్తున్నారు. మీ యువరాజును కేరళ నుంచి తీసుకెళ్లండి'అంటూ ఇక్కడి కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు చెబుతున్నారంటూ వయనాడ్ ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందంటూ వామపక్ష ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలును ఆయన కొట్టిపారేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగానే కేరళ కూడా గత పదేళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలతో అభివృద్ధిబాటన పయనించిందన్నారు. ఓటు బ్యాంకు కోణంలో ఏ రాష్ట్రాన్ని కూడా బీజేపీ చూడలేదని చెప్పారు.

మదురై మీనాక్షి ఆలయంలో మోదీ

సాక్షి, చెన్నై: తమిళనాడులోని ప్రసిద్ధి చెందిన మదురై మీనాక్షి అమ్మవారిని ప్రధాని మోదీ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం తమిళనాడుకు ప్రధాని వచ్చారు. ముందుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిర్వహించిన 'నా మట్టి...నా ప్రజలు'పాదయాత్ర ముగింపు సమావేశానికి హాజరయ్యారు. తిరుప్పూర్ జిల్లా పల్లడంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ ఇండియా కూటమిపై విమర్శలు ఎక్కుబెట్టారు. బీజేపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తంచేశారు.

ఐసీయూలో రోగిపై అత్యాచారం


జైపూర్: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి ఆలనాపాలనా చూడాల్సిన నర్సింగ్ అసిస్టెంట్ అఘాయిత్యానికి పాల్పడిన అమానవీయ ఘటన రాజస్తాన్‌లో చోటుచేసుకుంది. అఘాయిత్యం వేళ ప్రతిఘటించిన ఆమెకు నిందితుడు మత్తుమందు ఇంజెక్షన్ ఇవ్వడం దారుణం. అల్వార్ జిల్లాలోని శివాజీ పార్క్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 24 ఏళ్ల వివాహిత ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో తీవ్ర అస్వస్థతకు గురై జిల్లాలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను ఐసీయూ గదిలో చికిత్స అందిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో అక్కడే పనిచేసే చిరాగ్ యాదవ్ అనే నర్సింగ్ అసిస్టెంట్ ఆమెను రేప్‌చేయబోయాడు. వెంటనే ప్రతిఘటించిన ఆమెకు ఒక మత్తుమందు ఇంజెక్షన్ ఇచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేసి ఘోరానికి పాల్పడ్డాడు. తర్వాత కొంతసమయానికి భర్త ఫోన్ చేయగా ఆమె జరిగిన దారుణాన్ని చెప్పి బోరుమంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐదుగురు లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన ఆప్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ఢిల్లీలో నలుగురు, ఒకరు హరియాణాలో ఒక అభ్యర్థి పేర్లను ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం ప్రకటించింది. ఢిల్లీలో సోమనాథ్ భారతి న్యూఢిల్లీ స్థానం నుంచి బరిలో దిగుతారు. కోండ్లి ఎమ్మెల్యే కుల్దీప్‌కుమార్ ఈస్ట్ ఢిల్లీ, సహిరాం పహిల్వాన్ సౌత్ ఢిల్లీ, మాజీ ఎంపీ మహాబల్ మిశ్రా వెస్ట్ ఢిల్లీ నుంచి పోటీ చేస్తారు. హరియాణాలో కురుక్షేత్ర నుంచి మాజీ ఎంపీ సుశీల్ గుప్తా బరిలోకి దిగుతారు. సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా ఢిల్లీలో మూడు స్థానాలను కాంగ్రెస్ పార్టీకి ఆప్ కేటాయించడం తెలిసిందే.

సాక్షి కరీంనగర్

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



రాజన్నకు తగ్గని భక్తుల రద్దీ

వేములవాడ: సమ్మక్క జాతర ముగిసినా రాజన్నకు రద్దీ మాత్రం తగ్గడం లేదు. మహాశివరాత్రి సమీపిస్తున్నందున మొక్కులు చెల్లించుకునేందుకు తరలివస్తూనే ఉన్నారు.



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో బారులుతీరి నిలబడ్డారు.

గరిష్టం/కనిష్టం
34.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత



సమావేశంలో అధికారులు, వైద్యసిబ్బంది

కరీంనగర్‌టౌన్: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని, ఇది అందరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.హైమావతి అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విభాగాల డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రభావిత రిస్క్ గ్రూప్‌ల బాధితులను గుర్తించి, నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల ఐసీటీసీ, పీపీటీసీటీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ కేంద్రాల కౌన్సిలర్లు, డాక్టర్లు, ఎన్జీవో ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి, మార్చి నెలాఖరు వరకు 95శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. హెచ్ఐవీ బాధితుల కుటుంబ సభ్యులు, పిల్లలకు ఇండెక్స్ టెస్టులు నిర్వహించాలన్నారు. రిస్క్ గ్రూప్ ప్రజలను గుర్తించి ఏఆర్‌టీ మందులు సక్రమంగా అందించాలని సూచించారు. ఎన్ఏసీపీ కార్యక్రమాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లి, బాధితులకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు. గ్రామీణ నిరక్షరాస్యులకు సైతం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో టీ సాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు కరుణశ్రీ, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిర, సేతు మాధవ్, కన్సల్టెంట్ డాక్టర్లు పార్థసారథి, లేహార్‌వాణి, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, సుమన్, రమేశ్, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

రేకుర్తి జాతర ఆదాయం రూ.35.92 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

కరీంనగర్‌కల్చరల్: రేకుర్తిలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన సమ్మక్క– సారలమ్మ జాతర ఆదాయం రూ.35,92,550 సమకూరినట్లు ఈవో ఎండపల్లి మారుతి తెలిపారు. టిక్కెట్ల ఆదాయం రూ.5,18,230, టెండర్లు రూ.9,20,500, హుండీల ద్వారా 21,53,820 ఆదాయం వచ్చింది. మిశ్రమ బంగారం 15 గ్రాములు, మిశ్రమ వెండి 1కిలో 304 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, టూ టౌన్ పోలీసుల సమక్షంలో హుండీలు తెరిచారు. కార్యక్రమంలో సిబ్బంది, గోవింద పతి శ్రీవారి సేవా సమతి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్ఎం) పథకం కింది జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 8 రకాల 45 పోస్టులను భర్తీ చేయుటకు కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో వైద్యాధికారి 4, స్టాఫ్‌నర్స్ 21, ఎంఎల్‌హెచ్‌పీ 13, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ 1, ఏఎన్ఎం 1, ఫార్మాసిస్ట్ 3, డీఈవో 1, ఆప్టోమెట్రిక్ 1 పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 28 నుంచి మార్చి 2 వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఖాళీల సంఖ్య తగ్గించుటకు, పెంచుటకు పూర్తి అధికారం కలెక్టర్‌కు ఉంటుందని పేర్కొన్నారు.

'ఎంపీ సంజయ్ తీరు సరికాదు'

కరీంనగర్: రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండాలి కానీ శత్రువులుగా ఉండొద్దని, పదవులు రావడం, పోవడం సహజమని, ఎన్నికల్లో గెలిచేందుకు విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్లుగా పార్లమెంట్ పరిధిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లని ఎంపీ సంజయ్ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఎలాగైనా గెలవాలని కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఓ తల్లిపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికావని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



బొమ్మ శ్రీరాం చక్రవర్తిని అడ్డుకుంటున్న పోలీసులు

పొన్నం వర్సెస్ బండి!

- చిచ్చుపెట్టిన రాజకీయ ఆరోపణలు
- పరస్పర దాడులకు బీజేపీ– కాంగ్రెస్ నేతల యత్నం
- తన తల్లిని అవమానించారని మంత్రి ప్రభాకర్ ఆవేదన
- తాను ఎవరినీ కించపరచలేదని ఎంపీ సంజయ్ వివరణ
- జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రజాహిత యాత్ర సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య చెలరేగిన మాటల యుద్ధం ముదురుతోంది. యాత్రలో భాగంగా ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలకు తావులేదని సంజయ్ మీద జిల్లా కాంగ్రెస్ నాయకులంతా మండిపడుతున్నారు. పలు చోట్ల హస్తం పార్టీ నేతలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మరికొందరు బండి సంజయ్ మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. అదే సమయంలో తానెవరినీ కించపరచలేదని బండి వివరణ ఇచ్చారు. తాను అనని మాటలను అన్నట్లు చిత్రీకరించారని ఇది సమంజసం కాదని ఖండించారు. మొత్తానికి మంత్రి, ఎంపీ మధ్య మొదలైన మాటల యుద్ధం జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య అగ్గి రాజేసింది.

అయోధ్యతో మొదలై..

బండి సంజయ్ అయోధ్య గురించి మాట్లాడే క్రమంలో చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం తీవ్రంగా తప్పుబట్టారు. తన తల్లిని అవమానించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎంపీగా ఐదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించాను.. శ్రీరాముడి పేరు మీద ఓట్లు అడగడం కాదు, నియోజవర్గానికి ఏం చేశారో చెప్పాలి కానీ, తాను అనని మాటలను అన్నట్లు ఆపాదిస్తున్నారు' అని ఆక్షేపించారు. యాత్రకు ప్రచారం కోసమే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. నాడు కేసీఆర్ అన్నమాటలను ఎన్నికల్లో వాడుకున్నట్లే.. ఇప్పుడు కూడా వాడుతున్నారని మండిపడ్డారు. అయితే, తాను ఎవరినీ కించపరచలేదని బండి స్పష్టం చేశారు. పొన్నం తల్లి తనకు కూడా తల్లేనని, ఆమెకు పాదాభివందనం చేస్తున్నాని, ఆమె నిండు నూరేళ్లు బతకాలని ఆకాంక్షించారు. పొన్నమే తల్లి పేరిట రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను అనని మాటలను అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని వాపోయారు. అయోధ్య అక్షింతల విషయంలో పొన్నం అన్న మాటలను నిరూపిస్తానని బండి సవాలు విసిరారు. తన అరెస్టుకు కుట్ర పన్నుతున్నారని, తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని శపథం చేశారు.

టెన్షన్ వాతావరణం

పొన్నంపై బండి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. మంగళవారం ప్రజాహిత యాత్రలోనే నిరసన తెలిపేందుకు కాంగ్రెస్ నాయకులు బయల్దేరడం ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ నేతల రాకపై ముందే ఇంటెలిజెన్స్ సమాచారం ఉండటంతో బండి ప్రజాహిత యాత్రకు కట్టుదిట్టమైన బందోబస్తు కల్పించారు. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి వద్ద ఉన్న ప్రజాహిత యాత్ర క్యాంపు వైపు బీజేపీ– కాంగ్రెస్ శ్రేణులు రాగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. బీజేపీ నేత బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ఆయన అనుచరులను పోలీసులు నిలువరించారు. భారీగా వచ్చిన కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారు. ఒక దశలో యాత్రను పోలీసులు రూటు మార్చాలని యోచన చేశారు. బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంపై బండి అసహనం వ్యక్తం చేశారు. తర్వాత యాత్ర సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించడంతో కరీంనగర్ పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరుపార్టీల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ రోజంతా కనిపించింది.

విజయీభవ..

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా ఇంటికే..
- 56 కేంద్రాలు.. 33,549 మంది విద్యార్థులు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి మార్చి 16 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 56 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఫస్టియర్ 16,590, సెకండియర్ 16,959 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులను గంట ముందే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి నిర్ణీత గడువు తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

నిరంతర పర్యవేక్షణకు బృందాలు

56 కేంద్రాల్లో పరీక్షలను నిరంతరం పర్యవేక్షించేలా 4 సిట్టింగ్ స్క్వాడ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్, కేంద్రానికి ఒకరు చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు సిద్ధం చేశారు. మారుమూల ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఎలాంటి ఇబ్బందులు కలగనీయం



జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులకు హాల్‌టికెట్లపై ఆందోళన అవసరం లేదు. నేరుగా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.

– జగన్మోహన్‌రెడ్డి, డీఐఈవో

ఇలా చేస్తే ఫలితాలు మీవే..



- పరీక్షలయ్యే వరకు మార్కుల విషయంలో విద్యార్థులపై తల్లిదండ్రులు, యాజమాన్యాలు ఒత్తిడి తీసుకురాకూడదు.
- రాత్రి 10.30 గంటల తర్వాత చదవకూడదు. వేకువజామున క్లిష్టమైన సబ్జెక్టులు, తేలికైనవి మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చదవాలి.
- విద్యార్థులను టీవీలు, సినిమాలు, క్రికెట్ మ్యాచ్‌లు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. పరీక్షలయ్యే వరకు ఇతర పనులేవీ అప్పగించకూడదు.
- తోటి విద్యార్థులతో సబ్జెక్టులపై గ్రూప్ డిస్కషన్ పెట్టుకోవాలి. పరీక్ష రాశాక ఎన్ని మార్కులొస్తాయని అడగకూడదు. అడిగితే దాని ప్రభావం తర్వాత పరీక్షలపై పడుతుంది.
- రోజూ ఉదయం 15 నిమిషాలు ధ్యానం చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది.
- పరీక్షలకు బయల్దేరడానికి గంట ముందుగానే అన్నీ సర్దుకోవాలి. హడావిడిగా వెళ్తే ఆ ప్రభావం పరీక్షపై పడుతుంది.

– అట్ల శ్రీనివాస్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

అప్రమత్తంగా విధులు నిర్వర్తించండి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో కిందిస్థాయి సిబ్బందితో కలిసి పని చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పనిచేయాలని, ఎవరు కూడా నిర్లక్ష్యంగా ఉండవద్దని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రానికి ఒక వీల్ చైర్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పని చేయాలని సూచించారు. పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై దిశానిర్దేశం చేశారు. శిక్షణలో కరీంనగర్, మానకొండూరు, హుజురాబాద్, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన సెక్టోరియల్ అధికారులు పాల్గొనగా, ఎన్నికల విధుల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. డీఆర్డీవో శ్రీధర్, ఎన్నికల మెటీరియల్ నోడల్ ఆఫీసర్ మాధవి, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ కనకయ్య, ఎంఈవో మధుసూదనాచారి, ట్రైనర్లు తిరుపతిరెడ్డి, రజనీశ్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పరుశరాములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌పై ఫిర్యాదులుంటే అర్జీలివ్వండి

కరీంనగర్ అర్బన్: మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా రూ.500లకే గ్యాస్‌పై ఏలాంటి ఫిర్యాదులున్నా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. ప్రజాపాలన పథకంలో లబ్ధి పొందాలంటే ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుని ఉండాలని, ఆహారభద్రత కార్డు ఉండాలని తెలిపారు. క్రియాశీల గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. పథకానికి సంబంధించిన సమాచారం, ఫిర్యాదులుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ బండి సంజయ్‌పై మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. ఇందిరాచౌక్‌లో సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పెనుగులాట చోటుచేసుకుంది. నిరసనగా కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కాగా మహిళా లోకానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి డిమాండ్ చేశారు. బండిపై చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సంజయ్‌కి మతిభ్రమించి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. చర్యలు తీసుకోవాలంటూ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. పొన్నం గురించి మాట్లాడే అర్హత బండి సంజయ్‌కి లేదని కాంగ్రెస్ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసిన్, తదితరులు విమర్శించారు. కార్యక్రమాల్లో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, చెర్ల పద్మ, నేరెళ్ల కవిత, సుజాత, జ్యోతిరెడ్డి, లావణ్య, స్వప్న, మహాలక్ష్మి, సత్య, బోనాల శ్రీనివాస్, రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాముడు కూడా క్షమించడు : కవ్వంపల్లి

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆ శ్రీరాముడు కూడా క్షమించడని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఉనికి చాటుకోవడానికే పొన్నంపై వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సంస్కారహీనుడైన బండి సంజయ్ గ్రామాలకు వస్తే తరిమికొట్టాలని, చెప్పుల దండలతో స్వాగతించాలని పిలుపునిచ్చారు.

గుంటూరుపల్లి రోడ్డు ప్రమాదాలకు చెక్!



గుంటూరుపల్లి వద్ద ఇరుకుగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి



కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు

- నాలుగు లైన్లుగా అప్‌గ్రేడ్ కానున్న ఇరుకు రహదారి
- 'సాక్షి' కథనంపై ఆర్అండ్‌బీ అధికారుల స్పందన
- వెంటనే సమస్య పరిష్కరించాలని మంత్రి 'పొన్నం' ఆదేశాలు
- మంత్రికి గుంటూరుపల్లి గ్రామస్తుల కృతజ్ఞతలు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బొమ్మకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) సమీపంలోని గుంటూరుపల్లి స్టేజీ..ఈ పేరు వింటేనే గ్రామస్తులకు హడల్. వందలాదిమంది అకాల మరణాలకు కారణమైన ఈ ఇరుకు రోడ్డుకు ఇకపై మోక్షం కలగనుంది. దాదాపు 100మీటర్ల మేర ఇరుకు (బాటిల్ నెక్)గా ఉన్న ఈ రోడ్డును ఫోర్‌లేన్ (నాలుగు వరుసల) రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ శివారులోని గుంటూరుపల్లి స్టేజీవద్ద ఉన్న ఇరుకు రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న తీరుపై ఈ నెల 13న 'ఆ రోడ్డంటే భయం' అన్న శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఓ సమీక్షా సమావేశంలో ఈ కథనం ప్రస్తావన తేగా.. వెంటనే స్పందించిన మంత్రి, ప్రజల ప్రాణాలు పోయేందుకు కారణమవుతున్న ఇరుకు రోడ్డును వెంటనే ఫోర్ లేన్‌గా మార్చాలని ఆదేశించారు. త్వరలోనే ఆర్అండ్‌బీ అధికారులు పనులు కూడా మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

సమాచార హక్కుతో వెలుగులోకి!

ప్రమాదాలకు నెలవుగా మారిన గుంటూరుపల్లి స్టేజీ వద్ద ఉన్న రాజీవ్ రహదారిపై వందలాది మంది అసువులు బాశారు. ఇందులో వాహనదారులతో పాటు పాదచారులు కూడా ఉండటం వారంతా గుంటూరుపల్లికి చెందిన వారే కావడం గమనార్హం. 2016 నుంచి ఇప్పటి వరకు దాదాపు 80 మందిని రోడ్డు ప్రమాదాలు బలితీసుకోవడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో దాదాపు 20 మంది వరకు గ్రామస్తులే ఉన్నా రు. గుంటూరుపల్లి స్టేజీ మీద జరిగిన ప్రమాదా లను చూసి కలత చెందిన తౌఫిక్ సమాచార హక్కు ద్వారా రూరల్ పోలీసుల నుంచి వివరాలు తీసుకుని వెలుగులోకి తీసుకువచ్చాడు. రోడ్డు ప్రమాదాల్లో ఇంటి పెద్ద, ఎదిగిన కొడుకులు మరణించడంతో ఆడవారు, వృద్ధులు కూలీనాలీ చేసి పొట్ట పోసుకుంటున్నారు. బాధిత కుటుంబాలు ఎంతటి దయనీయ స్థితిలో ఉన్నాయో తెలిపేలా ఈనెల 20న 'తీరని కన్నీటి వ్యథ' పేరిట 'సాక్షి'లో మరో కథనం పచురితమైంది. త్వరలో స్టేజీ వద్ద నా లుగు వరుసల రహదారి నిర్మిస్తారని తెలిసి గుంటూరుపల్లి వాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీ కటాక్షం వరించేది వీరికే

- ప్రారంభమైన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు
- మహాలక్ష్మి కింద రూ.500కే సిలిండర్
- గృహజ్యోతితో 200యూనిట్ల లోపు ఉచిత కరెంట్
- తెల్ల రేషన్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తులే ప్రామాణికం



సాక్షి, ప్రతినిధి, కరీంనగర్/కొత్తపల్లి: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం ఆయా పథకాలకు తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకుంది. దీంతో తెల్లరేషన్ కార్డులేని లబ్ధిదారులు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి ఈ పథకాలు వర్తించవని ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవోలో పేర్కొంది. దీంతో అప్పట్లో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, రేషన్‌కార్డు లేనివారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఖాతాల్లోకి నేరుగా గ్యాస్ సబ్సిడీ

ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మూడు అంశాల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసి ఉండాలి. మహిళ పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉండాలని నిబంధనలు విధించింది. అలాగే గత మూడేళ్లలో గ్యాస్ సిలిండర్స్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని, అర్హులైన లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సిలిండర్ అందజేయనున్నారు. అయితే లబ్ధిదారు మొదట మొత్తం సొమ్ము చెల్లించాలి. తర్వాత ప్రభుత్వం రూ.500 పోగా మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడి ఖాతాలో 48 గంటల్లో జమ చేయనుంది. ఉమ్మడి జిల్లాలో వివిధ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 8,13,880 మంది లబ్ధిదారులున్నారు. కాగా చాలామంది గ్యాస్ కనెక్షన్లు భర్తలు, మామల పేరు మీదనే ఉన్నాయి. అటువంటి వారి పరిస్థితిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల వివరాలు

జిల్లా	మహాలక్ష్మి	గృహజ్యోతి
కరీంనగర్	96,000	3,44,000
పెద్దపల్లి	2,12,887	2,02,721
జగిత్యాల	3,39,715	2,08,233
సిరిసిల్ల	1,65,278	1,42,966
మొత్తం	8,13,880	8,97,920

200 యూనిట్లు ఉచితం

గృహజ్యోతి పథకం కింద తెల్లరేషన్ కార్డు కలిగి, 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్న వారిని లబ్ధిదారులుగా తేల్చారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజలు సమర్పించిన గృహజ్యోతి దరఖాస్తుల ఆధారంగా విద్యుత్ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో విద్యుత్ సర్వీసుల వివరాలు నమోదు చేశారు. ఈ పథకం ప్రారంభించడంతో మార్చినెల నుంచి తెల్లరేషన్ కార్డులున్న వారు 200 యూనిట్ల లోపు కరెంట్‌ను ఉపయోగిస్తే బిల్లు సున్నా వస్తుంది. 200 యూనిట్లు దాటితే మాత్రం బిల్లు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే విద్యుత్ శాఖ లబ్ధిదారుల వివరాలు సేకరించింది. ఆధార్, ప్రజాపాలన దరఖాస్తు సంఖ్య, రేషన్‌కార్డు నంబర్, విద్యుత్ మీటర్ నంబర్‌లను సేకరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గృహజ్యోతి కింద 8,97,920 మంది లబ్ధిదారులు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు లెక్క తేల్చారు. కాగా గృహజ్యోతి పథకం ఉచిత విద్యుత్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లించనుంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 1 నుంచి గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తాం. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా వినియోగదారుల విద్యుత్ సర్వీసులను నమోదు చేశాం. కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఎంతమంది గృహ వినియోగదారులు లబ్ధి పొందుతారన్నది మార్చి నెల బిల్లింగ్ ద్వారా స్పష్టత రానుంది.

– వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ, కరీంనగర్ సర్కిల్

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం?


నాగేంద్ర(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు గద్రెపల్లి నాగేంద్ర(45)పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం..సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన నాగేంద్ర కొన్ని సంవత్సరాల నుంచి మహాముత్తారం మండలం ములుగుపల్లిలోని ట్రైబల్ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నెల రోజుల క్రితం డిప్యుటేషన్‌పై కాళేశ్వరం గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ములుగు జిల్లా గట్టమ్మ వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గమనించి వెంటనే పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మంగళవారం మహదేవపూర్‌లో నాగేంద్ర అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, నాగేంద్ర మృతికి కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. మృతుడికి భార్య మంజుల, కుమారుడు ఉన్నారు.

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ఓ వ్యక్తి మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై సాగర్ (50) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తుందని, మృతుడి వద్ద ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ చిట్టీ మాత్రమే ఉందని, అందులో జమ్మికుంటకు చెందిన సాగర్‌గా నమోదై ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరాలేదని, మృతుడు బ్లూకలర్ ఫుల్ షర్టు, దానిపై పసుపు రంగు నిలువు గీతల డిజైన్, బ్లాక్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని, మృతుడికి సంబంధించిన ఏమైనా వివరాలు తెలిస్తే 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు..

గోదావరిఖని: సింగరేణి కార్మికుడు అనుమానాస్పద స్థితిలో డ్రైనేజీలో శవమై కనిపించాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగానగర్‌లో నివాసముంటున్న సింగరేణి కార్మికుడు పూరెళ్ల సాగర్(32) మంగళవారం మృతి చెందాడు. మిలీయం క్వార్టర్స్‌లో ఉంటున్న సాగర్.. లక్ష్మీనగర్‌లోని లోటస్ స్కానింగ్ సెంటర్ సమీపంలోని డ్రైనేజీలో పడి మృతి చెంది కనిపించాడు. హెయిర్‌డ్రై తాగి మృతి చెందినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కాగా మృతుడిపై గతంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

రేపాకలో పసరికల కలకలం


గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో పసిరికల వ్యాధి (జాండీస్) కలకలం రేపింది. గ్రామానికి చెందిన సుమారు 30 మందికి వ్యాధి సోకినట్లు గుర్తించడంతో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం హుటాహుటిన రేపాక గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి జాండీస్ రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిభకు వేదిక.. యువిక

- ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన కార్యక్రమ్ – 2024
- భావిభారత శాస్త్రవేత్తల తయారీకి చక్కని అవకాశం
- మార్చి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు
- తొమ్మిదో తరగతి విద్యార్థులు అర్హులు

జ్యోతినగర్(రామగుండం): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) పాఠశాల విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం ×యువ విజ్ఞాన కార్యక్రమ్(యువిక) – 2024 పేరిట చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే.. భావితరాలకు శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చని గుర్తించిన ఇస్రో.. ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక, అంతరిక్షశాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరిట ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 20వ తేదీ నుంచి అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈఅవకాశం కల్పించింది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు.

దరఖాస్తు చేయడం ఇలా..

- అధికారులు (www.irso.gov.in) వెబ్‌సైట్ ప్రారంభించారు.
- దీనిని ఓపెన్ చేసిన తర్వాత యువికా ఆప్షన్ క్లిక్ చేయాలి.
- అందులో విద్యార్థికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలి.
- విద్యార్థులు 2024 జనవరి ఒకటో తేదీ నాటికి తొమ్మిదో తరగతి చదువుతూ ఉండాలి.
- ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం మందికి, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు 10 శాతం, సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న వారికి 10శాతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ చేసిన వారికి 5 శాతం, గ్రామీణులకు 15 శాతం అనుమతి కల్పిస్తారు.

20 వరకు దరఖాస్తుల స్వీకరణ..

మార్చి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, 28న తొలి జాబితా, ఏప్రిల్ 4న రెండో జాబితా ప్రకటిస్తారు. మే 12న ఇస్రో కేంద్రాల వద్ద రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 13న యువికా కార్యక్రమం నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులు బస్సులు, రైళ్ల ద్వారా వెళ్లే ప్రయాణ రాయితీ కల్పించడంతోపాటు వసతి, బస సౌకర్యం కల్పిస్తారు.

యువికా ఉద్దేశం ఇది..

- ఇస్రో చేపట్టిన యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు.
- ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డెహ్రాడూన్, శ్రీహరికోట, హైదరాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురం తదితర కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు.
- ఇక్కడ విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చావేదికలు, ప్రయోగశాలల సందర్శన, ముఖ్యులతో సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశమిస్తారు.
- అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.

ఇది చక్కని అవకాశం



ఇస్రో చేపట్టిన యంగ్ సైంటిస్ట్ కార్యక్రమం విద్యార్థులకు చక్కని వేదిక. పిల్లలు తమ ప్రతిభ వెలికి తీసుకునేందుకు ఇది ఓ అవకాశం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తి ఉన్న విద్యార్థులతో దరఖాస్తు చేసేలా ప్రోత్సహించాలి.

– రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ అనురాగ్ జయంతి


జాతర పనులు పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, పక్కన ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 3 రోజులపాటు జరుపుకునే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు గతంలో కంటే ఘనంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వివిధ శాఖలను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులతో కలిసి జాతర పనులను పరిశీలించారు. మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతీ 100 మీటర్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. శివ భక్తుల కోసం అవసరమైన మేర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతరను విజయవంతానికి ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇబ్బంది కలుగకుండ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలకుండా అవసరమైన మేర ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు, ఎంట్రీ, ఎక్సిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈసారి భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో అవసరమైన మేర తాత్కాలిక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, క్యూలైన్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణకు జేసీబీ, టోయింగ్ వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఆలయ ఈఈ రాజేశ్, ఏఈవో జయకుమారి, టౌన్ సీఐ కరుణాకర్, ఆలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


కమలాకర్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం టిప్పర్ ఢీ కొని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి అనుబంధం పిట్టలపల్లికి చెందిన గోదల కమలాకర్ (42) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికుల కథనం ప్రకారం పిట్టలపల్లికి చెందిన కమలాకర్ గంగాధరలో సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. కోర్టు పని నిమిత్తం బోయినపల్లి మీదుగా బైక్‌పై వేములవాడ వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ టిప్పర్ వెనుక నుంచి వచ్చి కమలాకర్‌ను ఢీకొనడంతో కమలాకర్ తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన బంధువులు, స్నేహితులు భారీగా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. గంగాధర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వేములవాడటౌన్, వేములవాడ రూరల్, చందుర్తి సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్, పోలీసులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

సీసీ పుటేజీల ఆధారంగా..

సంఘటన జరిగిన తీరును స్థానిక పెట్రోల్ బంక్ పరిసరాల్లోని సీసీ పుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. టిప్పర్ కమలాకర్‌ను వెనుకనుంచి ఢీ కొట్టినట్లు అనుమానిస్తున్నారు. కమలాకర్‌కు భూ తగాదాలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంలోనే ఆయన కోర్టుకు వెళ్తున్నట్లు అంటున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రత్యర్థులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తండ్రి మరణ వార్త తెలియగానే కమలాకర్ కుమారుడు రోహిత్ క్రిష్ణ, కూతురు మైత్రి స్కూల్ డ్రెస్‌లోనే సంఘటనాస్థలనికి చేరుకుని నాన్న నాన్న.. అని విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. కమలాకర్ భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, టిప్పర్‌తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

దమ్ముంటే కవితను అరెస్ట్ చేయించు

- ‘బండి’కి గజ్జెల కాంతం సవాల్


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ కార్పొరేషన్: బీజేపీ నేత బండి సంజయ్‌కి దమ్ముంటే లిక్కర్ స్కాంలో ఉన్న కవితను అరెస్ట్ చేయించాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం సవాల్ విసిరారు. రూ.3 లక్షల కోట్లు కాజేసిన కేసీఆర్ కుటుంబంపై సీబీఐ, ఈడీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబమంటే ఎందుకు భయమని, కాంగ్రెస్‌ను, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత సంజయ్‌కి లేదని మండిపడ్డారు. మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ కేసులో కవిత ఎందుకు అరెస్ట్ కావడం లేదో చెప్పాలన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రూ.3 లక్షల కోట్లు లెక్కతేలడం లేదని కాగ్ చెప్పిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వంతో విచారణ జరిపించాలని సంజయ్‌కి సూచించారు. ఎంపీగా కరీంనగర్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రానికి ఏం నిధులు తెచ్చాడో వెల్లడించాలన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు తెలంగాణ కోసం పొన్నం ప్రభాకర్ ఉద్యమించారని, ప్రస్తుతం మంత్రిగా సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు కృషి చేస్తున్నారని చెప్పారు. అలాంటి చరిత్ర కలిగిన పొన్నంతో ఎలాంటి చరిత్ర లేని బండి సంజయ్‌కి పోలికేంటన్నారు. శ్రీరాముడికి బీజేపీకి సంబంధమేమిటని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనప్పుడే శ్రీరాముడు దేశాన్ని పరిపాలించాడని గుర్తు చేశారు. మోదీ, బండి పుట్టనప్పటి నుంచి హిందుత్వం ఉందన్నారు. రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. ప్రజలకు మంచి చేయడం చేతకాదని, అందుకే దేవుడు, మతం పేరుతో ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు విభజన హామీలు ఎందుకు అమలు చేయించలేకపోయారని, ఎంపీగా ఓడిపోతున్నాననే మతిస్థిమితం కోల్పోయి పొన్నంపై మాట్లాడుతున్నాడని, నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలని కాంతం హెచ్చరించారు.

ఆదర్శ వివాహం.. విషాదాంతం

- రెండు నెలల వ్యవధిలో దంపతుల బలవన్మరణం


రాకేశ్ మృతదేహం

రామగుండం: ఆదర్శ వివాహం చేసుకున్న దంపతుల మధ్య ఏర్పడిన విభేదాలు వారి జీవితాలను విషాదాంతం చేశాయి. పెళ్లయిన ఏడాదిలోనే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో తొలుత భార్య, రెండు నెలల తర్వాత భర్త బలవన్మరణానికి ఒడిగట్టారు. దీంతో వీరి కుమారుడు(6నెలలు) ఒంటరిగా మారాడు. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కందునూరి సతీశ్ కథనం ప్రకారం.. రామగుండం రైల్వేస్టేషన్ ఏరియా భరత్ నగర్‌కు చెందిన దండుగుల రాకేశ్(23), అదేకాలనీకి చెందిన మాణిక్యాల ధనశ్రీ ప్రేమించుకుని 2022 మేలో వివాహం చేసుకున్నారు. ఏడాదిపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు తలెత్తి దంపతుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో మనస్తాపం చెందిన ధనశ్రీ గతేడాది డిసెంబర్ 24న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి రాకేశ్‌తోపాటు అతడి తల్లిదండ్రులు కారణమని మృతురాలి తండ్రి మాణిక్యాల సదానంద రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదైంది. అయితే, బెయిల్‌పై వీరు 15రోజుల క్రితం జైలు నుంచి విడుదలయ్యారు. ఎంతోప్రేమించిన ధనశ్రీ దూరం కావడం,, ఆమె లేక తాను లేననే మనస్తాపంతో రాకేశ్ మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు నెలల వ్యవధిలో దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి ఆర్నెల్ల వయసు గల కుమారుడు ఒంటరివాడయ్యాడు. బాబును చూసిన స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. కాగా, మృతుడి తండ్రి పోశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూవివాదంలో దాడి

చందుర్తి(వేములవాడ): భూమి హద్దుల విషయమై ఇరువురు దాడి చేసుకున్న సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొదురుపాక గ్రామానికి చెందిన పెంజర్ల లచ్చయ్య, అంజయ్య గౌడ్ కలిసి బండపల్లిలోని మాజీ సర్పంచ్ వద్ద 13 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేశారు. పంపకంలో తేడాలు వచ్చి ఇద్దరి మధ్య పంచాయితీలు జరిగాయి. అంజయ్య సాగు చేసిన వరి ఎండిపోతుండడంతో చెరువుకు మోటారు బిగించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పొలం వద్ద బోరు వేసుకునేందుకు అతని తమ్ముడితో కలిసి వెళ్లగా.. అక్కడే ఉన్న లచ్చయ్య, అంజయ్య మధ్య వాగ్వాదం ఏర్పడింది. దాడి చేసుకోవడంతో ఇద్దరూ గాయపడ్డారు. తీవ్ర గాయాలైన అంజయ్య గౌడ్‌ను ఆసుపత్రికి తరలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కాంగ్రెస్ చెప్పేది ఒక్కటి.. చేసేది ఇంకోటి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల: కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఇంకోటని మరోసారి రుజువైందని మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ 2020 ఆగస్టు 31న ఎల్ఆర్ఎస్ జీవోను తెచ్చారన్నారు. ఈ జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అమలు చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీలు, కార్పొరేషన్స్, గ్రామాల్లో లేఅవుట్ లేని భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు రాష్ట్రంలో 25.44 లక్షల మంది దరఖాస్తులు చేశారని తెలిపారు. కొందరు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో నిలిచిపోయిందన్నారు. 25శాతం మంది దరఖాస్తుదారులు రిస్క్ తీసుకొని రెగ్యులరైజ్ చేసుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారని గుర్తు చేశారు. ఇప్పుడు రూ.8,000 కోట్ల ఆదాయం వస్తుందని మళ్లీ అమలు చేస్తున్నారన్నారు. దీనిని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వ చెప్పేది ఒకటి.. చేసేది ఇంకోకటి అని రుజువైందని తెలిపారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో కవి, గాయకులు దేశపతి శ్రీనివాస్, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో కరీంనగర్‌కు చేసిందేదో చెప్పాలి

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచి ఐదేళ్లలో బీజేపీ కోసమే పనిచేశాడమే తప్ప ప్రజల కోసం పనిచేయలేదని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం వేములవాడలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు వస్తేనే బండి సంజయ్‌కి ప్రజలు గుర్తుకు వస్తారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి మళ్లీ ఎంపీ ఎన్నికలకు ఎందుకు వస్తున్నాడనీ అన్నారు. సంజయ్‌కి ఎంపీ పదవి ఏమన్నా పునరావాస కేంద్రమా అని ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో సీఎం కేసీఆర్‌తో చర్చించి కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం రూ.వెయ్యి కోట్లు తీసుకొచ్చానన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌తో పాటు కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకొచ్చింది

- బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు
- అసెంబ్లీ ఎన్నికల ముందు ఇలానే దుష్ప్రచారం
- కాళేశ్వరంపై జ్యుడిషియల్ విచారణ అంటూ తాత్సారం
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


మెట్‌పల్లిలో మాట్లాడుతున్న డీకే అరుణ

మెట్‌పల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల ముందు అదే ప్రచారం చేసి లబ్ధి పొందాలని చూస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ అన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి పొత్తులూ ఉండవని స్పష్టం చేశారు. మోసపూరిత హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న ఆమె.. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఉన్న వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసివచ్చిందన్నారు. బీజేపీ చేపడుతున్న విజయ సంకల్ప యాత్రకు విశేష స్పందన లభిస్తోందని, మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ నిషేధం మోదీతోనే సాధ్యమైందన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలందరికీ వ్యాక్సిన్స్ ఇచ్చిన ఘనత బీజేపీదన్నారు. లిక్కర్ స్కాంలో కవిత నిందితురాలుగా ఉందని, సీబీఐ, ఈడీ తమ పని తాము చేసుకుపోతాయని, నిజమని తేలినప్పుడు కవిత జైలుకెళ్లడం తప్పదని పేర్కొన్నారు. కాళేశ్వరం విషయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ ఎంక్వైరీ చేయాలన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సీఎం అయ్యాక సీబీఐ ఎంక్వైరీకి ఎందుకు తాత్సారం చేస్తున్నారని, జ్యుడిషియల్ ఎంక్వైరీ అని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, బీజేపీ గెలుపును అడ్డుకోవాలని చూస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలవుతాయని ప్రచారం చేస్తున్న ఆ పార్టీ పథకాలను కేవలం పత్రిక ప్రకటనలకే పరిమితం చేస్తోందని విమర్శించారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య వైద్యానికి రూ.2లక్షల జరిమానా

జగిత్యాలజోన్: ఓ మహిళకు నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసిన ఓ కార్పొరేట్ ఆసుపత్రికి రూ.2లక్షల జరిమానా, ఆపరేషన్ చేసిన వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కరీంనగర్ జిల్లా వినియోగదారుల ఫోరం తీర్పు చెప్పింది. ఈనెల 24న బాధితురాలికి తీర్పు కాపీలు అందాయి. బాధితురాలి తరపు న్యాయవాది మెట్ట మహేందర్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన ఏనుగు సుగుణ తన ఎడమ కాలుకు నొప్పి రాగా, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. అక్కడి వైద్యులు పరీక్షల అనంతరం 25 జూన్ 2012న ఆపరేషన్ చేశారు. ఎన్ని మందులు వాడినా కాలుకు నయం కాలేదు. దీంతో సుగుణ మరో ఆసుపత్రిలో 19 మార్చి 2013న చేరి కాలికి ఆపరేషన్ చేయించుకుంది. అనంతరం మొదట ఆపరేషన్ చేసిన ఆసుపత్రి, అక్కడి వైద్యుల నిర్లక్ష్యంతో తనకు రెండోసారి ఆపరేషన్ చేశారని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు న్యాయవాది ద్వారా 10 జూలై 2014న కరీంనగర్ జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం సుగుణకు రూ.2లక్షలతోపాటు 2014 నుంచి 9 శాతం వడ్డీతో పరిహారం చెల్లించాలని కరీంనగర్ జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్, జడ్జి కె.స్వరూపరాణి, సభ్యులు శ్రీలత, నర్సింహారావు తీర్పు చెప్పారు. మొదటిసారి వైద్యం చేసిన డాక్టర్‌పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద వ్యక్తి అప్పగింత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు బంధించారు. పలు ప్రశ్నలు వేసి ఆచూకీ కోసం ప్రయత్నించగా చెప్పకపోవడంతో దొంగగా భావించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అతని వేలి ముద్రలను సేకరించి పాత రికార్డులను పరిశీలిస్తున్నారు.

రైల్వే చార్జీలు తగ్గింపు

- కరోనా సమయంలో చార్జీలు పెంచిన రైల్వే
- రూ.30 టికెట్ ధర ఇకపై రూ.10కే

సాక్షి, పెద్దపల్లి: ప్యాసింజర్, పుష్‌పుల్ రైలు ప్రయాణికులకు శుభవార్త. ఈ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల కనీస ఛార్జీని రూ.10కి తగ్గిస్తూ కేంద్రప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. కరోనాకు ముందు ఈ కనీస ఛార్జీ ధర రూ.10గా ఉండేది. కరోనాకాలంలో సదరు ఛార్జీని రూ.30కి పెంచారు. రైల్వేశాఖ తాజా నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రయాణికులపై భారం తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఛార్జీలు ఈనెల 27 నుంచే అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

స్టేషన్	స్టేషన్	దూరం (కి.మీలో)	కొత్తచార్జీ (రూ.లో)
పెద్దపల్లి	బల్లార్షా	160	35
పెద్దపల్లి	కాగజ్‌నగర్	89	25
పెద్దపల్లి	బెల్లంపల్లి	51	15
పెద్దపల్లి	మంచిర్యాల	31	10
పెద్దపల్లి	రామగుండం	18	10
పెద్దపల్లి	ఓదెల	19	10
పెద్దపల్లి	జమ్మికుంట	39	10
పెద్దపల్లి	కాజీపేట	75	20
పెద్దపల్లి	వరంగల్	83	25
పెద్దపల్లి	మహబూబాబాద్	144	35
పెద్దపల్లి	డోర్నకల్	168	40
పెద్దపల్లి	భద్రాచలంరోడ్	225	50
పెద్దపల్లి	కరీంనగర్	35	10
పెద్దపల్లి	లింగంపేట (జగిత్యాల)	83	25
పెద్దపల్లి	కోరుట్ల	103	30
పెద్దపల్లి	ఆర్మూర్	148	35
పెద్దపల్లి	నిజామాబాద్	178	40
పెద్దపల్లి	బోధన్	204	45


క్యూలైన్ ద్వారా దర్శనం


ఆలయ ఆవరణలో సందడి

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల ద్వారా కొండకు చేరుకున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో వెంకటేశ్, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, సునీల్, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


ఆలయంలో భక్తులు

క్లుప్తంగా

బధిరుల పాఠశాలలో సైన్స్ డే



విద్యార్థులు వేసిన ముగ్గును పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ స్వరూపారాణి

విద్యానగర్: అంతర్జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బధిరుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సైన్స్‌పై ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ అడిషనల్ కమిషనర్ స్వరూపారాణి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని సృజనాత్మకత బహిర్గతం అవుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు అక్కినపల్లి శివజ్యోతి నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయురాలు కమల, మోహన్‌రావు, రేఖ, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దాడిపై బీజేపీ నిరసన



ఎంపీ సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: చిగురుమామిడిలో ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం నగునూరు స్టేజీ వద్ద రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కరీంనగర్ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని, నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం వారు ఎంపీ సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు డి.శ్రీనివాస్, ఎం.సంతోష్‌కుమార్, పి.తిరుపతి, ఓదెలు తదితరులున్నారు.

లక్ష్య స్కూల్లో మినీ ఫెస్టివల్



నమూనాలను పరిశీలిస్తున్న సైన్స్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీ

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం లక్ష్య మినీ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, క్వాంటం మైండ్ ఐక్యూ డైరెక్టర్ జోసెఫ్ జాన్సన్, సీఈవో క్లెమైంట్ రాజు హాజరై, ప్రారంభించారు. ఈ ఫెస్టివల్ వేదికగా డెర్మటోగ్లిఫిక్స్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్ టెస్ట్‌ని క్వాంటం మైండ్ ఐక్యూవారు కరీంనగర్‌కు పరిచయం చేశారు. దీని ద్వారా కేవలం వేలిముద్రలతో పిల్లల్లోని సహజమైన మేధస్సుని, పుట్టుకతో వచ్చిన ప్రతిభని గుర్తించవచ్చన్నారు. పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థి భవిష్యత్తు నిర్మాణంలో కుటుంబం, పాఠశాల బాధ్యత సమానంగా ఉంటుందన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి, అభినందించారు. పాఠశాల డైరెక్టర్ షేక్ అఫ్సానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

తిమ్మాపూర్(మానకొండూర్): నుస్తులాపూర్, మల్లాపూర్ రైతువేదికల్లో వరిలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులు, రసాయన ఎరువుల వినియోగంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మల్లాపూర్‌లో వ్యవసాయ అధికారి మమత, నుస్తులాపూర్‌లో ఏఈవో స్వామి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అగ్గితెగులు సోకే అవకాశం ఉందని నివారణకు సూచించిన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. మల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి పద్మ, రైతులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

జమ్మికుంట(హుజూరాబాద్): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో జీవనజ్యోతి పట్టణ సమాఖ్య మహాసభ నిర్వహించారు. చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఆయాజ్ మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్య మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తుందని, ఇతరులకు అప్పు ఇస్తూ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఆదేశాలతో ఆర్పీలు అన్నిరకాల సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం నెలకు రూ.6 వేల పారితోషికం ఇస్తోందన్నారు.

ఓటరు ఇక్కడ.. ఓటు ఎక్కడో!

- నంబంధం లేని డివిజన్‌లో ఓటు వేయాల్సిన పరిస్థితి
- సరిచేయని అధికారులు
- విచారణ చేయాలంటున్న నగరవాసులు



'నగరంలోని 7వ డివిజన్ పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన దాస్యం సేనాధిపతి 5–7–1016 ఇంటి నంబర్‌లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. ప్రతీ ఎన్నికల్లో ఓటు వేస్తున్నారు. కానీ, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆయన ఓటు (ఎపిక్ నంబర్ వైఓజే7684079) కోతిరాంపూర్‌కు మారింది. కోతిరాంపూర్ బూత్ నంబర్ 327లో (సీరియల్ నంబర్ 647) ఓటు వేయాల్సి వచ్చింది. త్వరలో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయన 2 కిలోమీటర్ల దూరం వెళ్లి, ఓటు వేయాల్సిన పరిస్థితి. ఆయన ఉండేది 7వ డివిజన్ కాగా, ఓటు వేయాల్సింది మాత్రం తనకు ఎలాంటి సంబంధం లేని 32వ డివిజన్‌లో. ఇదే కాలనీకి చెందిన కునాడి రాంరెడ్డి (ఇంటి నంబర్ 5–7–189), అల్లెంకి చరణ్‌కుమార్ (ఇంటి నంబర్ 5–7–811)లదీ ఇదే పరిస్థితి. 7వ డివిజన్‌కు చెందినవారి ఓట్లు 28వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఉన్నాయి.'

కరీంనగర్ కార్పొరేషన్: గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారడం తెలిసిందే. ఓటర్లు ఉండేది ఒకచోట, వారి ఓటు మాత్రం మరోచోట ఉంది. కోతిరాంపూర్, కట్టరాంపూర్ తదితర ప్రాంతాల్లోని ఓటర్ల పేర్లు 8, 10 కిలోమీటర్ల దూరంలోని చింతకుంట, కొత్తపల్లిలో పోలింగ్‌బూత్‌లకు మారిన ఉదంతాలు ఉన్నాయి. ఓటర్ల జాబితాను రూపొందించిన అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తగా, 'ఓటు ఎక్కడుంటే ఏంటి.. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే ఉంది కదా..' అనే నిర్లక్ష్యపు సమాధానం అధికారుల నుంచి వస్తోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రాగా, లోక్‌సభ ఎన్నికలకు ముందు జాబితాలో సరిచేస్తామన్న హామీ వచ్చింది. ప్రతీ ఎన్నికలకు ముందు ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల సంఘం ఓవైపు అనేక కార్యక్రమాలు చేపడుతుండగా, పలువురు ఇళ్లకు దూరంగా వెళ్లి, ఓటు వేసే పరిస్థితి ఓటింగ్ శాతంపై ప్రభావం చూపనుంది.

ఒకే ఇంటి నంబర్‌పై 30 ఓట్లు

ఒకే ఇంటి నంబర్‌పై 20 నుంచి 30 ఓట్లు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కావాలనే ఎక్కువ ఓట్లు చేర్చుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఉమ్మడి కుటుంబాలు ఉన్న ఇళ్లలోనూ 10, 15 కన్నా ఎక్కువ ఓట్లు ఉండవు. అలాంటిది ఒకే ఇంటి నంబర్‌పై 21 ఓట్లు, 30 ఓట్ల వరకు కూడా ఉండటంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్నచోట అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఓటర్ల జాబితా సరిచేయాలి



నగరంలో గందరగోళంగా ఉన్న ఓటర్ల జాబితాను అధికారులు వెంటనే సరిచేయాలి. ఉన్న చోట కాకుండా ఎక్కడో దూర ప్రాంతాల్లో ఓట్లు ఎందుకు వేయాలో సమాధానం చెప్పాలి. ఒకే నియోజకవర్గమైనంత మాత్రాన ఎక్కడికైనా వెళ్లి, ఓటు వేయాలంటే ఎలా కుదురుతుంది? లోక్‌సభ ఎన్నికల్లోపు ఎవరి డివిజన్‌లో వారు ఓటు వేసేలా జాబితాను సవరించాలి.

– తోట సాగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ

ఇటు పని.. అటు అభివృద్ధి



బొమ్మకల్ చెరువులో కందకాలు తీస్తున్న కూలీలు

- పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తున్న ఉపాధిహామీ పథకం
- అభివృద్ధిలో పురోగతి సాధిస్తున్న గ్రామాలు
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3.40 కోట్ల పనులకు ప్రణాళికలు
- కరీంనగర్ మండలంలో 6 వేల మంది కూలీలు

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తోంది. ఓవైపు కూలీలకు చేతినిండా పని లభిస్తుండగా మరోవైపు గ్రామాలు అభివృద్ధిలో పురోగతి సాధిస్తున్నాయి. కరీంనగర్ మండలంలో మొత్తం 6 వేల మంది కూలీలుండగా వీరిలో 4,353 మంది మాత్రమే పని చేస్తున్నారు. వచ్చే 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.3.40 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 130 పనులు చేయడం ద్వారా కూలీలకు మొత్తం 1.25 లక్షల పనిదినాలు కల్పించనున్నారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టబోయే అన్ని పనులకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది.

రోజుకు రూ.227..

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2.33 కోట్ల విలువైన 120 పనులకు ఆమోదం లభించింది. కూలీలకు మొత్తం 1.51 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటివరకు 1.48 లక్షలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు మిగతా పని రోజులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో కూలీకి సరాసరి రోజుకు రూ.227 వేతనం లభించింది.

నీటి నిల్వ పనులకు ప్రాధాన్యం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ, నీటి నిల్వ, భూగర్భ జలాలు పెంపొందించే పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో నీటి కుంటలు, కందకాలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, ఎస్సారెస్పీ కాలువల్లో సిల్టు తొలగింపు, పంట కాలువల తవ్వకం పనులు చేపడుతారు. వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణ పనులున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

రైతులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామసభలు నిర్వహించి, ఆయా పల్లెల్లో చేపట్టబోయే పనులను గుర్తించి, ప్రణాళిక రూపొందించాం. రైతులతోపాటు కూలీలకు జీవనోపాధి కల్పించాలన్న ఉద్దేశంతో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇచ్చాం.

– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

గ్యారంటీలపై కాంగ్రెస్ సంబరాలు





కమాన్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేస్తున్న నరేందర్‌రెడ్డి, ఇందిరాచౌక్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలో మరో రెండు గ్యారంటీ పథకాలు అమలు చేయడంపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం నగరంలో సంబరాలు నిర్వహించారు. కమాన్ చౌరస్తాలో మల్లికార్జున శైలజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడంతో మహిళాలోకం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని చంద్రయ్య, కుమార్, సుజాత, పద్మ, లావణ్య, లలిత, రజిత, సరోజన, మంజుల, లక్ష్మి తదితురులు పాల్గొన్నారు.

ఇందిరాచౌక్‌లో..

ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో మరో రెండింటిని ప్రారంభించడంతో కరీంనగర్‌లోని ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచి, సంబరాలు చేసుకున్నారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు మడుపు మోహన్, పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. మంగళవారం బొమ్మకల్ ఫ్లైఓవర్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షహనవాజ్, అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్, నాయకులు ఎస్‌ఏ.మోసిన్, షహబాజ్, రాజు యాదవ్, సందీప్, మహమ్మద్ పాషా, ఇమ్రాన్, ఖలీమ్, జాకీ, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

'హిందుత్వం పేరిట రాజకీయ పబ్బం'

కరీంనగర్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలంగాణ అంబేడ్కర్ సంఘం, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు సముద్రాల అజయ్, మీసాల సాయిలు, విజయ్‌కుమార్‌లు సంయుక్త ప్రకటనలో హెచ్చరించారు. ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్‌లో ఎప్పుడూ కరీంనగర్ ప్రజల గురించి మాట్లాడలేదన్నారు. మత రాజకీయాలు చేస్తూ రాముడు, హిందుత్వం పేరిట రాజకీయ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. మంత్రి ప్రభాకర్ నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్లమెంట్‌లో తెలంగాణవాదాన్ని వినిపించారని పేర్కొన్నారు. ఎంపీ సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే..

ఎంపీ బండి సంజయ్ యువతను రెచ్చగొట్టడం, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఫహాద్ ఆరోపించారు. ఎంపీగా ఆయన వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని పేర్కొన్నారు. మంత్రికి, హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి 'పొన్నం'పై అనుచిత వ్యాఖ్యలు తగవు

విద్యానగర్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవని, ఎంపీ బండి సంజయ్ నోటి దురుసు మానుకోవాలని కాంగ్రెస్ నాయకుడు మంద నగేశ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో నోరు విప్పని ఎంపీ గల్లీలో ఇలాంటి మాటలు మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీ మంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఆయన స్థాయికి తగదన్నారు. హిందూ ధర్మం పేరు చెప్పుకుంటూ మంత్రిని తల్లికి పుట్టిన అని మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ఎంపీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోహన్ చారి, బొమ్మ ఈశ్వర్ గౌడ్, గడ్డం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో ఏ1 అరెస్టు

కొత్తపల్లి: భూ ఆక్రమణ కేసులో కరీంనగర్‌లోని జ్యోతినగర్(సొంతూరు గుండి)కు చెందిన చిట్యాల కిష్టమ్మను మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో ఆమె ఏ1గా ఉన్నారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ప్రతిభ



కరీంనగర్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 25న బ్రూస్‌లీ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు నిర్వహించారు. నగరంలోని కోరా జాన్సన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.మనస్విని కాంస్య, అనన్య రజత పతకాలు సాధించారు. వారిని పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్ రెడ్డి మంగళవారం అభినందించారు.

ప్రతిమ మల్టీప్లెక్స్ లీజు రద్దు చేయాలి

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని గతంలో కొందరు నాయకులు అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి, 99 ఏళ్ల అక్రమంగా లీజుకు తీసుకున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. దాన్ని రద్దు చేసి, భవనాలను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో ఆర్టీసీకి సంబంధించిన కోట్ల రూపాయల విలువైన భూమిని అప్పనంగా ప్రతిమ మల్టీప్లెక్స్ యాజమాన్యం లీజుకు తీసుకుందని, దీన్ని రద్దు చేయాలన్నారు. స్థానికుడైన పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్నారని, సమీక్ష జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే యాత్ర

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ



మాట్లాడుతున్న జయశ్రీ, పక్కన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకుంటూ బీజేపీ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులుసంపత్‌రావ్, భాస్కరాచారి, అసెంబ్లీ కన్వీనర్ జగన్ రెడ్డి, మాజీ జడ్పీటీసి జోగిరెడ్డి,మాజీ ఎంపీపి రాములు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమురయ్య,జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి,తిమ్మాపూర్, మానకొండూర్,ఇల్లంతకుంట, బెజ్జంకి, హుజురాబాద్, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు జగదీశ్వరాచారి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రాజు, తిరుపతి రెడ్డి వివిధ మండలాలకు చెందిన శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాహిత యాత్ర విజయవంతం చేయండి

మానకొండూర్: మార్చి 2న మండలంలో జరిగే ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి కార్యకర్తలను కోరారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో లాబర్తి సంపర్క్ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. మండలంలో కేంద్ర ప్రభుత్వం పథకాల లబ్ధిదారులు ఏడువేల మంది ఉన్నారని, రెండో విడత ప్రజాహితలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు మార్కొండ రమేశ్‌పటేల్, వెల్మారెడ్డి రాజేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, సొన్నాకుల శ్రీనివాస్, బాషబోయిన ప్రదీప్‌యాదవ్, మీస రమణయ్య, కోల శ్రీనివాస్, దొంగల శ్రీదర్, ఆదిమూలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ ఏకగ్రీవం



చైర్మన్‌గా తిరుపతితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి జమునారాణి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్‌గా తోట తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్ స్థానానికి ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి జమునారాణి ప్రకటించారు. ఏడాది క్రితం చైర్మన్ బల్మూరి ఆనందరావు మృతిచెందగా వైస్ చైర్మన్ గోనె నర్సయ్య ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయడంతో ఈ నెల 24 నుంచి 10 మంది డైరెక్టర్లతో బీఆర్‌ఎస్ నాయకులు క్యాంప్ నిర్వహించారు. ఇందులో మెజార్టీ డైరెక్టర్లు చైర్మన్‌గా తోట తిరుపతివైపు మొగ్గు చూపడంతో ఇన్‌చార్జి చైర్మన్ నర్సయ్య పోటీ నుంచి తప్పుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు డైరెక్టర్లు క్యాంప్ నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్‌గా ఎన్నికైన తిరుపతితో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయనను డైరెక్టర్లతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు.

రాష్ట్రంలో దొరల పాలన పోయింది

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దొరలపాలన పోయిందని, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలించే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో పాలన చేస్తామన్నారు. దొరల పాలనలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కరువైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే విగ్రహం ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో గూడ కనకయ్య, సిరిసిల్ల చంద్రయ్య, సిరిసిల్ల నరసయ్య, కుంభాల లింగయ్య, అంబేడ్కర్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీటీసీ..

కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కరీంనగర్ డీటీసీగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిసినట్లు ఆయన తెలిపారు. డీటీసీ వెంట ఎంవీఐలు శ్రీకాంత్ చక్రవర్తి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం సరిగా వినియోగించాలి

హుజూరాబాద్‌రూరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సరిగా వినియోగిస్తే అదుభత ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భౌతికశాస్త్ర అధ్యాపకుడు జి.మనోజ్ కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంకిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్సి–22, పాపులర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వినియోగిస్తున్న మొబైల్‌లోనే అన్ని రకాల అప్లికేషన్స్ అందుబాటులో ఉన్నాయని, ఏఐ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని మార్పులు జరిగే ఆస్కారం ఉందన్నారు. టెక్నాలజీని సరైన విధానంలో ఉపయోగించటంలో విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను స్పెక్ట్రోస్కోపీ ఆర్టీసీ ఇంటెలిజెన్సీ సహాయంతో వేరువేరుగా విభజించి రీసైకిల్ చేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ విద్యకు పునాది వేసిన సి.వి.రామన్ అప్పుడు అందుబాటులో ఉన్న పరిమితమైన విజ్ఞాన వనరులు, పరికరాలతో అద్భుతమైన ఫలితాలు సాధించారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ వి.రాజేశ్వరరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి డీన్ డాక్టర్ ఎంవీ సతీష్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు చేశామని సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ, పాత సత్యం, మేడిపల్లి మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. పలువురికి ఆయా సర్వే నంబర్లలోని భూమిని కేటాయించగా మిగులు విలువైన భూములు నుంచి వ్యక్తిగతంగా లబ్ధి పొందేందుకు స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు రాజకీయ ప్రోద్బలంతో ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తూ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహకారంతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, అనుమతులు మంజూరు చేయిస్తూ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాలని హుజూరాబాద్ ఆర్డీవో, జమ్మికుంట తహసీల్దార్‌లకు సూచించారని తెలిపారు.



ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ అరుంధతికి జరిమానా

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ అరుంధతి రెడ్డి మ్యాచ్ ఫీజులో కోత విధించారు. సోమవారం యూపీ వారియర్స్‌తో మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటర్ పూనమ్ వికెట్ తీసిన సంబరంలో అరుంధతి అతిగా స్పందించింది. ఆ బ్యాటర్‌ను గేలి చేసేలా అనుచితంగా ప్రవర్తించింది. దీనిపై సమీక్షించిన మ్యాచ్ రిఫరీ వర్ష నాగ్రే డబ్ల్యూపీఎల్ నియమావళి ప్రకారం ఆమెపై చర్యలు తీసుకుంది. ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించింది. ఈ మ్యాచ్‌లో క్యాపిటల్స్ తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి లీగ్‌లో బోణీ కొట్టింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ



దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ 89 నిమిషాల్లో 6-7 (6/8), 6-3, 10-8తో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)-మనారినో (ఫ్రాన్స్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో ఆడుతున్న యూకీ-హాస్ జంట ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.



అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన నమీబియా బ్యాటర్ జాన్ నికోల్

కీర్తిపూర్ (నేపాల్): ధనాధన్ ఆటతో అదరగొట్టిన నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్... అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. మూడు దేశాల టి20 టోర్నీలో భాగంగా మంగళవారం నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో జాన్ నికోల్ 36 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లతో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. 22 ఏళ్ల జాన్ నికోల్ కేవలం 33 బంతుల్లో సెంచరీ మైలురాయి దాటాడు. ఇందులో 92 పరుగులు ఫోర్లు, సిక్సర్ల ద్వారానే రావడం విశేషం. గత ఏడాది ఆసియా క్రీడల సందర్భంగా మంగోలియాతో జరిగిన టి20 మ్యాచ్‌లో నేపాల్ ప్లేయర్ కుశాల్ మల్లా 34 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ రికార్డును జాన్ నికోల్ బద్దలుకొట్టాడు. నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ముందుగా నమీబియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. అనంతరం నేపాల్ 18.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. జాన్ నికోల్ 29 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

రన్నరప్ భారత్



అలాన్యా: టర్కిష్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. నాలుగు దేశాల మధ్య లీగ్ ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరిగింది. కొసోవో జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0-1 గోల్‌తో ఓడిపోయింది. ఈ టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన కొసోవో 9 పాయింట్లతో విజేతగా నిలువగా... 6 పాయింట్లతో భారత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ భారత జట్టుకు ఆడి హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక గోల్ కూడా చేసింది.

బెంగళూరు ధనాధన్...

- 12.3 ఓవర్లలోనే విజయం
- మెరిసిన స్మృతి, మేఘన, రేణుక
- మళ్లీ ఓడిన గుజరాత్ జెయింట్స్


మేఘన


స్మృతి

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ధనాధన్ ఆటతీరుతో వరుసగా రెండో విజయాన్ని సాధించింది. మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. 7.3 ఓవర్లు మిగిలుండగానే స్మృతి మంధాన బృందం లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 107 పరుగులే చేసింది. ఓపెనర్ హర్లీన్ డియోల్ (31 బంతుల్లో 22; 3 ఫోర్లు), హేమలత (25 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుక సింగ్ (2/14) స్వింగ్ బౌలింగ్‌కు మేటి బ్యాటర్లు బెత్ మూనీ (8), లిచ్‌ఫీల్డ్ (5) తలవంచారు. వేద కృష్ణమూర్తి (9), ఆష్లే గార్డ్‌నర్ (7)లు కూడా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ సోఫీ మోలినెక్స్ (3/25) గుజరాత్‌ను కోలుకోని విధంగా దెబ్బతీసింది. ఆర్‌సీబీ ఏకంగా ఏడుగురు బౌలర్లను ప్రయోగించింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని బెంగళూరు 12.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (27 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగింది. సహచర ఓపెనర్ సోఫీ డివైన్ (6) ఆరంభంలోనే నిష్క్రమించినా... వన్‌డౌన్ బ్యాటర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి సబ్బినేని మేఘన (28 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి చకాచకా పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో తనూజ (1/20) స్మృతి వేగానికి కళ్లెం వేసింది. అయితే మేఘన, ఎలీస్ పెరీ (14 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు) మరో వికెట్ పడకుండా తమ కెప్టెన్‌లాగే ధనాధన్ ఆటతీరును కొనసాగించారు. దాంతో 13వ ఓవర్ పూర్తికాకముందే బెంగళూరు విజయతీరాలకు చేరుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.


తుషార్ తనుష్

'శత'క్కొట్టిన తనుష్, తుషార్

పదో వికెట్‌కు 232 పరుగుల భాగస్వామ్యం ● రంజీ ట్రోఫీ సెమీస్‌లో ముంబై

ముంబై: బరోడా, ముంబై జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో అద్భుతం చోటు చేసుకుంది. ముంబై జట్టుకు చెందిన చివరి వరుస బ్యాటర్లు తనుష్ కొటియన్ (129 బంతుల్లో 120 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), తుషార్ దేశ్‌పాండే (129 బంతుల్లో 123; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతకాలతో అదరగొట్టారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు జరిగే మ్యాచ్‌లు) ఒకే ఇన్నింగ్స్‌లో పదో నంబర్, పదకొండో నంబర్ బ్యాటర్లిద్దరూ సెంచరీలు చేయడం కేవలం ఇది రెండోసారికాగా, రంజీ ట్రోఫీలో మాత్రం తొలిసారి. 1946లో ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా సర్రే కౌంటీ జట్టుతో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున పదో నంబర్ ప్లేయర్ చందూ సర్వాతే (124 నాటౌట్), పదకొండో నంబర్ ప్లేయర్ శుతె బెనర్జీ (121) సెంచరీలు చేశారు.

బరోడాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఓవర్‌నైట్ స్కోరు 379/9తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 132 ఓవర్లలో 569 పరుగులకు ఆలౌటైంది. తనుష్, తుషార్ సెంచరీలు చేయడంతోపాటు పదో వికెట్‌కు 232 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఒక పరుగు తేడాతో రంజీ రికార్డును సమం చేసే అవకాశం కోల్పోయారు. 1992 రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ముంబైతో జరిగిన మ్యాచ్‌లో అజయ్ శర్మ-మణీందర్ సింగ్ పదో వికెట్‌కు 233 పరుగులు జత చేశారు. ముంబై నిర్దేశించిన 606 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బరోడా రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. మ్యాచ్‌లో ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో టీ సెషన్ తర్వాత రెండు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై జట్టు సెమీఫైనల్ చేరుకుంది.

విదర్భ విజయం

నాగ్‌పూర్‌లో కర్ణాటకతో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో విదర్భ 127 పరుగుల తేడాతో గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. విదర్భ నిర్దేశించిన 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక 62.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. విదర్భ బౌలర్లు హర్ష్ దూబే (4/65), ఆదిత్య సర్వాతే (4/78) కర్ణాటకను దెబ్బ తీశారు. మార్చి 2 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో విదర్భ; తమిళనాడుతో ముంబై తలపడతాయి.

నీల్ వాగ్నర్ వీడ్కోలు



వెలింగ్టన్: న్యూజిలాండ్ ఎడం చేతి వాటం పేస్ బౌలర్ నీల్ వాగ్నర్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. దక్షిణాఫ్రికాలో పుట్టి 2008 నుంచి న్యూజిలాండ్‌లో స్థిరపడిన వాగ్నర్ 2012లో తొలి టెస్టు ఆడాడు. టెస్టుల్లో బౌలింగ్ ఓపెనింగ్ చేయకుండా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా 37 ఏళ్ల వాగ్నర్ గుర్తింపు పొందాడు. కేవలం టెస్టు ఫార్మాట్‌లోనే న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన వాగ్నర్ మొత్తం 64 టెస్టులు ఆడి 260 వికెట్లు పడగొట్టాడు. ఇన్నింగ్స్‌లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తొమ్మిది సార్లు, ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు 13సార్లు తీసిన వాగ్నర్ 2022లో న్యూజిలాండ్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు.

షమీకి శస్త్రచికిత్స

న్యూఢిల్లీ: భారత సీనియర్ సీమర్ మొహమ్మద్ షమీ ఎడమ కాలి మడమకు లండన్‌లో శస్త్రచికిత్స జరిగింది. దీంతో వచ్చేనెలలో ప్రారంభమయ్యే ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా అతను దూరమయ్యాడు. జూన్‌లో జరిగే టి20 ప్రపంచకప్ కల్లా అతను కోలుకుంటాడని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. 33 ఏళ్ల పేసర్ చివరిసారిగా గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో బరిలోకి దిగాడు. 'ఆపరేషన్ సక్సెస్ అయింది. కోలుకునేందుకు కాస్త సమయం పడుతుంది. త్వరగా కోలుకొని నడవాలనుంది' అని షమీ 'ఎక్స్'లో ట్వీట్ చేశాడు. షమీ వేగంగా కోలుకోవాలని ఎప్పట్లాగే కెరీర్‌ను కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌లో ఆకాంక్షించారు.



హాకీ ఇండియా సీఈఓ ఎలీనా రాజీనామా



న్యూఢిల్లీ: హాకీ ఇండియా (హెచ్‌ఐ)లో మరో కుదుపు! 13 ఏళ్లుగా హాకీ ఇండియాకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా వ్యవహరిస్తున్న ఎలీనా నార్మన్ రాజీనామా చేసింది. ఇటీవలే మహిళల జట్టు చీఫ్ కోచ్ యానిక్ షాప్‌మన్ కూడా రాజీనామా చేసింది. 'భారత హాకీలోని రెండు గ్రూపుల మధ్య విబేధాలతో గురుతర బాధ్యతలు నిర్వర్తించడం చాలా కష్టం. మూడు నెలలుగా జీతం నిలిపి వేశారు. సంప్రదింపులు, సముదాయింపుతో గతవారం పూర్తిగా జీతం చెల్లించారు' అని 49 ఏళ్ల ఎలీనా వివరించారు. 2011లో సీఈఓగా నియమితులైన ఎలీనా హయాంలోనే భారత్‌లో రెండు పురుషుల ప్రపంచకప్‌లు (2018, 2023), రెండు జూనియర్ పురుషుల ప్రపంచకప్‌లు (2016, 2021) విజయవంతంగా నిర్వహించారు.

గాయత్రి-ట్రెసా జోడీ గెలుపు



బెర్లిన్: జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడి శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 18-21, 21-11, 21-13తో సు యిన్ హుయ్-లిన్ జి యు (చైనీస్ తైపీ) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.


సినిమా

నయా కాంబినేషన్


● రజనీకాంత్, సాజిద్ నడియాడ్‌వాలా

రజనీకాంత్ ఇప్పటివరకూ దక్షిణ, ఉత్తరాది, హాలీవుడ్ మూవీ (బ్లడ్ స్టోన్) కలుపుకుని దాదాపు 170 చిత్రాల్లో నటించారు. ఇన్ని సినిమాలు చేసిన ఆయన గత కొన్నేళ్లుగా హిందీ నిర్మాతలతో సినిమాలు చేసింది లేదు. ఇప్పుడు అగ్రనిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాతో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హిందీలో 'హౌస్‌ఫుల్ సిరీస్, 2 స్టేట్స్, హీరో పంతి, కిక్, సూపర్ 30, ఛిఛోరే, 83' తదితర చిత్రాలతో పాటు రీసెంట్ హిట్ 'సత్య ప్రేమ్ కీ కథ' చిత్రం నిర్మించారు సాజిద్ నడియాడ్‌వాలా. 'హౌస్‌ఫుల్, హౌస్‌ఫుల్ 2, కిక్' వంటి చిత్రాలకు దర్శకుడు కూడా. ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్-సాజిద్‌ల నయా కాంబినేషన్ సెట్ అయింది. ''ఒక లెజెండరీ నటుడితో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను'' అని సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు సాజిద్. కాగా ఇది హిందీ చిత్రమా లేక పాన్ ఇండియన్ ప్రాజెక్టా? ఈ చిత్రానికి దర్శకుడు ఎవరు? వంటి విషయాలను సాజిద్ స్పష్టం చేయలేదు.

మహేశ్ సినిమాకి అతిథిగా...?


● జేమ్స్ కామెరూన్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో దర్శకుడు రాజమౌళికి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. పైగా ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు ('నాటు నాటు..' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డు) కూడా సాధించడంతో హాలీవుడ్ ప్రముఖుల దృష్టిలో పడ్డారు రాజమౌళి. 'టైటానిక్, అవతార్'లాంటి అద్భుత చిత్రాల సృష్టికర్త జేమ్స్ కామెరూన్ అయితే 'ఆర్ఆర్ఆర్'ని, రాజమౌళి మేకింగ్‌ని ప్రశంసించారు కూడా. రాజమౌళిలోని మేకర్ అంటే కామెరూన్‌కి మంచి అభిమానం ఏర్పడిందని ఆయన మాటలు స్పష్టం చేశాయి. ఆ అభిమానంతోనే రాజమౌళి ఆహ్వానానికి కామెరూన్ పచ్చజెండా ఊపారని టాక్. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రపంచ దేశాల్లోని పలు భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. బడ్జెట్ రూ. వెయ్యి కోట్లు అని భోగట్టా. ఇంత భారీ చిత్రం కాబట్టే ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కామెరూన్‌ని ఆహ్వానించారని టాక్. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి కావచ్చిన నేపథ్యంలో త్వరలో సినిమాని ఆరంభించాలనుకుంటున్నారట. సో.. వార్తల్లో ఉన్న ప్రకారం కామెరూన్‌ని రాజమౌళి ఆహ్వానించారా లేదా అనేది త్వరలోనే తెలిసిపోతుంది.



''ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్‌లో ఒక ఫ్లైట్ సిమ్యులేటర్‌లో నన్ను కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతిని ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే నిజంగా విమానం నడిపినట్లే ఉంటుంది. ముఖానికి ఆక్సిజన్ మాస్క్, తలకు హెల్మెట్ ఉండటంతో కళ్లతోనే భావోద్వేగాలు పలికించాలి. ఇలాంటి పాత్రలు చేయడం ఒక సవాల్‌గా అనిపించింది'' అన్నారు వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్‌పై ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ చెప్పిన విశేషాలు.

ప్రతి భారతీయుడు కనెక్ట్ అయ్యే సినిమా ఇది

- వరుణ్ తేజ్

'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రీకరణ అక్టోబర్‌లో పూర్తయింది. ఆ తర్వాత బ్రేక్ తీసుకుని నవంబరులో లావణ్యా త్రిపాఠిని పెళ్లి చేసుకున్నాను. ఈ సినిమా కోసం హిందీ డైలాగులు నేర్చుకుంటున్నప్పుడు తను కూడా సాయం చేసింది. మా ఇద్దరికీ సరిపడే పాత్రలు ఉంటే కచ్చితంగా మళ్లీ జోడీగా నటిస్తాం (గతంలో 'మిస్టర్', 'అంతరిక్షం' సినిమాలు చేశారు).. అంతేకానీ, ఏదో మేమిద్దరం కలిసి చేసేయాలనే ఉద్దేశంతో మాత్రం చేయం.

● 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రకథని శక్తి ప్రతాప్ సింగ్ 2020లో చెప్పాడు.. వినగానే నచ్చింది. శక్తి హిందీ అబ్బాయి అయినప్పటికీ ఈ సినిమాని తెలుగులోనే చేయాలని అనుకున్నాడు. నేను సోనీ పిక్చర్స్ వారితో ఓ సినిమా చేయాల్సి ఉండటంతో ఈ చిత్రకథను వారికి పంపించాను. నేషనల్ అప్పీల్ కంటెంట్ ఉన్న ఈ కథ సోనీ పిక్చర్స్ వారికి కూడా బాగా నచ్చడంతో హిందీలో కూడా చేయాలని నిర్ణయించాం. ద్విభాషా చిత్రంగా రూపొందిన ఈ మూవీలోని ప్రతి సీన్‌ని తెలుగు, హిందీ భాషల్లో చిత్రీకరించాం. ● 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రంలో రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని చాలా అద్భుతంగా డిజైన్ చేశాడు శక్తి ప్రతాప్. నా పాత్రతో అందరూ చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా కోసం శక్తి చాలా పరిశోధన చేశాడు. తనకి వీఎఫ్ఎక్స్‌పై కూడా మంచి పట్టు ఉంది. ● 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో 40మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఓ ఆపరేషన్ నిర్వహించి, శత్రువులకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. ఫిబ్రవరి 14న ప్రపంచమంతా వాలెంటైన్స్ డే జరుపుకుంటుంది. అయితే ఫిబ్రవరి 14న ఈ ఘటన జరిగింది కాబట్టి మా సినిమాకి 'ఆపరేషన్ వాలెంటైన్' టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో వాలెంటైన్ అంటే ప్రతి ఒక్కరికీ దేశం మీద ఉన్న ప్రేమ అని అర్థం. మా సినిమా చూసిన ఎయిర్ ఫోర్స్ అధికారులు పుల్వామా ఘటనపై ఇప్పటి వరకూ వచ్చిన సినిమాల్లో 'ఆపరేషన్ వాలెంటైన్' ది బెస్ట్ అని ప్రశంసించారు. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ● 'ఆపరేషన్ వాలెంటైన్'ని తెలుగు, హిందీ భాషల్లో చేశాం. హిందీలో డైలాగులు చెప్పేందుకు రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. హిందీలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పాను. ఇక ప్రస్తుతం 'మట్కా' సినిమా చేస్తున్నాను.

కథ వినగానే ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లా!

- 'దిల్' రాజు


● 'దిల్' రాజు, వైష్ణవీ చైతన్య, అరుణ్ భీమవరపు

''లవ్ మీ' కథ వినగానే ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లా. 'ఆర్య' కథ విన్నప్పుడు ఎలా ఎగ్జైట్ అయ్యానో 'లవ్ మీ' స్క్రిప్ట్ విన్నాక అలాగే ఎగ్జైట్ అయ్యాను. ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రాబట్టుకుంటుందని నమ్మకంగా ఉంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యూ డేర్' అనేది ఉపశీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేసి, సినిమాని ఏప్రిల్ 27న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''లవ్ మీ' కథ నచ్చి, సంగీత దర్శకుడు కీరవాణిగారు, కెమెరామేన్ పీసీ శ్రీరామ్‌గారు ఈ మూవీకి పని చేశారు. వైష్ణవి ఈ స్క్రిప్ట్ చదివి ఎగ్జైట్ అయింది. ఆశిష్‌కి చక్కగా సరిపోయే కథ ఇది. తొలి సినిమా 'బలగం'తో హిట్ అందుకున్న హర్షిత్, హన్షిత 'లవ్ మీ'తోనూ విజయం అందుకోవాలి'' అన్నారు. ''మా సినిమా చూసిన ప్రేక్షకులు కొత్త అనుభూతితో బయటకు వస్తారు'' అన్నారు వైష్ణవీ చైతన్య. అరుణ్ భీమవరపు, హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి పాల్గొన్నారు.


● రష్మిక

అది చాలా నిజం!

- వీడీలాంటి భర్త కావాలి

''రష్మికా మందన్నాకి భర్తగా రావాలంటే అతనికి ఏయే లక్షణాలు ఉండాలి? ఆమె నేషనల్ క్రష్ కాబట్టి ఆమె భర్త ప్రత్యేకంగా ఉండాలి. చెప్పాలంటే ఆమె భర్త వీడీలా ఉండాలి.. అంటే 'వెరీ డేరింగ్'.. ఆమెను చక్కగా చూసుకోవాలి. మేం ఆమెను రాణి అని పిలుస్తాం. ఆమె భర్త రాజులా ఉండాలి'' అంటూ సోషల్ మీడియా వేదికగా రష్మికా మందన్నా అభిమాని షేర్ చేశాడు. ఆ పోస్ట్‌కి 'అది.. చాలా నిజం' అని రష్మిక స్పందించడం హాట్ టాపిక్ అయింది. అంటే.. ఆ అభిమాని పేర్కొన్నట్లు తనకు వీడీలాంటి భర్త కావాలని ఈ బ్యూటీ స్పష్టం చేశారు. ఇక.. 'వీడీ' అంటే విజయ్ దేవరకొండ అంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ విధంగా ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

హారర్ వార్డ్

గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భవానీ వార్డ్'. జీడీ నరసింహ దర్శకత్వం వహించారు. సాయి సతీష్, 'జబర్దస్త్' అప్పారావు, ఈశ్వర్ బాబు ధూళిపూడి కీలక పాత్రలు చేశారు. కల్యాణ్ చక్రవర్తి, చంద్రకాంత్ సోలంకి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. జీడీ నరసింహ మాట్లాడుతూ– ''హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'భవానీ వార్డ్'. అందరికీ నచ్చేలా ఈ మూవీ తీశాను. మరీ ముఖ్యంగా హారర్ సినిమాలను ఇష్టపడే వారికి బాగా నచ్చుతుంది'' అన్నారు. ''నరసింహ చెప్పిన కథ నాకు చాలా నచ్చి, ఈ సినిమా నిర్మించాను'' అన్నారు కల్యాణ్ చక్రవర్తి.


● గణేశ్, గాయత్రి

వినోదాలు పంచే చారి


● అదితీ సోని, కీర్తికుమార్, సంయుక్త

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ– ''నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది'' అన్నారు. ''మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్'' అన్నారు టీజీ కీర్తికుమార్. ''ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూడు నెలల సమయం తీసుకున్నాను'' అన్నారు రామజోగయ్య శాస్త్రి. ''తెలుగులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్'' అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ''ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉంది'' అన్నారు సైమన్ కె. కింగ్.

అనుమానం అక్కర్లేదు

- శ్రీవిష్ణు


● రాహుల్, శ్రీవిష్ణు, సునీల్ బలుసు, ప్రియదర్శి, అయేషా

''గుప్త నిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు ఏం చేశారు? అనే నేపథ్యంలో 'ఓం భీమ్ బుష్' ఆసక్తిగా ఉంటుంది. మా పాత్రలకు (శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి) ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. రెండు గంటల పాటు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతారు.. ఆ విషయంలో అనుమానం అక్కర్లేదు'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ లీడ్ రోల్స్‌లో యూవీ క్రియేషన్స్ సమర్పణలో వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ సినిమా మార్చి 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ– ''టీజర్ అందరికీ నచ్చడం హ్యాపీగా ఉంది. సినిమా ఇంకా అద్భుతంగా ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమా కోసం ఏడాదిన్నర కష్టపడ్డాం. మా కష్టానికి తగ్గ ఫలితం దక్కాలంటే ప్రేక్షకులు చూడాలి'' అన్నారు రాహుల్ రామకృష్ణ. ''మా సినిమాని అందరూ చూడాలి'' అన్నారు శ్రీహర్ష కొనుగంటి.

సాక్షి బిజినెస్
బుధవారం
28-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
305 ▲	76 ▲
73,095	22,198

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,997	▲	21
డోజోన్స్	38,903	▽	166
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,686	▽	1
డాక్స్	17,556	▲	133
షాంఘై	3,015	▲	133
నికాయ్	39,240	▲	6

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,271
బంగారం (99.5 స్వచ్ఛత)	62,022
వెండి (కేజీ)	69,902

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	83.50
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.94	106.51
€	యూరో	ఒకటి	88.89	91.24
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.53	55.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.26	55.17
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.38	64.06
SAR	సౌదీ రియాల్	పదిరూపాయలు	21.09	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	పదిరూపాయలు	21.62	23.46
¥	చైనా యువాన్	పదిరూపాయలు	10.38	12.47

తుది దశకు చైనా రుణ యాప్‌లపై దర్యాప్తు

కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు ఎదుర్కొంటున్న పలు చైనా కంపెనీలపై, ముఖ్యంగా రుణ యాప్‌లతో లింకులున్న సంస్థలపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ విచారణ జరుపుతోంది. వీటిలో కొన్ని కేసుల్లో దర్యాప్తు తుది దశలో ఉందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆయా కంపెనీల్లో మోసాలేమైనా జరిగాయా అనే కోణంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. కొన్నింటిపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐవో) విచారణ జరుపుతున్నట్లు వివరించారు. అక్రమంగా రుణ యాప్‌లను నిర్వహిస్తున్న కంపెనీలపై, అసలైన లబ్ధిదారు వివరాలను దాచి పెట్టే వ్యక్తులు, సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ .. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ, ఆర్‌బీఐ మొదలైన వాటి నుంచి వచ్చిన ఫిర్యాదులపై సదరు సంస్థలపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారి చెప్పారు. కొన్ని కంపెనీల నిధుల మూలాలను కనుగొనడం కష్టమే అయినప్పటికీ, నిర్దిష్టంగా లబ్ధి పొందే యాజమాన్య సంస్థను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్-ఆర్‌క్యాప్ ప్రణాళికకు ఓకే..

బ్యాంకులకు 63 % హెయిర్‌కట్

ముంబై: రుణభారంతో కుంగిన రిలయన్స్ క్యాపిటల్‌కి సంబంధించి హిందుజా-ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ ప్రతిపాదించిన రూ. 9,650 కోట్ల పరిష్కార ప్రణాళికకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం కంపెనీ రుణదాతలు భారీగా 63% రుణాలను వదులుకోవాల్సి వస్తుంది. అలాగే, ప్రణాళిక అమల్లో భాగంగా ఆర్‌క్యాప్ షేర్లను ఇండస్‌ఇండ్‌కు బదలాయించాక, దాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి తొలగిస్తారు. మొత్తం రూ. 38,526 కోట్ల రుణాల క్లెయిమ్‌లకు గాను ఎన్‌సీఎల్‌టీ రూ. 26,086 కోట్ల క్లెయిమ్‌లనే అనుమతించింది. కానీ, 2023 జూన్‌లో బిడ్ వేసిన ఇండస్‌ఇండ్ అందులో రూ. 9,661 కోట్లు (37%) కడతానని ప్రతిపాదించింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ చెవి రింగుల సంబరాలు

హైదరాబాద్: ప్రతిష్టాత్మక జీఆర్‌టీ జ్యువెలర్స్ చెవి రింగుల సంబరాలు నిర్వహిస్తోంది. కస్టమర్ల వ్యక్తిగత శైలికి పెద్దపీట వేస్తూ, క్లాసిక్ డిజైన్ల నుంచి సమకాలీన ట్రెండ్‌ల వరకు చేతితో తయారు చేసిన చెవిరింగులను అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా పాత బంగారు ఆభరణాల మారకంపై గ్రాముకు అదనంగా రూ.50లు, కొత్త బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50లు తగ్గింపు ఆఫర్ ప్రకటించింది. చెవిరింగుల సంబరాలతో అద్భుతమైన చెవిపోగుల సేకరణను ఆవిష్కరించడానికి సంతోషిస్తున్నామని సంస్థ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. సౌందర్యం, ఆకర్షణ కలబోసిన గొప్ప వేడుకకు ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు మరో ఎండీ రాధాకృష్ణన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-2-2024	
విశాఖ	500-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
27-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

ఆటో, ఐటీ షేర్ల జోరు



- నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు
- సెన్సెక్స్ లాభం 305 పాయింట్లు
- 76 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు రెండు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఆటో షేర్లు రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ర్యాలీ కలిసిరావడంతో మంగళవారం అరశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 305 పాయింట్లు పెరిగి 73,095 వద్ద నిలిచింది. నిఫ్టీ 76 పాయింట్లు బలపడి 22,200 స్థాయి చేరువలో 22,198 వద్ద స్థిరపడింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ప్రథమార్ధంలో నష్టాలతో ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి ఐటీ, ఆటో, మెటల్, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకుల షేర్లు రాణించడంతో నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 371 పాయింట్లు దూసుకెళ్లి 73,161 వద్ద, నిఫ్టీ 96 **పాయింట్లు పెరిగి 22,218 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. కమోడిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలీ కమ్యూనికేషన్, యుటిలిటీ, ఇంధన షేర్లు అమ్మకాల** ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.25 %, 0.10 % నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,509 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,861 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి. కాగా పేటీఎం షేరు ఆరంభ లాభాలు నిలుపుకోలేకపోయింది. ఇంట్రాడేలో 5% ఎగసి రూ.449 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. అయితే ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమైంది. చివరికి 0.11% నష్టపోయి రూ. 427.50 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో రూ.449 వద్ద గరిష్టాన్ని, రూ.413.55 వద్ద కనిష్టాన్ని తాకింది. టీసీఎస్ షేరు 2.50% ర్యాలీ చేసి రూ.4103 వద్ద ముగిసింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ ఈ షేరు **రేటింగ్‌ను 'న్యూట్రల్' నుంచి 'బై'కు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు టార్గెట్ ధరను రూ.4,000 నుంచి రూ.4,700కు పెంచింది. ట్రేడింగ్‌లో 3.25% పెరిగి రూ.4,125 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.**

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతాయ్

కార్పొరేట్లపై సీతారామన్ విశ్వాసం



సదస్సులో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు గ్రీన్ సర్టిఫికెట్ అందిస్తున్న ఫిక్కీ ప్రెసిడెంట్ అనీష్ షా

న్యూఢిల్లీ: కార్పొరేట్ ప్రపంచం దేశాభివృద్ధి లక్ష్యాలతో మమేకం అవుతుందన్న విశ్వాసమున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తద్వారా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించడంలో భాగస్వాములవుతాయని తెలియజేశారు. వెరసి శత వసంత స్వాతంత్ర్య దినోత్సవ (2047) సమయానికల్లా వికసిత్ భారత్‌గా ఆవిర్భవించే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ భారత్‌ను అందించే బాటలో ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్‌ను సాధించేందుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ @ 2047: వికసిత్ భారత్–ఇండస్ట్రీ' పేరుతో ఫిక్కీ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. 2047కల్లా లక్ష్యాలను సాధించడంలో పారిశ్రామిక రంగం పాత్ర కీలకమన్నారు.

నవభారతానికి స్టార్టప్‌లే వెన్నెముక: గోయల్



న్యూఢిల్లీ: నవభారత నిర్మాణానికి అంకుర సంస్థలే వెన్నెముకలాంటివని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2047 నాటికి 35 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదిగే క్రమంలో దేశం అందించే అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఏ ఒక్కదాన్ని చేజార్చుకోవద్దని **స్టార్టప్‌లకు సూచించారు. స్టార్టప్ మహాకుంభ్ కర్టెన్ రైజర్** కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. దేశాభివృద్ధిలో కీలకమైన స్టార్టప్ విప్లవానికి వచ్చే నెల 18 నుంచి మూడు రోజులు జరిగే మహాకుంభ్ దర్పణంగా నిలుస్తుందని గోయల్ చెప్పారు. దేశీయంగా మనకు అతి పెద్ద మార్కెట్ ఉంది కదా అని నింపాదిగా ఉండకూడదని, అంతర్జాతీయ మార్కెట్లలోనూ కార్యకలాపాలను విస్తరించడంపై అంకుర సంస్థలు మరింతగా దృష్టి పెట్టాలని మంత్రి చెప్పారు. ఎంట్రప్రెన్యూర్ షిప్, ఆవిష్కరణలపై ఆసక్తి గల విద్యార్థులు ఈ సదస్సులో పెద్ద ఎత్తున **పాల్గొంటారని ఈ సందర్భంగా తెలిపారు.**

మారుతీ సుజుకీ డీలర్లకు యూనియన్ బ్యాంక్ రుణం



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తాజాగా యూనియన్ బ్యాంక్‌తో ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా మారుతీ సుజుకీ డీలర్లకు యూనియన్ బ్యాంక్ రుణ సాయం చేస్తుంది. దేశ వ్యాప్తంగా 4,000 పైచిలుకు మారుతీ విక్రయశాలల్లో వాహనాల నిల్వకు కావాల్సిన నిధుల సమీకరణ అవకాశాలను ఈ భాగస్వామ్యం మెరుగుపరుస్తుందని సంస్థ మంగళవారం ప్రకటించింది. డీలర్ నెట్‌వర్క్‌ను పెంపొందించడంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. 2008 నుంచి మారుతీ సుజుకీ, యూనియన్ బ్యాంక్ మధ్య బంధం కొనసాగుతోంది. 3,00,000 పైచిలుకు కస్టమర్లకు యూనియన్ బ్యాంక్ వాహన రుణం సమకూర్చింది.

వొడాఫోన్ ఐడియా నిధుల బాట

రూ. 45,000 కోట్ల సమీకరణకు రెడీ



ఏప్రిల్‌లో బోర్డ్ భేటీ...

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియా భారీ స్థాయిలో నిధుల సమీకరణ చేపట్టనుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీలు, ఇతర రుణ మార్గాల ద్వారా రూ. 45,000 కోట్లు సమీకరించేందుకు కంపెనీ బోర్డు తాజాగా ఆమోదముద్ర వేసింది. రూ. 2.1 లక్ష కోట్ల భారీ రుణ భారంతో కుదేలైన కంపెనీ మనుగడ కోసం పలు సమస్యలను ఎదుర్కొంటోంది. త్రైమాసిక వారీగా నష్టాలు ప్రకటించడంతోపాటు.. వినియోగదారులను కోల్పోతోంది. నిధుల సమీకరణ నిర్వహణ కోసం బ్యాంకర్లను ఎంపిక చేసేందుకు యాజమాన్యానికి అధికారాలనిస్తూ బోర్డు తీర్మానించింది. దీనిలో భాగంగా ఏప్రిల్ 24న వాటాదారుల సమావేశాన్ని నిర్వహించనుంది. వాటాదారుల అనుమతి తదుపరి త్రైమాసికంలో ఈక్విటీ నిధుల సమీకరణను పూర్తి చేయనున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలియజేసింది.

వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్‌ఈలో 6% పతనమై రూ. 16 దిగువన ముగిసింది.

జాబ్ పాయింట్

తెలంగాణలో 563 గ్రూప్-1 పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 563

అర్హత

» ఆర్టీవో పోస్టుకు మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మిగతా పోస్టులన్నింటికీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఏసీఎల్ పోస్టులకు డిగ్రీతోపాటు సోషల్ వర్క్‌లో పీజీ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు.
» **వయసు:** యూనిఫామ్ సర్వీసులైన డీఎస్పీ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్), పోస్టులకు 35 ఏళ్లు కాగా, మిగిలిన పోస్టులకు 46 ఏళ్లు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల వరకు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఓటీఆర్ తప్పనిసరి:** కమిషన్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్)లో నమోదైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఓటీఆర్ లేని వారు కొత్తగా నమోదు చేసుకోవాలి. ప్రతి అభ్యర్థి దరఖాస్తులో తన ఓటీఆర్, మొబైల్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి.

ఎంపిక విధానం

ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ప్రాథమిక (ప్రిలిమినరీ) పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో 150 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో అర్హత పొందిన వారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు.

» **మెయిన్స్ పరీక్ష:** ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ ఇంగ్లిష్ 150 మార్కులు, పేపర్-1 సమకాలీన అంశాలపై సాధారణ వ్యాసం (జనరల్ ఎస్సే)-150 మార్కులు, పేపర్-2 చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం-150 మార్కులు, పేపర్-3 భారతీయ సమాజం, రాజ్యాంగం, పాలన-150, పేపర్-4 ఆర్థిక శాస్త్రం, అభివృద్ధి-150 మార్కులు, పేపర్-5 సైన్స్, టెక్నాలజీ అండ్ డెటా ఇంటర్‌ప్రిటేషన్-150, పేపర్-6 తెలంగాణ ఆలోచన(1948-70), సమీకరణ దశ(1971-90), తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వైపు(1991-2014)-150 మార్కులు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తులకు చివరితేది:** 14.03.2024.
» **దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం:** 23.03.2024 ఉదయం 10 గంటల నుంచి 27.03.2024 సాయంత్రం 5 గంటల వరకు;
» **ప్రాథమిక పరీక్ష:** 2024, జూన్ 9
» **మెయిన్స్:** సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
» **వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3000 అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్.. దేశ వ్యాప్తంగా రీజియన్ల వారీగా అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3000
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-100, తెలంగాణ-96.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. **వయసు:** 31.03.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **ఎంపిక విధానం:**ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్, బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్, బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్, బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్, బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 06.03.2024
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 10.03.2024.
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 490 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 490
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్)-03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్-సివిల్)-90, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్-ఎలక్ట్రికల్)-106, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రానిక్స్)-278, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)-13.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్-2024 స్కోరు ఉండాలి. **వయసు:** 01.05.2024 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.05.2024.
» **వెబ్‌సైట్:** www.aai.aero

ఆతిథ్య రంగం.. అవకాశాలు పదిలం!

» ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ-2024కి నోటిఫికేషన్ విడుదల
» బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం
» ఈ కోర్సు పూర్తి చేసుకుంటే ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు
» ఇంటర్మీడియెట్‌తో ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈకి దరఖాస్తు చేసుకోవచ్చు

ఆతిథ్య రంగం.. వేగంగా విస్తరిస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్న రంగం! జాబ్ మార్కెట్‌లో ఆతిథ్య రంగ నిపుణులకు ఎంతో డిమాండ్ ఉంది. హాస్పిటాలిటీ రంగంలో కెరీర్ కోరుకునే విద్యార్థులు హోటల్ మేనేజ్‌మెంట్, అనుబంధ కోర్సుల్లో.. చేరేందుకు మార్గం.. ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ!! ఇందులో ర్యాంకు సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో ఐహెచ్‌ఎం, రాష్ట్ర స్థాయిలో ఎస్‌హెచ్‌ఐఎం క్యాంపస్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌లో అడుగు పెట్టొచ్చు. తాజాగా.. 2024కు సంబంధించి ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈతో ప్రవేశం కల్పించే కోర్సు, దరఖాస్తుకు అర్హతలు, ప్రవేశ పరీక్ష విధానం, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..

ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక చాలా మంది ఇంజనీరింగ్ వైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి కారణం .. విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తాయనే అభిప్రాయమే. అదే అర్హతతో మరెన్నో వినూత్న కోర్సులు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైంది బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌గా పేర్కొనొచ్చు. కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని ఐహెచ్‌ఎంలలో ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. హాస్పిటాలిటీ రంగంలో ఉపాధి అవకాశాలు పొందొచ్చు అంటున్నారు నిపుణులు.

హాస్పిటాలిటీలో నిపుణుల కోసం

దేశంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్ తదితర కోర్సులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ఈఆర్‌లు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యా సంస్థ.. ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం). ఈ క్యాంపస్‌లలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును అందిస్తున్నారు. వీటిల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ.

78 ఇన్‌స్టిట్యూట్‌లు.. 12 వేల సీట్లు

ప్రస్తుతం జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లోని 78 హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 11,995 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో 21 ఇన్‌స్టిట్యూట్‌లు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 30 ఇన్‌స్టిట్యూట్‌లు,24 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, పీపీపీ విధానంలో రాష్ట్ర స్థాయిలో రెండు ఎస్‌హెచ్‌ఐఎం, ఒక పీఎస్‌యూ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు అందుబాటులో ఉంది. వీటి పర్యవేక్షణకు జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ సంస్థను కూడా పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ 2024

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ ఇలా

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 200 ప్రశ్నలకు జరుగుతుంది. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ (30 ప్రశ్నలు), రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ (30 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (30 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (60 ప్రశ్నలు), ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ (50 ప్రశ్నలు)ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.

ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్

ఎన్‌సీఎహెచ్‌ఎం-జేఈఈ ఫలితాల తర్వాత సీట్ల భర్తీకి ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుని తమ ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలతో ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేస్తే..అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్లు, విద్యార్థులు పొందిన ఎంట్రన్స్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు. గత ఏడాది రెండు రౌండ్లలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

కొలువులు ఇవే

బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి విస్తృత కొలువులు లభిస్తున్నాయి. గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్, ఫ్రంట్ డెస్క్ మేనేజర్, కిచెన్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్, సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ట్రిప్ అడ్వైజర్, బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్, చెఫ్స్ వంటి పలు ఉద్యోగాలు అందుకునే వీలుంది. ప్రారంభంలో సగటున రూ.నాలుగు లక్షల నుంచి రూ.అయిదు లక్షల వేతనం లభిస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 31
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024 ఏప్రిల్ 2 – ఏప్రిల్ 5
- పరీక్ష తేదీ: 2024, మే 11
- వెబ్‌సైట్: https://exams.nta.ac.in/NCHM/, www.nta.ac.in

బెస్ట్ స్కోర్‌కు మార్గం ఇలా

న్యూమరికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటిక్స్‌లో బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. అభ్యర్థులు హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా శాతాలు, లాభ-నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం-పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం-వేగం-దూరం, నిష్పత్తులు, జామెట్రీ వంటి వాటిపై పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ కోసం నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం, డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చిన ప్రశ్నకు అనువుగా, సమాధానం ఇచ్చే స్కిల్ సొంతం చేసుకోవాలి.

రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్

సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగమిది. ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా డేటా సఫీషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ఈ విభాగంలో మంచి మార్కులు పొందాలంటే.. స్కూల్ స్థాయిలోని చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీలో ముఖ్యమైన యుద్ధాలు-పరిణామాలు-పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు-అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్ కోసం ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, ఇటీవల కాలంలో అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీని కోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయడంతోపాటు దినపత్రికలు చదవడం, వాటిలోని కొత్త పదాలను తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన ఏర్పరచుకోవడం వంటివి లాభిస్తాయి.

ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగాన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న ఆసక్తి, దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు, సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

క్లుప్తంగా...

మహేశ్వరం ఎంపీపీ ఎన్నికలు నిర్వహించండి

ఫలితాలు మాత్రం వెల్లడించొద్దు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల ప్రజా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే ఫలితాలు మాత్రం తాము చెప్పేంతవరకు ప్రకటించొద్దని స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించకుండా మహేశ్వరం మండల అధ్యక్ష ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించడాన్ని సవాల్ చేస్తూ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు రత్లావత్ సునీత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించిన తర్వాతే ఎంపీపీ ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పీవీ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం...పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

కోహిర్‌ను మున్సిపాలిటీ చేస్తే అభ్యంతరాలేంటి?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా కోహిర్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించడానికి ఉన్న అభ్యంతరాలేమిటో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది. కోహిర్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోహిర్‌కు చెందిన మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రామ సభలో తీర్మానం చేసి 2024, జనవరి 30న వినతిపత్రం అందజేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. గతంలో మున్సిపాలిటీ ఉన్న కోహిర్‌ను మేజర్ గ్రామపంచాయతీగా మార్చారని తెలిపారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు నోటీసులు జారీ చేశారు.

ఎక్సైజ్ శాఖలో పదోన్నతులకు కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ శాఖలో సీఐలు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల హోదాల్లో పదోన్నతులు కల్పించేందుకు కమిటీ(డీపీసీ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2023–24, 2024–25 సంవత్సరాలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ సభ్యకన్వీనర్‌గా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్, సాధారణ పరిపాలన శాఖ లోని డిప్యూటీ లేదా జాయింట్ లేదా అడిషనల్ సెక్రటరీ హోదాలోని అధికారి సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సునీల్‌శర్మ ఉత్తర్వులు జారీచేశారు.

ఫిర్యాదు చేస్తే అంతు చూస్తాం



'మార్గదర్శి' బాధితులకు రామోజీ ముఠా బెదిరింపులు

- సీఐడీకి ఫిర్యాదు చేసినవారి ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు
- బాధితుల సంఘానికి సైతం బెదిరింపు ఫోన్ కాల్స్
- అక్రమాల డొంక కదులుతుండటంతో రాజగురివింద బెంబేలు
- సీఐడీ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్‌కు భారీగా బాధితుల ఫిర్యాదులు
- మార్గదర్శి బాధితుల సంఘానికి సైతం ఫోన్‌కాల్స్

గురివింద రామోజీ-7

'మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పైనే ఫిర్యాదు చేస్తారా ... మీ సంగతి తేలుస్తాం'

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు' అని సంఘం పెట్టేంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది'

'మీ ష్యూరిటీ పత్రాలు మా దగ్గర ఉన్నాయి.. మీ ఆస్తులు వేలం వేయిస్తాం'..

ఇవీ రాజగురివింద రామోజీరావు ఆర్థిక అక్రమాల పుట్ట.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి చందాదారులకు కొన్ని నెలలుగా వస్తున్న బెదిరింపులు. నేరుగా చందాదారుల ఇళ్లకే వచ్చి బెదిరిస్తుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మరికొందరికి రామోజీ ముఠా ఫోన్లు చేసి వేధిస్తోంది. కొందరిని తమ చిట్‌ఫండ్ కార్యాలయాలకు పిలిపించుకుని మరీ బెదిరిస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల పుట్ట బద్దలు కావడంతో రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. దశాబ్దాల తరబడి ఆయన, ఆయన కోడలు శైలజ వేధింపులు భరించిన చందాదారులు ప్రస్తుతం ధైర్యం చేసి ఫిర్యాదులు చేస్తుండటంతో రామోజీ ముఠా బెదిరింపుల పర్వానికి బరితెగించింది. దీంతో చందాదారుల భద్రతే లక్ష్యంగా ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ ప్రత్యేక వాట్సాప్ నంబరును అందుబాటులోకి తెచ్చింది. తాజాగా కొందరు చందాదారులు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘాన్ని' ఏర్పాటు చేసి రిజిస్టర్ చేయించడంతో ఈ వ్యవహారం కీలక మలుపు తిరిగింది.

ధైర్యంగా బాధితుల ముందడుగు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసును విచారిస్తున్న సీఐడీ.. బాధితులు ఫిర్యాదు చేసేందుకు 94931 74065తో వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వాట్సాప్ నంబరుకు ఇప్పటికే వేల సంఖ్యలో చందాదారులు ఫిర్యాదులు చేశారు. తమ అనుమతి లేకుండా చిట్టీలు పాడటం, చిట్ పాడుకున్న నగదు ఇవ్వకుండా రశీదు డిపాజిట్లుగా జమ చేయడం, ష్యూరిటీలు ఇచ్చినా తిరస్కరించి వేధించడం, తమ సంతకాలు ఫోర్జరీ చేయడం వంటి అక్రమాలపై బాధితులు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నారు. వీటిని సీఐడీ ప్రత్యేక విభాగం నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. వేధింపులకు పాల్పడ్డ పలువురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ మేనేజర్లు, ఇతర సిబ్బందిని సీఐడీ విచారిస్తుండటంతో రామోజీ బెంబేలెత్తుతున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం , సీఐడీ కార్యాచరణతో చందాదారులు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. విజయవాడ కేంద్రంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. బాధితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రత్యేకంగా 99481 14455 ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో కేవలం మూడు రోజుల్లోనే వందల సంఖ్యలో బాధితులు ఈ సంఘాన్ని సంప్రదించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అందరి ఫిర్యాదులను నమోదు చేస్తూ అటు సీఐడీ ద్వారా, ఇటు న్యాయపరంగా చర్యలు తీసుకునేందుకు ఆ సంఘం సన్నద్ధమవుతోంది.

బాధితులపై మార్గదర్శి వేధింపుల పర్వం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల పుట్ట బద్దలు కావడంతో రామోజీరావు హడలిపోతున్నారు. సీఐడీ అధికారులు కేసు నమోదు చేయడం, ఏకంగా తన ఇంటికే వచ్చి మరీ విచారించడంతో ఆయన బెంబేలెత్తుతున్నారు. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు బాధితులు కూడా దూకుడు పెంచడంతో ఏక్షణం ఏం జరుగుతుందోనని రామోజీ బేజారెత్తుతున్నారు. దీంతో కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు తన ముఠాలను ఆయన రంగంలోకి దించారు. సీఐడీ అధికారులు, బాధితుల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నవారిని లక్ష్యంగా చేసుకుని వారికి ఫోన్లు చేసి రామోజీ ముఠా వేధిస్తోంది. సీఐడీకి ఫిర్యాదు చేసిన చందాదారులను మొదట లక్ష్యంగా చేసుకుంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని వారిని బెదిరిస్తోంది. ఏకంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజ కిరణ్ చందాదారులకు ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. రామోజీ కోడలు శైలజ కిరణ్ పీఏ శశికళ, మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్లు స్వయంగా ఫోన్లు చేసి మరీ బెదిరిస్తుండటం ఆ సంస్థ దిగజారుడుతనానికి నిదర్శనం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అందుబాటులోకి తెచ్చిన ఫోన్ నంబరుకు కూడా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. 'అసలు సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేశారు.. మీ వెనుక ఎవరు ఉన్నారు.. ఎవరున్నాసరే మిమ్మల్ని కాపాడలేరు.. మీ సంగతి చూస్తాం.. అంతు తేలుస్తాం' అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

– సాక్షి, అమరావతి

న్యాయపోరాటానికి బాధితులు సిద్ధం..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది కాల్‌మనీ రాకెట్ గూండాల మాదిరిగా చందాదారుల ఇళ్లపై పడుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి మరీ బెదిరిస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు వ్యక్తులకే తెలియకుండా తాము ఘోస్ట్ చందాదారులుగా నమోదు చేసిన వారి ఇళ్లకు వెళ్లి దౌర్జన్యం చేస్తున్నారు. అసలు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తాము చందాదారులుగా చేరిన విషయమే తమకు తెలియదనివారు ఎంతగా చెబుతున్నా వినిపించుకోవడం లేదు. 'సీఐడీ అధికారులు అడిగితే మీరే చందాదారులుగా చేరారని చెప్పండి.. మీకు ఇబ్బందిరాకుండా చూస్తాం.. అంతేగానీ తెలియదని చెబితే మాత్రం మీరు మాకు భారీగా బకాయిలు ఉన్నారని కోర్టులో కేసులు వేస్తాం' అని హడలెత్తిస్తున్నారు. దాంతో తమకు తెలియకుండానే తమ పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సాగిస్తున్న ఆర్థిక అవకతవకలపై వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇక చందాదారుల కోసం ష్యూరిటీ సంతకాలు చేసిన వారి ఇళ్లకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది వెళ్లి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. 'మీరు ఇచ్చిన ఖాళీ చెక్కులు మా వద్ద ఉన్నాయి.. వాటిపై భారీ మొత్తం రాసి బ్యాంకులో జమ చేసి బౌన్స్ అయ్యేలా చేస్తాం. తరువాత కేసు పెట్టి అరెస్ట్ చేయిస్తాం' అని కొందరిని బెదిరించడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు చందాదారుల ఇళ్లకు వెళ్లి 'మీరు భారీగా బకాయి పడ్డారు...అందుకు ప్రతిగా మీ ఇళ్లు, ఆస్తులు వేలం వేయిస్తాం' అని వేధింపులకు దిగారు. చందాదారుల తరఫున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బందే ఫోర్జరీ సంతకాలు చేసేసి.. తిరిగి చందాదారులపైనే ఫోర్జరీ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. ఈ పరిణామాలతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం ద్వారా అటు సీఐడీని ఆశ్రయించడంతోపాటు మరోవైపు న్యాయపోరాటం చేసేందుకు ఉద్యుక్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో కీలక పరిణామాలు సంభవించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పలువురు ఐఎఫ్‌ఎస్‌ల బదిలీ

పలువురికి పోస్టింగ్‌లు కూడా.. మరికొందరికి అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎనిమిది మంది ఐఎఫ్‌ఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అదేవిధంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరికొంతమందికి బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న బి.షఫీఉల్లాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్పెషల్ కమిషనర్‌గాను, బి.ప్రభాకర్‌ను కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆర్ అండ్ డీ సర్కిల్ సీసీఎఫ్‌గా పనిచేస్తున్న ప్రియాంక వర్గీస్‌ను సీసీఎఫ్ (ఐటీ అండ్ డబ్ల్యూపీ)గా, మహబూబాబాద్ జిల్లా అటవీ అధికారి టి.రవికిరణ్‌ను మీసేవా డైరెక్టర్‌గా బదిలీ చేశారు. వరంగల్ జిల్లా అటవీ అధికారిగా ఉన్న అర్పణకు అరణ్యభవన్‌లో డీసీఎఫ్ (ఎస్ఎఫ్)గా, ఏటూరునాగారం వైల్డ్ లైఫ్, ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్‌గా ఉన్న అనూజ్ అగర్వాల్‌ను వరంగల్ జిల్లా అటవీ అధికారిగా నియమించారు. అలాగే దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న ఎస్.జే ఆషాకు ములుగు ఫారెస్ట్ కాలేజీ డీన్ (పర్సన్ ఇన్‌చార్జ్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక అమ్రాబాద్ ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ విశాల్ బత్తుల మహబూబాబాద్ జిల్లా అటవీ అధికారిగా బదిలీ అయ్యారు. పీసీసీఎఫ్ (ఎఫ్‌సీఏ)గా ఉన్న మోహన్‌చంద్ర పర్గెయిన్‌ను అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్), (చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్)గా, పీసీసీఎఫ్ (హరితహారం)గా పనిచేస్తున్న సి.సువర్ణను హైదరాబాద్‌లోని పీసీసీఎఫ్ కార్యాలయంలో పీసీసీఎఫ్ (కాంపా), సీఈవో (కాంపా)గా, అదనపు పీసీసీఎఫ్‌గా పనిచేస్తున్న సునీత ఎం.భగవత్‌ను అదనపు పీసీసీఎఫ్ (అడ్మిన్)గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎస్.శాంతారాంను పదోన్నతిపై మంచిర్యాలలోని కవాల్ టైగర్ రిజర్వ్ డైరెక్టర్‌గా, ఎస్.రాంబాబును ప్రమోషన్‌పై ప్రస్తుతం పనిచేస్తున్న హైదరాబాద్ సర్కిల్ డీసీఎఫ్/సీఎఫ్/ఎస్‌టీసీగా, సునీల్ ఎస్.హీరేమత్‌ను పదోన్నతిపై ప్రస్తుతం పనిచేస్తున్న నెహ్రూ జులాజికల్ పార్క్ క్యూరేటర్‌గానే కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.

నల్లగొండ, నిజామాబాద్‌లో వ్యవసాయ కాలేజీలు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి జిల్లాకు ఒక వ్యవసాయ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకోవాలని, దీనికోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో అగ్రికల్చర్ కాలేజీలు, ఆయిల్ పామ్, వ్యవసాయరంగంపై దావోస్‌లో చేసుకున్న ఒప్పందాలపై ఆ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ ప్రస్తుతం 8 వ్యవసాయ కాలేజీలు, 2 వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని, వ్యవసాయ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఉమ్మడి జిల్లాకు ఒక కాలేజీ ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం నల్లగొండ, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కాలేజీ అందుబాటులో లేదని, నిజామాబాద్ జిల్లా రుద్రూర్, నల్లగొండ జిల్లా కంపసాగర్‌లో కాలేజీలకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కోరారు.

తహసీల్దార్లకు మినహాయింపు

- ఈసీ తాజా ఉత్తర్వులతో ఎన్నికల బదిలీలు వారికి లేనట్టే !
- 40 మంది ఆర్డీఓలకు స్థానచలనం కలిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల బదిలీల నుంచి తహసీల్దార్లను మినహాయించనున్నారు. ఈ బదిలీల విషయంలో స్పష్టత ఇస్తూ కేంద్రఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసిన తాజా ఉత్తర్వులతో కేవలం ఆర్డీఓ స్థాయి వరకే బదిలీలు జరుగుతాయని రెవెన్యూ వర్గాలంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న, లేదా సొంత జిల్లాల్లో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందిని (తహసీల్దార్ స్థాయి వరకు) బదిలీ చేయాలని ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు పెద్దఎత్తున తహసీల్దార్ల బదిలీలు ఈ నెలలోనే జరిగాయి. అయితే, సొంత జిల్లా కాకుండా, సొంత లోక్‌సభ సెగ్మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని.. ఆ సెగ్మెంట్‌లో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని ఇటీవల మళ్లీ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ దాదాపు కసరత్తు పూర్తి చేసింది. లోక్‌సభ నియోజకవర్గ పరిధి ప్రకారం చూస్తే.. రాష్ట్రంలోని దాదాపు 600 మంది తహసీల్దార్లను మళ్లీ బదిలీ చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు త్వరలోనే ఉత్తర్వులు వెలువడాల్సి ఉండగా, తాజాగా ఈసీ జారీ చేసిన ఆదేశాలతో తహసీల్దార్ల బదిలీలకు రెండోసారి జరిపిన కసరత్తు నిలిచిపోయే అవకాశాలున్నాయని రెవెన్యూ సంఘాలు చెబుతున్నాయి. ఈసీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్‌ఓ) స్థాయి వరకే బదిలీలు చేయాల్సి ఉంటుందని, లోక్‌సభ ఎన్నికలకు ఆర్‌ఓలుగా జిల్లా కలెక్టర్లు, ఏఆర్‌ఓలుగా రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీఓ) వ్యవహరిస్తారని, ఆ స్థాయి వరకే బదిలీలుంటాయని అంటున్నాయి. దీంతో తహసీల్దార్ల బదిలీలు నిలిచిపోతాయని, ప్రస్తుతం జరిగిన బదిలీల మేరకు తహసీల్దార్లు సర్దుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది.

ఈసీకి సీఎస్ లేఖ

కాగా, సొంత లోక్‌సభ సెగ్మెంట్‌లోని రెవెన్యూ సిబ్బందిని బదిలీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని, లేదంటే తమను ఈ బదిలీల నుంచి మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈసీకి లేఖ రాసినట్టు సమాచారం. లోక్‌సభ నియోజకవర్గ నిబంధన ప్రకారం రెవెన్యూ శాఖలోని 60 శాతం మంది సిబ్బందికి బదిలీలు చేయాల్సి వస్తోందని ఆ లేఖలో ఆమె వెల్లడించినట్టు తెలిసింది. తాజాగా ఈసీ జారీ చేసిన వివరణ నేపథ్యంలో తహసీల్దార్ల మలి బదిలీల ప్రక్రియ నిలిచిపోనుండగా, దాదాపు 40 మంది ఆర్డీఓలకు స్థానచలనం కలుగుతుందని, ఈ మేరకు నేడో, రేపో ఉత్తర్వులు వెలువడుతాయని రెవెన్యూవర్గాల ద్వారా తెలిసింది.

హైకోర్టు జీపీలుగా 11 మంది

- ఏజీపీలుగా 44 మంది నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు 11 మందిని ప్రభుత్వ న్యాయవాదులు(జీపీ)గా, మరో 44 మందిని సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీ)లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో మరో మరికొంతమందికి జీపీలు, ఏజీపీలుగా అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.

జీపీలు వీరే..

రాష్ట్ర ప్రభుత్వం జీపీలుగా నియమించిన వారిలో ఎస్.ఎస్.అర్జున్ కుమార్, ఇ.రమేశ్ చంద్రగౌడ్, భూక్య మంగీలాల్ నాయక్, షాజియా పర్వీన్, శాంతి నీలం, బి.మోహనరెడ్డి, మురళీధర్‌రెడ్డి కాట్రం, ఎ.జగన్, శాంతాపూర్ సత్యనారాయణరావు, గడ్డం వీరా స్వామి, మహేశ్ రాజే ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో బస్సులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షాకేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం నుంచి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు బస్సు ఆపమన్నచోట ఆపాలని, సెంటర్ల వద్ద బస్సు ఎక్కే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అమెరికాలో కంపెనీ పెట్టలేకపోయానని..

- డిప్రెషన్‌లో సాఫ్ట్‌వేర్ సీఈఓ ఆత్మహత్య



కాశీ విశ్వనాథ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: అమెరికాలో కంపెనీ పెట్టలేకపోయాననే మనస్తాపంతో ఓ సాఫ్ట్‌వేర్ సీఈఓ ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. ఏపీ పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథ్ (38) తొమ్మిది నెలల కిందట అమీన్‌పూర్ పరిధిలోని దుర్గా హోమ్స్ ఫేజ్-2కు వచ్చి నివాసం ఉంటున్నాడు. నాలుగున్నరేళ్ల కిందట పార్ట్నర్‌షిప్‌లో మాదాపూర్‌లో ''ఎక్లాట్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ''కంపెనీ పెట్టాడు. దీనికి సీఈఓగా వ్యవహరిస్తున్నాడు. ఆరు నెలల కిందట అమెరికాకు వెళ్లి అక్కడ కూడా కంపెనీ పెట్టాలని అనుకున్నాడు. అది కుదరకపోవడంతో తిరిగి వెంటనే ఇండియాకు వచ్చేశాడు. అప్పటి నుంచి అమెరికాలో కంపెనీ పెట్టలేకపోయాయనే బాధతో డిప్రెషన్‌కు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం కాశీ విశ్వనాథ్ ఇంట్లోని పై అంతస్తులో ఉన్న ఆఫీస్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సైబర్ ముప్పును ఎదుర్కొందాం: శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల ముప్పు నుంచి ప్రజలను కాపాడటంలో పరస్పర సహకారం అందించాలని టెలికమ్ సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ కంపెనీల ప్రతినిధులను తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ కోరారు. టీఎస్‌సీఎస్‌బీ ఆధ్వర్యంలో సైబర్ నేర దర్యాప్తు, సైబర్ నేరాల కట్టడిలో సహకారంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎయిర్‌టెల్, జియో, వీఐ, బీఎస్ఎన్ఎల్‌తోపాటు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలైన అత్రియ టెలికమ్యూనికేషన్స్, ఎయిర్‌టెల్, జియో ఫైబర్ తదితర సంస్థ ప్రతినిధులు, టెలికమ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్), టెలికామ్ విభాగానికి చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ, సిమ్‌కార్డుల అక్రమ వినియోగం, మోసాలకు పాల్పడుతున్న వారి గుర్తించేందుకు టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి సాంకేతికతను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీలు విశ్వజిత్ కాంపాటి, ఎం దేవేందర్‌సింగ్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల నుంచి సైబర్ క్రైం అధికారులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.